PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 213 | విజయవాడ, గురువారం 6 మార్చి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 6 March 2025 | Rs

విహెచ్‌పి లింకులే కారణమా?

- 'చర్చిల పరిశీలన' వెనుక

2



ఢిల్లీ అంబేద్కర్ యూనివర్శిటీలో

ఎస్‌ఎఫ్‌ఐ ఘన విజయం

- ఎబివిపి ఘోర ఓటమి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ అంబేద్కర్ యూనివర్శిటీ (ఎయుడి) విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఘన విజయం సాధించింది. బిజెపి అనుబంధ ఎబివిపి ఘోర ఓటమిని చవి చూసింది. ఎబివిపి కేవలం రెండు స్థానాలకే పరిమితం అయింది. ఎయుడి విద్యార్థి సంఘ ఎన్నికలు మంగళవారం జరగగా, బుధవారం ఓట్ల లెక్కింపు నిర్వహించారు. మొత్తం 45 స్థానాలకు 24 స్థానాలను ఎస్‌ఎఫ్‌ఐ సొంతం చేసుకుని ఘన విజయం సాధించింది. ఎఐఎస్‌ఎ-5, ఎబివిపి-2, స్వతంత్రులు-14 స్థానాల్లో గెలుపొందారు. కాశ్మీర్ గేట్ క్యాంపస్‌లో 28 కౌన్సిలర్ సీట్లలో 18 స్థానాల్లో పోటీ చేసిన ఎప్ఎఫ్ఐ 16 స్థానాలను గెలుచుకుంది. కరంపురా క్యాంపస్‌లో 12 సీట్లలో 7 స్థానాల్లో పోటీ చేసి 5 స్థానాలను, లోధి క్యాంపస్‌లో మూడు సీట్లలో పోటీ చేసి ఒక స్థానాన్ని, కుతుబ్ ఇన్‌స్టిట్యూషనల్ ఏరియాలో పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ విజయం సాధించింది. వీరంతా ఎయుడిఎస్‌సి సెంట్రల్ ప్యానెల్ అయిన 5 మంది సభ్యుల సెంట్రల్ కోఆర్డినేషన్ కమిటీ (సిసిసి) ఎన్నుకుంటారు.

చారిత్రాత్మక విజయం: ఎస్‌ఎఫ్‌ఐ

ఆరేళ్ల తరువాత జరిగిన స్టూడెంట్ యూనియన్ ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ చారిత్రాత్మక విజయం సాధించిందని ఎస్‌ఎఫ్‌ఐ ఢిల్లీ అధ్యక్ష, కార్యదర్శులు సూరజ్ ఎలామోన్, ఐషే ఘోష్ పేర్కొన్నారు. ఇది ఎయుడి విద్యార్థుల విజయమని ఎస్‌ఎఫ్‌ఐ ఎయుడి కాశ్మీర్ గేట్ క్యాంపస్ యూనిట్ కార్యదర్శి షెఫాలి అన్నారు. 'ఎయుడి విద్యార్థులు ఎబివిపి మతతత్వ, విషపూరిత రాజకీయాలను పూర్తిగా తిరస్కరించారు' అని ఎస్‌ఎఫ్‌ఐ ఎయుడి కరంపుర గేట్ క్యాంపస్ కన్వీనర్ అనన్ అన్నారు.

ఆగిన 'చర్చిల పరిశీలన'

- వివాదాస్పద ఆదేశాలు ఉపసంహరణ
- ప్రజాశక్తి వార్తకు స్పందన

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము
కమీషనరు వారి కార్యాలయము, పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి
తాడేపల్లి, గుంటూరు జిల్లా – 522 501.

Memo. No. 2712164 /CPR&RD/D8/2024. Dt.05-03-2025.

విషయము :- CPR&RD భవనాలు మరియు లే అవుట్ అనుమతులు - పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణ 11 వ వార్డ్ రామయ్య హాలు వీధి నివాసి శ్రీ ప్రసన్న కుమార్ పెద్దిరెడ్డి వారి దరఖాస్తు మరియు ఈ కార్యాలయ సూచనలు ఉపసంహరించుట గురించి .

సూచిక :- ఈ కార్యాలయ మెమో నెం. 2712164/CPR&RD/D8/2024, Dt. 10.02.2025.

<<<>>>

పై విషయమును పురస్కరించుకుని ఈ కార్యాలయము నుండి తేది 10.02.2025 న వెలువడిన మెమో నెం. 2712164/CPR&RD/D8/2024 ను ఉపసంహరించడమైనది.

K ANAND,
OSD,
కమీషనర్, PR&RD వారి తరపున.

టూ
శ్రీయుత అందరూ జిల్లా పంచాయితీ అధికారులకు.

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా చర్చి నిర్మాణాల అనుమతులు పరిశీలించి, చర్యలు తీసుకోవాలంటూ జారీ చేసిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ఈ మేరకు పంచాయతీ రాజ్‌శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 'చర్చిలపై సర్కారు కన్ను' శీర్షికతో ప్రజాశక్తి మొదటిపేజీలో బుధవారం వార్తా కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిలో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణానికి చెందిన ఒక వ్యక్తి ఇచ్చిన దరఖాస్తు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం చర్చిలను లక్ష్యంగా చేసుకున్న తీరును, రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల పంచాయతీ అధికారులకు జారీ చేసిన ఆదేశాలు వివరంగా ప్రచురితమైనాయి. ఈ కథనం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. పంచాయతీ రాజ్‌శాఖ అధికారుల ను వివరణ అడిగినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు స్పందించారు. చర్చిల వివరాలు సేకరించాలంటూ జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకుంటున్నట్లు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. చర్చిల వివరాలు సేకరించాలంటూ గత నెల 10వ తేదిన ఆదేశాలు జారీ చేసిన పంచాయతీ రాజ్ కమిషనర్ ఓఎస్‌డి కె. ఆనంద్ పేరుతోనే తాజా ఉత్తర్వులు కూడా విడుదలయ్యాయి. ఈ ఉత్తర్వుల్లో వివాదాస్పదం గా మారిన చర్చిలు, అనుమతులు, వివరాల సేకరణ. చట్టపరమైన చర్యలు తదితర అంశాలను పంచాయతీ రాజ్‌శాఖ ప్రస్తావించలేదు. గత నెల పదవ తేదిన జారీచేసిన మెమో నంబర్‌ను ప్రస్తావించి, దానిని ఉపసంహరించుకున్నట్లు మాత్రం పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను అన్ని జిల్లాల పంచాయతీ అధాకారులకు పంపుతున్నట్లు తెలిపారు.

ఇది మత వివక్షే ... సిపిఎం

అంతకుముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు రాసిన లేఖలో రాష్ట్రంలో అన్ని పంచాయతీల పరిధిలో ఉన్న చర్చిలకు అనుమతులపై సమగ్ర విచారణ జరిపి, లేనివాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలు క్రైస్తవుల పట్ల మత వివక్షను పాటించడమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఎంత చిన్న కుగ్రామైనప్పటికీ అన్ని విశ్వాసాలున్న ప్రజలు సంస్థలు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు ఇతర ప్రార్ధనా మందిరాలను స్తోమతను బట్టి నిర్మించుకుంటున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. దీనికి ఏ ఒక్క మతంతోనూ సంబంధం లేదని పేర్కొన్నారు. అన్ని మతాలలో ఇటువంటి ప్రక్రియ సాధారణంగా జరుగుతుంటుందని, చాలా వాటికి అనుమతులు ఉండవని, ప్రత్యేకంగా అనుమతులు తీసుకోరని తెలిపారు. ఇప్పుడు అనుమతులు లేవనే సాకుతో చర్చిలపై మాత్రమే చర్యలు తీసుకోవాలనడం, ఒక మతంపై కక్షసాధింపు చర్యలకు మిగతా 7లో

డీలిమిటేషన్ పై దాటవేత

- వచ్చినప్పుడు చూద్దాం..!
- ముఖ్యమంత్రి చంద్రబాబు
- త్రిభాషా విధానంలో తప్పేముందని ప్రశ్న
- ఎక్కువ మంది పిల్లల్ని కనాలని సూచన
- ఢిల్లీలో బిజిబిజి

ప్రజాశక్తి - న్యూ ఢిల్లీ బ్యూరో

దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర ఆందోళన చెందుతున్న రెండు సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భిన్నంగా స్పందించారు. పార్లమెంటు నియోజకవర్గాల డీ లిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు బహిరంగంగానే ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఢిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబును ఈ విషయమై విలేకరులు ప్రశ్నించగా ఆయన సూటిగా జవాబియ్యలేదు. దాటవేత ధోరణిని అవలంబించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో చంద్రబాబు బుధవారం వేరువేరుగా సమావేశమైనారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్ పత్రాలను అందజేశారు. ఈ భేటీల అనంతరం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల సిఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్న డీ లిమిటేషన్‌పై మీ వైఖరి ఏమిటని విలేకరులు ప్రశ్నించారు. దీనికి ఆయన స్పష్టమైన జవాబియ్యలేదు. 'అది ఇప్పుడు రాలేదు కదా...వచ్చినప్పుడు చూద్దాం' అని బదులిచ్చారు. మరో కీలకాంశమైన భాషల అంశంపై కూడా ఆయన ఇదే విధంగా స్పందించారు. దక్షిణాది రాష్ట్రాలపై హిందీని కేంద్రం బలవంతంగా రుద్దుతోందని, అదే సమయంలో బిజెపి పాలనలో ఉన్న పలు రాష్ట్రాలో త్రి భాషా సూత్రాన్ని అమలు చేయడం లేదని ఆందోళనలు జరుగుతున్న విషయం తెలిసిందే. తమిళనాడు ముఖ్మమంత్రి స్టాలిన్ తమ రాష్ట్రంలో త్రి బాష విధానాన్ని అమలు చేసేది లేదని ప్రకటించారు. త్రిభాషా విధానం అమలులో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటి అంటూ అడిగిన మరో ప్రశ్నకు చంద్రబాబు 'దానిలో తప్పేమి ఉంది?' అని స్పందించారు. త్రి బాష విధానంలో తప్పేమి లేదు అని చెప్పారు.



కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు జ్ఞాపిక అందజేస్తున్న చంద్రబాబు, చిత్రంలో రామ్మోహన్‌నాయుడు

పిల్లలందరికీ ...'తల్లికి వందనం'

దేశం సంక్షోభాన్ని ఎదుర్కొబోతుందని, జనాభాను పెంచాల్సిన అవసరం ఉందని ఆయన మరోసారిచెప్పారు. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల మాదిరిగా ఎక్కువ మంది పిల్లలను కనాలని ప్రజలకు సూచించారు.రాష్ట్రంలో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలపైన, ఎన్‌డిఎ ఎలా ముందుకెళ్లాలనే అంశంపైన అమిత్ షాతో చర్చించినట్లు మిగతా 7లో

త్వరలో కొత్త రేషన్ కార్డులు

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో త్వరలో కొత్త రేషన్ కార్డులు అందజేయనున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శాసన సభలో బుధవారం జరిగిన చర్చలో భాగంగా మంత్రి సమాధానమిస్తూ... సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం రేషన్ కార్డుదారుల ఈకెవైసి రాష్ట్రంలో నిర్వహించామని, 91 శాతం కార్డుదారులకు ఈ ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. కార్డుల డిజైన్, ఇతర ప్రక్రియలు పూర్తయినట్లు తెలిపారు. . గత ప్రభుత్వం కావాలనే రేషన్ దుకాణాలను తొలగించి ఎండియు వాహనాలను రూ.1,600 కోట్లు ఖర్చు చేసి కొనుగోలు చేసిందని చెప్పారు. ఉప సభాపతి కె.రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ... రేషన్ కార్డు మల్టీపర్పస్‌గా వినియోగించుకోవడం వల్ల, ఆరోగ్యశ్రీ కోసం ఈ కార్డును చాలా మంది తీసుకుంటున్నారని, రేషన్ కోరకు మాత్రమే ఈ కార్డు కేటయిస్తే అక్రమాలు కొంత మేర తగ్గుతాయని చెప్పారు.

పిపిపి విధానంలో వైద్య కళాశాలలు

- మండలిలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొత్తగా తీసుకొచ్చిన వైద్య కళాశాలలను పబ్లిక్, ప్రైవేట్, పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) విధానంలో అభివృద్ధి చేస్తామని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వైద్య కళాశాలలను ఎప్పటిలోగా అందుబాటులోకి తీసుకొస్తారని శాసనమండలిలో బుధవారం వైసిపి సభ్యులు పి వరాహ వెంకట సూర్యనారాయణరాజు, ఎం అరుణ్‌కుమార్, సి సుబ్రహ్మణ్యం అడిగారు. వైద్య విద్యను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మంత్రి సత్యకుమార్ విమర్శించారు. మార్కాపురం, మదనపల్లి, పులివెందుల, ఆదోని, నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, బాపట్ల, పెనుగొండ, పార్వతీపురంలో ప్రతిపాదించిన 10 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి విధానంలో అభివృద్ధి చేయడం కోసం గుర్తించామని వెల్లడించారు. వైసిపి ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్స్ స్కీం తీసుకురావడం వల్లే ఇలా చేయాల్సి వచ్చిందన్నారు. వైద్య కళాశాలల్లో ఆర్థిక వృద్ధి కేవలం 15 శాతం మాత్రమే ఉందన్నారు. మిగిలిన 85 శాతం తాము చేయాలని వైసిపి సభ్యులు అడగడం భావ్యమా అని ప్రశ్నించారు.

శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పథకంలో భాగంగా తమ ప్రభుత్వం తీసుకొచ్చిన వైద్య కళాశాలలను భవిష్యత్తులో ప్రైవేటీకరణ చేస్తున్నారని చెప్పారు. సత్యకుమార్ జోక్యం చేసుకొని తాము పూర్తిగా ప్రైవేటీకరణ చేయడం లేదని, పిపిపి విధానంలో వెళ్తున్నామని సమాధానం చెప్పారు. పిపిపి విధానంపై ప్రతి కళాశాలకు ఒక సలహాదారుని నియమిస్తామన్నారు. కళాశాలల్లో కల్పించిన మౌలిక సదుపాయాలు, ఎంత ఖర్చు చేయాలి?, భూముల విలువ ఎంత అనే వివరాల ఆధారంగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వయబిలిటీ గ్యాప్ ఫండ్ ఇస్తాయని చెప్పారు. కళాశాల నిర్వహణ ఉంటుంది కాబట్టి మిగిలిన శాతం ప్రైవేట్‌కు ఉంటుందని, యాజమాన్యం మాత్రం ప్రభుత్వానికి ఉంటుందని వివరించారు.

ఫీజుల్లో వ్యత్యాసం రాదన్నారు. దీనిపై బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పిపిపి విధానం వల్ల వైద్య విద్యార్థులు, సామాన ప్రజలకు ఎలాంటి మేలు జరుగుతుందని ప్రశ్నించారు. మంత్రి అచ్చెన్నాయుడు జోక్యం చేసుకొని మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పిపిపి విధానంలో చేసిన జాతీయ రహదారులపై ప్రభుత్వానికి, ప్రైవేట్‌కు సంబంధం ఉందన్నారు. పిపిపి విధానం వల్ల సౌకర్యాలు పెరుగుతాయని, ఫీజులు కూడా పెంచబోమని చెప్పారు.

జగన్‌కు 'హోదా' రాదు!


- స్పీకర్ రూలింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్షనేత హోదా ఇవ్వడం సాధ్యం కాదని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. బుధవారం శాసనసభ ప్రారంభం కాగానే అధ్యక్ష స్థానంలో ఉన్న స్పీకర్ ఈ విషయాన్ని ప్రస్తావించారు. ప్రతిపక్షపార్టీకి మొత్తం సభలో ఉన్న సీట్లలో10శాతం సీట్లు అంటే 18 సీట్లు ఉంటేనే ప్రతిపక్షహోదా దక్కుతుందని, అందువల్ల వైసిపికి ఆ గుర్తింపు రాదని ఆయన రూలింగ్ ఇచ్చారు. రాజ్యాంగం,సభా నిబంధనల ప్రకారం స్పీకర్‌కు దురుద్దేశాలు ఆపాదించడం,సభాహక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని చెప్పారు. ఈ విషయం జగన్‌మోహన్ రెడ్డికి కూడా తెలుసని అన్నారు. అయినా, తనను ఉద్దేశ్యాలు ఆపాదిస్తూ ఇప్పటి వరకు జగన్ చేసిన వ్యాఖ్యలను సంధి ప్రేలాపనలుగా పరిగణించి క్ష మిస్తున్నట్లు చెప్పారు. ఇదే ధోరణి భవిష్యత్తులోనూ కొనసాగితే ఎటువంటి చర్యలు తీసుకోవాలన్నది సభ నిర్ణయానికి వదిలివస్తున్నట్లు తెలిపారు.

నిందలు కాదు మీరేం చేశారో చెప్పండి

వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి వైసిపిపై నిందలు మోపడం తప్ప వారిచ్చిన హామీలు ఏమి నెరవేర్చారో చెప్పడం లేదని మాజీ సిఎం, వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బడ్జెట్‌లోనూ, గవర్నర్ ప్రసంగంలోనూ పరనింద, ఆత్మస్తుతి మాత్రమే సాగిందన్నారు. సూపర్‌సిక్స్‌తో పాటు మ్యానిఫెస్టోలో 143 హామీల గురించి అడిగితే సమాధానం రాదని, అబద్ధం, మోసం తప్ప చంద్రబాబుకు మరొకటి తెలియదని చెప్పారు. తొమ్మిది నెలల పాలనలో నాలుగు లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్ల గవర్నర్‌తోనూ చెప్పించారని అన్నారు. మ్యానిఫెస్టోలో చెప్పిన మూడువేల రూపాయల నిరుద్యోగ భృతి ఇవ్వకుండా ఎగ్గొట్టడం కోసమే తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని అన్నారు. వైసిపి హయాంలో 6.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ఎంఎస్‌ఎంఈ సెక్టార్లో 32,79,970 ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పారు. 18 ఏళ్ల నుండి 60 ఏళ్ల వయస్సున్న మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నా ఇవ్వలేదని తెలిపారు. వారిచ్చిన హామీని నెరవేర్చాలంటే రూ.32,400 కోట్లు కావాలని, బడ్జెట్లో రూపాయి కేటాయించలేదన్నారు. ఉచిత బస్సు పథకానికి రూ.3500 కోట్లు అవుతుందని, దానికీ నిధులు లేవని పేర్కొన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలుకు రూ.79,867 కోట్లు కావాలని, బడ్జెట్లో కేటాయించింది రూ.17,179 కోట్లు మాత్రమేనని చెప్పారు ఉద్యోగులకు ఇచ్చే డిఏ పెండింగ్ ఉన్నా ఇవ్వడం లేదని అన్నారు. పైగా ఉద్యోగుల జీతాల వ్యయం తగ్గించారని అన్నారు. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరులో వైసిపి వారికి ఏపథకాలు ఇవ్వొద్దని చంద్రబాబు చెప్పారని, రాజ్యాంగానికి లోబడి ప్రమాణం చేసి ఇప్పుడు దారుణమైన వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రిగ్గింగ్ చేయడం చంద్రబాబుకే చెల్లిందని ఆయన అన్నారు. శ్రీకాకుళంలో టీచర్లు గట్టిగా బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదాకు సీట్ల సంఖ్యకూ సంబంధం లేదని, అయినా ప్రభుత్వం మొండివాదన చేస్తోందని అన్నారు. జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ కార్పొరేటర్‌కు ఎక్కువ, ఎమ్మెల్యేకు తక్కువని ఒక ప్రశ్నకు జవాబుగా జగన్ మోహన్‌రెడ్డి చెప్పారు. ఆయనకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.



యథాతథ స్థితినే కొనసాగించాలి

- లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య, సరిహద్దు విషయంలో 30 ఏళ్ల వరకు మార్పులు వద్దు
- తమిళనాడు అఖిల పక్ష సమావేశం ఏకగ్రీవ తీర్మానం

చెన్నయ్ : లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య, సరిహద్దుల విషయంలో యథాతథ స్థితినే కొనసాగించాలని తమిళనాడులోని అఖిల పక్షాల సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. రాబోయే 30 ఏళ్ళ వరకు మార్పులు చేయరాదని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. డీలిమిటేషన్ అంశంపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు, సీట్ల సంఖ్యను తగ్గించకుండా నివారించేందుకు పోరాటాన్ని సాగించేందుకు దక్షిణాది రాష్ట్రాల నుండి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సంయుక్త కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయాలని కూడా ఈ సమావేశం నిర్ణయించింది. లోక్‌సభ స్థానాల పునర్వ్యవస్థీకరణ (డీలిమిటేషన్) అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్ అధ్యక్షతన చెన్నయ్‌లో బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షమైన ఎఐఎడిఎంకెతో పాటు డిఎంకె మిత్రపక్షాలు అన్నీ హాజరయ్యాయి. అయితే బిజెపి, దాని భాగస్వామ్య పక్షాలు అయిన తమిళ్ మనీల కాంగ్రెస్, నటుడు సీమన్ నేతృత్వంలోని నామ్ తమిళర్ కట్చి ఈ సమావేశాన్ని బహిష్కరించాయి.

సీట్ల తగ్గింపు సమజసం కాదు..

'జనాభా నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తున్న దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ స్థానాలను తగ్గించాలనుకోవడం సమర్థనీయం కాదు. 1971 జనాభా లెక్కల ప్రాతిపదికగానే పునర్విభజన ఉంటుందని 2000 సంవత్సరంలో మిగతా 7లో

ఏప్రిల్ 2 నుండి భారత్, చైనాలపై ప్రతీకార సుంకాలు

అమెరికా కాంగ్రెస్ సమావేశంలో ట్రంప్ ప్రసంగం

వాషింగ్టన్ : భారత్, చైనాలపై ప్రతీకార సుంకాలు ఏప్రిల్ 2 నుండి అమలు చేస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. సుదీర్ఘకాలంగా చైనా, భారత్‌లతో సహా పలు దేశాలు అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు విధిస్తున్నాయని ఇది సరికాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే తాము కూడా వచ్చే నెల నుండి ప్రతీకార సుంకాలు విధించాలని నిర్ణయించామని చెప్పారు. అమెరికా కాంగ్రెస్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో ట్రంప్ తొలిసారిగా మంగళవారం రాత్రి ప్రసంగించారు. "దశాబ్దాల తరబడి ఇతర దేశాలు మాపై టారిఫ్‌లు అమలు చేస్తూ వచ్చాయి. ఇప్పుడు మా వంతు వచ్చింది. ఆ చర్యలనే ఆ దేశాలపై మేం ప్రయోగిస్తాం. యురోపియన్ యూనియన్, చైనా, బ్రెజిల్, భారత్, మెక్సికో, కెనడా ఇలా లెక్కలేనన్ని దేశాలు మన ఉత్పత్తులపై అధికంగా టారిఫ్‌లు విధిస్తున్నాయి. ఇదంతా అన్యాయం" అని ఆయన వ్యాఖ్యానించారు. వంద శాతానికి పైగా ఆటో టారిఫ్‌లను భారత్ తమపై విధించిందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ సమావేశంలో ట్రంప్ సుదీర్ఘ ప్రసంగం చేశారు. గంటా 28నిముషాల పాటు ప్రసంగించిన రికార్డు ఇప్పటివరకు అధ్యక్షుడు బిల్ క్లింటన్ పేరిట వుండగా, ఇప్పుడు ట్రంప్ దాన్ని అధిగమించి గంటా 40నిముషాల పాటు ప్రసంగించారు. అనేక అంశాలను ప్రస్తావిస్తూ సుదీర్ఘంగా మాట్లాడారు. మొదటి ఆరు వారాల్లో తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సాహసోపేతమైన సామాజిక, ఆర్థిక విధానాలను ఆయన వివరించారు. అమెరికన్ల కలలు నెరవేరే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వాలు నాలుగేళ్ళలో లేదా ఎనిమిదేళ్ళలో చేయలేనివి తాము కేవలం 43 రోజుల్లో చేశామని చెప్పుకున్నారు. గత ఆరు వారాల్లో వంద ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశానని చెప్పారు. మరో 400 కార్యనిర్వహణా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డోజ్ పనితీరును ప్రస్తావిస్తూ మస్క్‌పై ప్రశంసలు కురిపించారు. ఇప్పుడే ప్రయాణం ఆరంభమైందని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రసంగిస్తుండగా రిపబ్లికన్ పార్టీ సభ్యుల నుండి హర్షాతిరేకాలు వ్యక్తమవగా, డెమోక్రటిక్ సభ్యుడొకరు ఆరోగ్య సంరక్షణ వ్యయంలో కోత గురించి ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. దాంతో ఆ సభ్యుడిని బయటకు పంపాల్సిందిగా స్పీకర్ ఆదేశించారు. వాణిజ్య యుద్ధం గురించి ప్రస్తావిస్తూ ట్రంప్, టారిఫ్‌ల వల్ల కొన్ని ఇబ్బందులను అమెరికా ఆర్థిక వ్యవస్థ మిగతా 7లో





హామీలు అమలు చేయకుండా

రైతులకు కేంద్రం ద్రోహం

- ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు
- రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు

2

సిఎస్ స్వయంగా విచారణకు హాజరుకావాలి : హైకోర్టు

ప్రజాశక్తి, అమరావతి

రాష్ట్రంలోని కింది కోర్టుల్లో ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (పిపి), అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (ఎపిపి) పోస్టుల భర్తీలో జాప్యంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ జాప్యానికి కారణాలు చెప్పాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. తదుపరి విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై వివరణ ఇవ్వాలని సిఎస్‌ను ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవి డివిజన్ బెంచ్ బుధవారం నిర్ణయం ప్రకటించింది.

పిపిలు, ఎపిపిలు, అసిస్టెంట్ సీనియర్ పిపి పోస్టులను భర్తీ చేయడం లేదంటూ లాయర్ తాండవ యోగేష్ వేసిన పిల్‌ను బుధవారం హైకోర్టు విచారించింది. ఆయన స్వయంగా వాదిస్తూ, కింది కోర్టుల్లో పెద్ద సంఖ్యల్లో పిపిలు, ఎపిపిల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. డ్రాఫ్ట్ రూల్స్ పేరుతో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతి ప్రతివాదన చేస్తూ, బిఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం అన్ని కోర్టుల్లో పిపిలు అవసరం లేదన్నారు. ఏ కోర్టుల్లో అవసరమో పరిశీలన జరుగుతోందన్నారు. దీంతో జాప్యానికి కారణాలను వివరించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగత హాజరుకు కావాలని హైకోర్టు ఆదేశించింది.

పోసానికి రిమాండ్

- కర్నూలు కేంద్ర కారాగారానికి తరలింపు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

సినీ నటుడు పోసాని కృష్ణమురళికి ఈ నెల 18 వరకు రిమాండ్ విధిస్తూ మంగళవారం అర్ధరాత్రి కర్నూలు మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అపర్ణ ఉత్తర్వులు జారీ చేశారు. మహిళలను అసభ్య పదజాలంతో దూషించారంటూ పోసానిపై జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు మలిశెట్టి రేణువర్మ 2024 నవంబర్ 14న ఆదోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో, పోలీసులు క్రైమ్ నెంబర్ 119/224తో బిఎన్ఎస్ 192, 353 (1)(3), 353(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇదివరకే గుంటూరు జైల్లో రిమాండ్‌లో ఉన్న పోసానిని ఆదోని మూడవ పట్టణ పోలీసులు ఆదోని కోర్టులో హాజరు పర్చేందుకు పిటి వారెంట్‌పై తీసుకొచ్చారు. ఇక్కడి కోర్టు న్యాయమూర్తి సెలవులో ఉండడంతో ఇన్‌ఛార్జి న్యాయమూర్తి, కర్నూలు మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అపర్ణ ఇంటికి తీసుకెళ్లి హాజరు పర్చారు. పోసానికి 14 రోజులు రిమాండ్ విధించడంతో పోలీసులు ఆయనను కర్నూలు కేంద్ర కారాగారానికి తరలించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

18 నుంచి ఎమ్మెల్యేలకు క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఈనెల 18 నుంచి 20 వరకు ఎమ్మెల్యేలకు ప్రత్యేక క్రీడా, సాంస్కృతిక లకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఈ మేరకు స్పీకర్ ఛాంబర్‌లో బుధవారం క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, ఎండి గిరీషా స్పీకర్‌తో భేటీ అయ్యారు. మార్చి 20న సిఎం చంద్రబాబు చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

పందికొక్కుల దాడి

- నాలుగు నెలల చిన్నారి మృతి

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

పందికొక్కుల దాడిలో నాలుగు నెలల పసిబిడ్డ మృత్యువాత పడిన సంఘటన పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం రవ్వారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రవ్వారం గ్రామంలోని బిసి కాలనీకి చెందిన నాయుడి కొండ గురువయ్య, దుర్గమ్మ దంపతులు చుట్టు పక్కల గ్రామాల్లో గాజులు అమ్ముకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె, నాలుగు నెలల బాలుడు ఉన్నారు. వీరికి ఇళ్లు లేకపోవడంతో కాలనీలో పరదాల డేరా వేసుకుని నివాసముంటున్నారు. బాలుడు నిద్రపోతున్న సమయంలో ఉయ్యాలలో ఉంచి బాలుడి తల్లి దుర్గమ్మ సమీపంలోని హోటల్ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో పందికొక్కులు చిన్నారిపై దాడి చేశాయి. చిన్నారి ముఖం, కాళ్లు, పొట్టపై కొరకడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. చిన్నారి తల్లి తిరిగి వచ్చేసరికి ఉయ్యాలోని బాలుడు రక్తం కారుతూ పడి ఉన్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో బాలుడు మృతి చెందాడు. బిడ్డ మృతదేహాన్ని ఒడిలో పెట్టుకుని దుర్గమ్మ రోధిస్తున్న తీరు అందర్నీ కంటతడి పెట్టించింది.

హామీలు అమలు చేయకుండా రైతులకు కేంద్రం ద్రోహం

- ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు
- రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు



విజయవాడ లెనిన్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి- యంత్రాంగం

కేంద్ర ప్రభుత్వం 2021లో ఢిల్లీ రైతు ఉద్యమ విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ద్రోహం చేసిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శించారు. వీటిని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన పోరాటం ఫలితంగా పంటలకు మద్దతు ధర ఇస్తామని, రైతాంగ సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. విజయవాడ లెనిన్ సెంటర్లో నిర్వహించిన ధర్నాలో వడ్డే మాట్లాడుతూ మద్దతు ధరలు, రైతులకు ఆర్థిక తోడ్పాటు వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వమే నియమించిన పార్లమెంటరీ కమిటీ చేసిన సూచనలను కూడా అమలు పరిచేందుకు చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. విద్యుత్ సవరణ చట్టాన్ని యథాతథంగా అమలుకు పూనుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. రైతుల అజమాయిషీలో ఉన్న ప్రాథమిక సహకార సంఘాలను, మత్స్యకార సహకార సంఘాలను, పాడి రైతుల సహకార సంఘాలను పెట్టుబడిదారులకు అప్పగించేందుకు చట్టం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ అన్ని పంటలకూ మద్దతు ధరలు ప్రకటించి అమలుకు పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ వైట్ బర్లీ పొగాకు కొనడం కుదరదని పొగాకు బోర్డు తెగేసి చెప్పడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ అటవీ హక్కుల 1/70 చట్టాన్ని అమలు చేయాలని, 60 సంవత్సరాలు నిండిన రైతులు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు, పది వేల రూపాయలు పింఛను ఇవ్వాలని కోరారు. ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ అధ్యక్షులు మర్రెడ్డి వెంకట్‌రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు యు.వీరబాబు, జాగృతి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరీదు ప్రసాద్ బాబు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయి, కార్మిక సంఘం నాయకులు కాసాని గణేష్ బాబు, రైతు నాయకులు జివి రంగారెడ్డి, వెంకటరెడ్డి, కొప్పుల విజయబాబు పాల్గొన్నారు.

'రైతును రక్షించండి - దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో పల్నాడు జిల్లా నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలో ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు భాషా, రైతు సంఘం నాయకులు ఏపూరి గోపాలరావు, పిడిఎం రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు రాంబాబు మాట్లాడుతూ.. స్వామినాధన్ కమిటీ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని, కేరళ తరహా రైతు రుణ విమోచన చట్టం చేయాలని, ధరల స్థిరీకరణ నిధిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కర్నూలు సుందరయ్య సర్కిల్, నంద్యాల బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వైఎస్ఆర్ జిల్లా కడప ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శ్రీకాకుళం, ఏలూరు, ప్రకాశం, విజయనగరం, పార్వతీపురంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.

సోమశిలకు నిధులు కేటాయించాలని మంత్రి నిమ్మలకు వినతి

నెల్లూరు జిల్లాలోని సోమశిల హైలెవెల్ కెనాల్‌కు బడ్జెట్లో నిధులు కేటాయించి కరువు ప్రాంతాన్ని ఆదుకోవాలని కోరుతూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలె వెంగయ్య మర్రిపాడులో వినతిపత్రం అందజేశారు. ఏటా మెట్ట ప్రాంతాల్లో కరువు విలయతాండవిస్తోందన్నారు. తాగునీటి వసతి లేక ఫ్లోరిన్ పీడిత ప్రాంతాలుగా మారడంతో గ్రామాలకు గ్రామాలే వలసలు వెళ్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం దృష్టి సారించి సోమశిల కెనాల్‌కు బడ్జెట్లో నిధులు కేటాయించి సాగు, తాగు నీరు అందించాలని కోరారు.

492 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - జగ్గంపేట(కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా జగ్గంపేటలో రూ.30.52 లక్షల విలువ చేసే 492 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను జగ్గంపేటలోని సిఐ కార్యాలయంలో ఎస్‌పి బిందుమాధవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా గంజాయి రవాణా అవుతుందన్న సమాచారంతో జగ్గంపేట శివారు జగనన్న కాలనీలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఒక కారులో 7 బస్తాలు, ఒక ఇంట్లో 10 బస్తాల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.30.52 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయితోపాటు రూ.2.78 లక్షల నగదు, 7 సెల్ ఫోన్లు, ఒక బైకు స్వాధీనం చేసుకుని 8 మందిని అరెస్టు చేశారు. గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన వనపర్తి బాపిరాజు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కిముడు కృపానందన్, కోడ ధనుంజరావు, పాంగి గోవిందరావు, తమిళనాడుకు చెందిన టి.రఘు, కుమారాన్ కృష్ణన్, కర్ణాటకకు చెందిన శంకర్, నవీన్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. వీరంతా ఏజెన్సీ నుంచి గంజాయిని జగ్గంపేటకు తరలించి, ఇక్కడి నుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు ఎస్‌పి తెలిపారు.

కనీస వేతనాల సవరణకు సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పని చేస్తున్న 50 లక్షల మంది కార్మికుల కనీస వేతనాలను సవరించాలని కోరుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విజయవాడలో కార్మిక శాఖ కమిషనర్ ఎంవి శేషగిరిరావును సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వివిఎల్ నరసింహారావు గురువారం కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. అనేక షెడ్యూల్డ్ పరిశ్రమల్లో కనీస వేతనాలను 7 నుంచి 12 సంవత్సరాలుగా పెంచలేదని, దీనివల్ల లక్షలాది మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కనీస వేతనాల సలహాబోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పథకాలను కొనసాగించాలని, గత ప్రభుత్వ హయాంలో ఈ పథకాలను నిలుపుదల చేయడంతో వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సంక్షేమ పథకాలను పున్నప్రారంభించాలని కోరారు. ఈ అంశాలపై లేబర్ కమిషనర్ శేషగిరిరావు స్పందిస్తూ... కనీస వేతనాల సలహా బోర్డు, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారని, త్వరలోనే భవన నిర్మాణ రంగ కార్మిక సంఘాలతో చర్చిలు జరుపుతామని తెలిపినట్లు సిఐటియు రాష్ట్ర నాయకులు చెప్పారు.

బడ్జెట్‌లో 12వ పిఆర్‌సి ఊసేలేదు

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన 12వ పిఆర్‌సి గురించి ప్రస్తావన లేదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి గోపిమూర్తి అన్నారు. శాసనమండలిలో రాష్ట్రబడ్జెట్ పై జరిగిన చర్చలో బుధవారం ఆయన మాట్లాడుతూ 2023 జులై 1 నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పిఆర్‌సి అమలు చేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని ఆశించారని తెలిపారు. తొమ్మిది నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు 12వ పిఆర్‌సి, ఐఆర్ ప్రకటించలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను గురించి ప్రస్తావన లేదన్నారు. సిపిఎస్‌కు మెరుగైన పథకాన్ని తీసుకొస్తామని చెప్పారని ఇప్పటివరకు దీనిపై చర్చించలేదన్నారు. 2004కు ముందు నియామకమైన ఉద్యోగులకు ఓపిఎస్ అమలు చేయాలని కోరారు. మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఆర్ట్,క్రాఫ్ట్ పోస్టులను భర్తీ చేయాలని తెలిపారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 5వేల ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పాఠశాల విద్యకు కేటాయింపులు తక్కువగా ఉన్నాయని చెప్పారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం, మరలా అదే విధానాలను కొనసాగిస్తోందన్నారు. దీనివల్ల వేలాది ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, పార్ట్ టైం ఉద్యోగుల వేతనాలు పెంచాలని కోరారు. కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేసేందుకు గత ప్రభుత్వం జివో 114ను తీసుకొచ్చిందని, దీనిని కూటమి ప్రభుత్వం కొనసాగించాలని కోరారు. ఎయిడెడ్ జూనియర్ కళాశాలలతో పాటు డిగ్రీ కళాశాలల్లో కూడా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కొనసాగించాలని కోరారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం తీసుకొచ్చిన రుణం అప్పా? సహాయమా? అని ప్రశ్నించారు. అప్పు అయితే కేంద్రం చెల్లిస్తుందా? రాష్ట్రం చెల్లిస్తుందా? అనే స్పష్టత ఇవ్వాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కౌలు రైతులకు ఆర్థిక సహాయంపై స్పష్టత లేదన్నారు. ప్రైవేట్ విద్య సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని కోరారు. బడ్జెట్ అప్పుల దిశగా వెళ్తునట్లు ఉందని వైసిపి సభ్యులు టి మాధవరావు విమర్శించారు. బడ్జెట్‌లో ఆర్థిక లోటు రూ.66వేల కోట్లు వరకు ఉందని చెప్పారు. ఇలానే అప్పులు చేస్తే 2029 నాటికి అప్పుల వల్లే రూ.1లక్ష కోట్లు వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. తెలంగాణలో ఉన్న సినిమా రంగాన్ని రాష్ట్రానికి తీసుకొచ్చే ప్రయత్నం చేయాలని చెప్పారు.


దీనివల్ల రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుందని సూచించారు. పండుల రవీంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించే అంశంపై కేంద్రప్రభుత్వంతో చర్చలు జరపాలని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో బిజెపి భాగస్వామ్యంగా ఉందని, కాబట్టి హోదా అంశాన్ని పున:పరిశీలించాలని కోరారు. 50 ఏళ్లు దాటిన ఎస్సి,ఎస్టి, బిసి, మైనార్టీ వారికి పింఛన్ సౌకర్యం కల్పిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని రామసుబ్బారెడ్డి చెప్పారు. బడ్జెట్‌లో అందుకు తగ్గట్టుగా కేటాయింపులు లేవన్నారు. జనసేన సభ్యుల పి హరిప్రసాద్ విజనరీ బడ్జెట్‌గా అభివర్ణించారు. రాష్ట్ర ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ రెక్కలు తొడిగిందన్నారు. టిడిపి సభ్యులు వేపాడ చిరంజీవి రావు గత ప్రభుత్వంలో తలసరి ఆదాయం తగ్గిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆదాయం పెరిగిందని చెప్పారు.

కుల వివక్షత, అంటరానితనం రూపుమాపే దిశగా సాంస్కృతిక చైతన్య ఉత్సవాలు

- కెవిపిఎస్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

కుల వివక్షతకు వ్యతిరేకంగా, అంటరానితనాన్ని రూపుమాపే దిశగా ఏప్రిల్ 11న మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి నాటి నుంచి నెల రోజుల పాటు బహుజన సాంస్కృతిక చైతన్య ఉత్సవాలను నిర్వహించాలని కెవిపిఎస్ పిలుపునిచ్చింది. ఒంగోలులో కెవిపిఎస్ రాష్ట్ర వర్క్‌షాప్ రెండు రోజుల పాటు నిర్వహించారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ నల్లప్ప అధ్యక్షతన జరిగిన వర్క్‌షాప్ అంశాలను ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి బుధవారం మీడియాకు తెలియజేశారు. ఈ ఉత్సవాల సందర్భంగా అంబేద్కర్ జీవిత విశేషాలతో కూడిన కళా ప్రదర్శనలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని వర్క్‌షాప్ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. 'సంఘం శరణం గచ్ఛామి' అంబేద్కర్ రూపకాన్ని ప్రదర్శించాలని అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారు నిర్ణయించినట్లు ప్రకటించారు. వర్క్ షాప్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ దేవేంద్ర మాట్లాడుతూ.. అంబేద్కర్ ఏ ఒక్క సామాజిక తరగతికి చెందిన వ్యక్తి కాదని యావత్ ప్రపంచం మేధావిగా కొనియాడబడే డాక్టర్ అంబేద్కర్ జీవితం రాష్ట్ర ప్రజలందరికీ స్ఫూర్తినిచ్చేందుకు ఈ రూపకం దోహదపడుతుందన్నారు. ఏప్రిల్ 11 నుంచి సామాజిక సమస్యల మీద ప్రజలను చైతన్యం చేస్తూ కులవివక్షత, అంటరానితనం రూపుమాపేందుకు కలిసి వచ్చే ప్రజాతంత్ర వాదులతో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కర్నూలు జిల్లాలో ప్రారంభమై రాష్ట్రంలోని 26 జిల్లాల మీదుగా పయనించి మే నెలాఖరులో విజయవాడలో ముగింపు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాల జయప్రదం చేయడానికి అన్ని సామాజిక తరగతులకు చెందిన ఉద్యోగ, కార్మిక, ప్రజాతంత్ర వాదులు సహకరించాలని కోరారు. వర్క్‌షాప్‌లో రాష్ట్ర కమిటీ సభ్యులు బి రఘురామ్, ఎండి ఆనంద్ బాబు, జి చిరంజీవి, క్రాంతి బాబు, నటరాజ్, రంగమ్మ, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.



ఆనేమడుగు గ్రామస్తులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న వ్యకాస నాయకులు

బిపిసిఎల్ కోసం బలవంతపు భూసేకరణ ఆపాలి

- వ్యకాసం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కావలి

బిపిసిఎల్ కోసం బలవంతపు భూసేకరణ ఆపకపోతే వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నెల్లూరు జిల్లా కావలి రూరల్ మండలంలో పర్యటించి, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆనేమడుగు రెవెన్యూ పరిధిలోని ఆరు గ్రామాలలో బిపిసిఎల్ కంపెనీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. భూమి ఇవ్వకపోతే మీకు ఎటువంటి నష్టపరిహారమూ రాదని ఆర్‌డిఒ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకోవడాన్ని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ గ్రామాలలో కావలి ఎడమ కాలువ కింద 27 వేల ఎకరాలలో రెండు పంటలు పండే సారవంతమైన భూములు ఉన్నాయని, ఈ భూములపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. 2013 చట్టం ప్రకారంగా ప్రజల అభిప్రాయాలు తీసుకొని భూములు తీసుకోవాలని, బలవంతంగా తీసుకోవడానికి ప్రయత్నిస్తే 17న ఆర్‌డిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళ పుల్లయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి, జొన్నలగడ్డ వెంకమరాజు, మారుపూడి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విహెచ్‌పి లింకులే కారణమా?

- 'చర్చిల పరిశీలన' వెనుక


ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణమైన చర్చిలకు అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయంపై సమగ్ర విచారణ జరిపి, అనుమతులు లేని వాటిపై చర్యలు తీసుకోవాలంటూ పంచాయతీరాజ్ శాఖ జారీ చేసిన ఆదేశాల వెనుక విహెచ్‌పి లింకులు ఉన్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ వివరాలకోసం దరఖాస్తు చేసుకున్న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణానికి చెందిన వ్యక్తికి విహెచ్‌పితో సంబంధాలు ఉన్నట్లు సమాచారం. వృత్తి రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్న ఆయన అప్పుడప్పుడు పాలకొల్లు వస్తుంటారని, విహెచ్‌పి కార్యకలాపాల్లో పాల్గొంటూ ఉంటారని స్థానికులు చెబుతున్నారు. సినిమా రంగానికి చెందిన వారితో కూడా పరిచయాలున్నాయని సమాచారం. చర్చిల స్థలాలను వివాదాస్పదం చేయడానికి ఆయన ప్రయత్నించడం ఇదే మొదటి సారి కాదు. పశ్చిమగోదావరి జిల్లాల్లో ఈ తరహా ప్రయత్నాలను ఆయన గతంలోనే చేసినట్లు తెలిసింది. దీంతో ఈ విషయమై కొంతకాలంగా చర్చ సాగుతోంది. గత అక్టోబర్‌లో కూడా సమాచార హక్కు చట్టం కింద ఆయన ఇవే వివరాలను కోరినట్లు తెలిసింది. దానిపై అధికారులు పరిశీలన చేయడానికి ప్రయత్నించగా స్థానికంగా తీవ్రస్థాయిలో దుమారం రేగింది. గత నవంబర్ 12వ తేదిన సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట చర్చిల నిర్వాహకులు, పాస్టర్లు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు వెనక్కి తగ్గారు. దీంతో ఆయన రాష్ట్రస్థాయిలో పంచాయతీ రాజ్‌శాఖను ఆశ్రయించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి కూడా అయిన పవన్ కల్యాణ్‌కు బిజెపితో సన్నిహిత సంబంధాలుండటం, కొంత కాలంగా సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తుండటంతో ఆయన పని సులవైందని భావిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లోనే పంచాయతీ రాజ్ శాఖ వివాదాస్పద ఆదేశాలు జారీ చేయడం వెనుక విహెచ్‌పి లింకులు, సినీ పరిచయాలు ఉపయోగపడి ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విషయంపై ప్రజాశక్తిలో వార్త ప్రచురితం కావడం, సిఎం కార్యాలయం జోక్యంతో ఉత్తర్వులు వెనక్కి తీసుకున్నా, టిడిపి, జనసేన సంబంధాలపై చర్చకు ఈ పరిణామం దారితీసింది. తమకు బలమైన పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రంగా ఈ తరహా వివాదం చోటుచేసుకోవడం పట్ల టిడిపి శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

14న 'ఉక్కు' ఆందోళనలను జయప్రదం చేయండి

- పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా అఖిలపక్ష రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాలు, ర్యాలీలను జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1483వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్ ఎల్ఎంఎం, డబ్ల్యుఆర్ఎం, ఎంఎంఎస్ఎం విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు డి.ఆదినారాయణ, రామచంద్రరావు, జె.రామకృష్ణ మాట్లాడారు. దీక్షల్లో డి.దేముడు, కె.రాజబాబు, డి.రమేష్, వర్మ, రాజేశ్వర్‌రావు, రాంబాబు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డెల్టా ఆధునీకరణతో ముంపు సమస్యకు పరిష్కారం

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డెల్టాల ఆధునీకరణ ద్వారా రాష్ట్రంలో జల వనరులను సద్వినియోగం చేసుకోవడంతోపాటు ముంపు సమస్యను పరిష్కరించుకోవచ్చని జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కాలువలు, చెరువుల్లో ఆక్రమణలు, శివారు భూములకు నీరు అందకపోడం, పైనున్న భూములు ముంపునకు గురవడం వంటి సమస్యలపై బుధవారం అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా,గోదావరి బేసిన్లోని మురుగునీరు దాదాపు కొల్లేరు లోకే వస్తున్నాయని, ఇది ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి వెళ్లాల్సి ఉన్నా ఆక్రమణలతో నిలిచిపోతోందని తెలిపారు. మొత్తం డెల్టా ప్రాంతం అంతా ఇదే సమస్యగా ఉందని వివరించారు. డ్రెయిన్లు పూడిక తీయాల్సిన అవసరం ఉందని చెప్పారు. దీనిపై ప్రణాళికలు తయారు చేయాలని సిఎం కూడా చెప్పారని వివరించారు. లస్కర్ల సంఖ్య కూడా తక్కువగా ఉందని, వారిని కూడా నియమించుకుంటామని తెలిపారు. సాగునీటి సంఘాలతో మంచి ఫలితాలు వస్తున్నాయని వివరించారు.

హంద్రీనీవా పూర్తే లక్ష్యం

రాయలసీమ పరిధిలోని హంద్రీ నీవా సుజల స్రవంతి పథకాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని రామానాయుడు చెప్పారు. గతంలో జగన్ రాయలసీమనుండి ముఖ్యమంత్రిగా ఉండి పనులు చేయకుండా సీమ ద్రోహిగా మిగిలిపోయాడని అన్నారు. రాష్ట్ర బడెట్లో రూ.3,243 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఈ ప్రాంత రైతులు వారి సమస్యల పరిష్కారం కోసం తాడేపల్లిలోని జగన్‌ప్యాలస్ ముందు ధర్నా చేయాలని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులకు నీరందించేందుకు రూ.864 కోట్లతో ఒప్పందం చేసుకున్న వైసిపి ప్రభుత్వం ఒక్కపని కూడా చేయలేదని తెలిపారు. పైపులు తీసుకొచ్చి రూ.200 కోట్లు బిల్లులు మాత్రం వసూలు చేశారని అన్నారు.

మార్చి @10,353 కోట్లు

- ఆదాయ అంచనా!
- శాఖలకు దిశానిర్దేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఇంకొద్ది రోజుల్లో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసిపోతున్న నేపథ్యంలో చివరి నెల (మార్చి)లోనే రు.10,353 కోట్లు ఆదాయం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ మేరకు ఆర్థిక శాఖ అధికారులు ఒక నివేదికను రూపొందించారు. దీని ప్రకారం మొత్తం ఆర్థిక సంవత్సరంలో రు. 1,02,154 కోట్లు ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. తొలి తొమ్మిది నెలల్లో వచ్చిన ఆదాయం కన్నా ఈ అంచనాలు అధికంగా ఉండడం విశేషం. 2024-25 బడ్జట్‌లోరు 1,09,872 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేసిన సంగతి తెలిసిందే. తాజా నివేదిక ప్రకారం డిసెంబర్ వరకు కేవలం రు.71,095 కోట్లు మాత్రమే సమకూరాయి. అంటే నెలకు సుమారుగా 7,900 కోట్లు మాత్రమే ఖజానాకు చేరింది. అయితే చివరి మూడు నెలల్లో నెలకు భారీ మొత్తంలో వస్తాయని అంచనాలు సిద్ధంచేసుకున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో అనుకున్న లక్ష్యం సాధించలేదని సమాచారం. ఇక చివరి నెలల్లో పాత తగ్గుదల కలుపుకొని 12 నుంచి 13 వేల కోట్లు రావాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత అంచనాల మేరకు వాణిజ్య పన్నుల ద్వారా 53 వేల కోట్లు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఇందులో జిఎస్‌టి ద్వారా 34,295 కోట్లు, పెట్రోలియం ఉత్పత్తులపై వ్యాట్ ద్వారా 17,151 కోట్లు వస్తాయని భావిస్తున్నారు. ఇక మద్యంపై వ్యాట్ ద్వారా 975కోట్లు వస్తాయని భావిస్తున్నారు. మద్యం ఆదాయానికి సంబంధించి 2,186 కోట్లు, స్పెషల్ మార్జిన్ ద్వారా 905 కోట్లు, స్టాంపులు రిజిస్ట్రేషన్ల ద్వారా 750 కోట్లు, వాహన పన్నుల ద్వారా 350 కోట్లు, గనుల ద్వారా 623 కోట్లు, పన్నేతర ఆదాయంగా 826 కోట్లు వస్తాయని అంచనా వేశారు.

అంశాల వారీగా వచ్చే ఆదాయంపై అంచనాలు (రూ. కోట్లలో)

విభాగం	మార్చిలో	వార్షికాంతానికి
జిఎస్‌టి	3,439	34,295
పెట్రోలియం	1,720	17,151
ఎక్సయిజ్ వ్యాట్	98	975
వృత్తి పన్ను	20	201
పాత బకాయిలు	38	379
ఎక్సయిజ్	2,187	20,939
స్పెషల్ మార్జిన్	905	8.671
రిజిస్ట్రేషన్లు	750	8,639
వాహన పన్ను	350	4,411
ఇతర పన్నులు	20	477
గనులు	623	3,518
అటవీ	3	36
నాన్ టాక్స్	200	2,463

వివేకా హత్యకేసులో ప్రత్యక్ష సాక్షి రంగన్న మృతి



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి వాచ్‌మెన్ రంగన్న (85) మృతి చెందారు. బుధవారం సాయంత్రం తీవ్రమైన ఆయాసంతో బాధపడుతుండడంతో ఆయనను బంధువులు పులివెందుల నుంచి కడప సర్వజనాస్పత్రికి తరలించారు. జిజిహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తనూజ్‌రెడ్డి, కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలోని వైద్యనిపుణులు వైద్యసేవలు అందించారు. ఆస్పత్రికి వచ్చిన 30 నిమిషాల వ్యవధిలోనే పరిస్థితి విషమించడంతో రంగన్న మృతి చెందినట్లు ఆర్‌ఎంఒ వై శ్రీనివాసులు తెలిపారు. రంగన్న కొన్నేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. ఆయన మాజీ మంత్రి వివేకా హత్య కేసులోని ప్రధాన సాక్షుల్లో ఒకరు. ఆయన మృతి కేసు పురోగతిపై ఏ మేరకు ప్రభావం చూపించే అవకాశం ఉందో వేచి చూడాల్సి ఉంది. రంగన్న మృతిపై పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్ సిబిఐ అధికారులకు సమాచారం ఇచ్చారు.

భార్యను హత్య చేసిన భర్త

ప్రజాశక్తి - బుట్టాయగూడెం (ఏలూరు జిల్లా)

దంపతుల మధ్య వివాదాల కారణంగా భార్యను భర్త హత్య చేశాడు. ఈ ఘటన ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలోని బూరుగుగూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీలుగుమిల్లి మండలం చంద్రమ్మ కాలనీకి చెందిన పండు సాయికిరణ్, బుట్టాయగూడెం మండలం బూరుగువాడ గ్రామానికి చెందిన గొడ్డ రేఖామాధురి నాలుగేళ్లుగా ప్రేమించుకుని ఎనిమిది నెలల క్రితం వివాహం చేసుకున్నారు. రేఖామాధురి జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్నారు. భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ క్రమంలో వారు రేఖామాధురి పుట్టింటికి వచ్చారు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మళ్లీ వారిద్దరూ గొడవపడగా సాయికిరణ్ చున్నీతో రేఖామాధురి మెడను గట్టిగా లాగి హత్య చేశాడు. అనంతరం ఆమె తండ్రి శ్రీనుకు ఫోన్ చేసి "మీ అమ్మాయి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది" అని చెప్పాడు. ఇంటికి వచ్చిన కుటుంబీకులకు సాయికిరణే హత్య చేశాడని అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలవరం డిఎస్‌పి బి వెంకటేశ్వరరావు, జీలుగుమిల్లి సిఐ ఎం వెంకటేశ్వరరావు, ఎస్ఐ దుర్గామహేశ్వరరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సాయికిరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. హత్య కేసుగా దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆప్కాస్ రద్దు చేస్తే..

మున్సిపల్ కార్మికులను పర్మినెంటు చేయాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ధర్నా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆప్కాస్‌ను రద్దు చేస్తే..ముందుగా మున్సిపల్ రంగంలో పొరుగు సేవల కార్మికులందరినీ పర్మినెంటు చేయాలని, ప్రైవేటు ఏజెన్సీలు వద్దని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్మికుల నియామకంలో ప్రైవేటు ఏజెన్సీలు వద్దని, ఉద్యోగాలు పర్మినెంటు చేయాలని, 17 రోజుల సమ్మె కాలపు హామీలకు జిఓలు ఇవ్వాలనే తదితర సమస్యలపై బుధవారం విజయవాడ ధర్నా చౌక్‌లో ఫెడరేషన్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి నాయకులు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ జీవితాల్లో మార్పులు వస్తాయని మున్సిపల్ కార్మికులు భావించారని, వారి ఆశలను ప్రభుత్వం నీరు గార్చిందని తెలిపారు. అసెంబ్లీలో భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినా కార్మికులు కేటాయించింది సున్నా అని తెలిపారు. 17 రోజుల సమ్మె సందర్భంగా హామీలకు నాటి ప్రభుత్వం అంగీకరించిందని వాటికి జిఓలు ఇవ్వకుండా ఆర్థికశాఖ ఫైల్స్ తిప్పి పంపించిందని పేర్కొన్నారు. కార్మికులకు నాలుగేళ్లుగా డిఎ బకాయిలు, సరెండర్ లీవులు చెల్లించడం లేదని, జిపిఎఫ్ అకౌంట్లు ప్రారంభించకుండా మూడేళ్లుగా ఆర్థికంగా వేధిస్తున్నారని పేర్కొన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేసేటట్లు అయితే కార్మికులందరి ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని, అలా కాకుండా ప్రైవేటు ఏజెన్సీలకు ఇస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గ్రాట్యుటీ వర్తింపజేయాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ఇంజనీరింగ్ కార్మికులకు జిఓ నెంబరు 36 ప్రకారం జీతాలు పెంచి చెల్లించడం, గత సమ్మె కాలపు ఒప్పందాలైన రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.75000, దహన సంస్కారాలకు రూ.20 వేలు ఎక్స్ గ్రేషియా రూ.7 లక్షలు వంటి హామీలకు వెంటనే జిఓ ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఆప్కాస్ పెట్టి కార్మికులకు సంక్షేమ పథకాలు అందకుండా అన్యాయం చేసిందని తెలిపారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.నూకరాజు, కె.సాంబ్రాజ్యం, బి.సోమయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు పారిశుధ్య కార్మికులతో సమానంగా జీతాలు చెల్లించకుండా ఆరేళ్లుగా దగా చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర కోశాధికారి ఎస్.జ్యోతిబసు, నాయకులు ఉరికూటి రాజు, వెంకట్రావు, నాగరాజు, నాగేంద్రబాబు మాట్లాడుతూ ఎన్ఎంఆర్, కోవిడ్ బదిలీల పేరుతో తీవ్ర వేధింపులకు దిగుతున్నారని అన్నారు. కనీస వేతనం చెల్లించకుండా కారు డ్రైవర్లను తీవ్ర వేధింపుల పాలు చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలరాం, శ్రీనివాసరావు, కామాక్షమ్మ, సంఘయ్య, సాల్మన్, ఆదామ్, వెంగమ్మ, రమణ, మల్లిఖార్జున, తిరుమలరావు, ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికుల ఆందోళనలో అభివాదం చేస్తున్న సిఐటియు నాయకులు కె.ఉమామహేశ్వరరావు, తదితరులు



మార్కెట్‌కు వచ్చిన మిర్చి

పెరగని మిర్చి ధర

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి మార్కెట్లో గత కొంతకాలంగా ధరల తగ్గుదలతో రైతుల అల్లాడిపోతున్నారు. బుధవారం మిర్చి యార్డుకు భారీగా టిక్కిలు వచ్చాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 1,18,446 టిక్కిలు రాగా, పాత నిలువలతో కలిపి 1,30,346 టిక్కిలు అమ్ముడుపోయాయి. యార్డులో ఇంకా 58,217 టిక్కిలు నిల్వ ఉన్నాయి. మేలు రకం తేజ వెరైటీ క్వింటాలు కనిష్టంగా రూ.10,500, గరిష్టంగా 14 వేలు ధర పలికింది. సాధారణ రకానికి కనిష్టంగా రూ.9,500, గరిష్టంగా 13,700 ధర లభించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యంత డిమాండ్ కలిగిన ఆర్మూర్ రకం మిర్చికి కనిష్ట ధర రూ.10 వేలు, గరిష్ట ధర రూ .11,500 ధర రావడంతో రైతులు నిరాశ చెందారు.

మార్కెట్‌కు వచ్చిన సరుకు వచ్చినట్లు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు ఎగుమతి అవకాశాలు లేవని ధర తగ్గిస్తున్నారు. ఈ ధరకు ఇవ్వడానికి ఒప్పుకోకపోతే మిర్చికి నాణ్యత లేదనే సాకు చూపుతున్నారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం మిర్చి రైతుల పరిస్థితిని కేంద్రానికి విన్నవించగా కేంద్ర ప్రభుత్వం కనీస ధరను రూ.11,781గా నిర్ణయించింది. ఈ ధర కన్నా తక్కువకు వ్యాపారులు కొనుగోలు చేస్తే మిగతా డబ్బుఉ ప్రభుత్వం రైతులకు ఇస్తుందని ప్రకటించినా ఇంతవరకు మార్గదర్శకాలు విడుదల కాలేదు. ప్రభుత్వం రైతులు ఆశించిన ధర కన్నా తక్కువ ధరను నిర్ధారించడంతో వ్యాపారులు ధర పెంచడానికి ఇష్టపడడం లేదు. దీంతో, సుదూర ప్రాంతాల నుంచి గుంటూరు వచ్చిన మిర్చి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రవాణా ఛార్జీల భారంతోపాటు మంచి ధర కోసం రెండు మూడు రోజులు వేచి ఉండాల్సి వస్తోందని, ధర రాకపోవడంతో అయినకాడికి అమ్ముకుంటున్నామని రైతులు తెలిపారు.

హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-ఒంగోలు (ప్రకాశం జిల్లా)

ఓ హత్య కేసులోని ఐదుగురు నిందితులకు ఒంగోలు 3వ ఎడిజె కోర్టు బుధవారం నాడు జీవిత ఖైదు, జరిమానా విధించింది. ఒంగోలు మూడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి డి రాములు బుధవారం నాడు నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.7,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పామూరుకు చెందిన షేక్ ఖాసింపీరా (63)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో చిన్నకుమారుడు జిలాని బేల్దారిలో మేస్త్రీగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో జిలాని అదే గ్రామానికి చెందిన మజున్స నయబా ఏ సున్నాను బేల్దారి పనుల నిమిత్తం నిర్మల్ జిల్లాకు తీసుకొని వెళ్లారు. అక్కడ కొన్ని రోజులు పనిచేసి మేస్త్రీకి తెలియకుండా మజున్స నయబా తన స్వగ్రామానికి వచ్చేశారు. ఈ నేపథ్యంలో చోటు చేసుకున్న ఘర్షణల కారణంగా 2017 జనవరి 15న రాత్రి షేక్ ఖాసింపీరా తన టెంట్ హౌస్‌ను క్లోజ్ చేసి తన పెద్ద కుమారుడుతో ఇంటికి బయలుదేరారు. మజున్స నయబా ఏ సున్నా, మజున్నా రసూల్, ఏ మజున్నా బాబు, మజున్నా ఖాజా, మజున్నా మస్తాన్, మస్తాన్ సాహెబ్ కలిసి షేక్ ఖాసింపీరా, ఆయన కుమారుడిని కత్తితో, క్రికెట్ బ్యాట్ తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో షేక్ ఖాసింపీరా మృతి చెందారు. ఈ ఘటనపై పామూరు పిఎస్‌లో కేసు నమోదైంది. ఈ కేజులో కోర్టు పై మేరకు తీర్పు ఇచ్చింది. పోలీసులు సరైన సాక్ష్యాధారాలు సేకరించి నిందితులకు శిక్షపడేలా క్రియాశీలక పాత్ర పోషించిన అప్పటి పామూరు సిఐ రాజేష్ కుమార్, పామూరు ఎస్ఐ వి సాంబశివ రావు, కోర్టు కానిస్టేబుల్స్ నారాయణలను ప్రకాశం జిల్లా ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

ఆత్మగౌరవంతో మహిళలు జీవించాలి

- 8 నుంచి 'సూపర్ సిక్స్ ' అమలు చేయాలి
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి



ప్రజాశక్తి-నెల్లూరు

ఆత్మగౌరవంతో మహిళలు జీవించే విధంగా, అత్యాచారాలను నిరోధించేందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేసేందుకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరు నగరంలోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో బుధవారం మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజైన మార్చి 8 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను చైతన్య పరిచి పోరాటాలు, ఉద్యమాలు చేపట్టనున్నామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల ఒకటి నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత స్థాయిలో మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళల సాధికారతకు, సమానత్వానికి చర్యలు వేగవంతం చేయాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిందన్నారు. 30 సంవత్సరాల క్రితం ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మహిళల అభివృద్ధి కోసం కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాయని అన్నారు. ఈ ప్రకటలన్నీ కేవలం కాగితాలకు మాత్రమే పరిమితం కాగా సోషలిస్టు దేశాల్లో మాత్రమే ప్రాథమికంగా మహిళలకు సమానత్వాన్ని సమకూర్చడం వంటి చర్యలు అమలు అవుతున్నాయని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో మహిళలకు సమాన వాటాను జెండర్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకూ రూ.1500 అందజేస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని, బడ్జెట్‌లో దీనిపై ఎటువంటి కేటాయింపులూ లేవన్నారు. ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం అందజేస్తామన్నారని గుర్తు చేశారు. మహిళల ఆత్మగౌరవానికి ఎటువంటి భంగమూ వాటిల్లకుండా చట్టాలు అమలు చేయాలని కోరారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా కార్యదర్శి షేక్ రెహానాబేగం, జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ, ఐద్వా నగర నాయకులు కె పద్మ, సుబ్బమ్మ, శంషాద్, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ 'మెట్రో'కి నిధుల గుదిబండ!

- రూ.11,498 కోట్లు ఖర్చవుతుందని అంచనా
- భూ సేకరణకే రూ.882 కోట్లు
- సర్వేకూ ఆటంకాలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

మెట్రో రైలు నిర్మాణానికి విశాఖ నగరంలో సుమారు 46 కిలోమీటర్ల మేర భూ సేకరణకు రూ.882 కోట్ల అవసరమని మెట్రో రైల్ ప్రాజెక్టు అధికారులు తాజాగా ప్రతిపాదించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (యుఎంటిఎ)ని కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపుల కోసం ఏర్పాటు చేసింది. అయినా, కేంద్రం ఒక్క రూపాయి కూడా నిధులిచ్చే పరిస్థితి లేదని మెట్రో రైల్ విశాఖపట్నం అధికారుల నుంచి వినిపిస్తోంది. ఎక్కడెక్కడ ఎంత భూములు అవసరమన్న సర్వే చేపట్టడం ఖర్చుతో కూడుకున్నదైనందున రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనికోసం ఇంతవరకూ నిధులు కేటాయించలేదు.

భూ సేకరణ ఎలా?

భూ సేకరణకు క్షేత్రస్థాయిలో ఇళ్లు, రోడ్లు తొలగింపు, స్థలాల కోసం విస్తారమైన సర్వే చేపట్టాల్సి ఉండడంతో సాంకేతిక సిబ్బంది ముందుకు అడుగేయలేకపోతున్నారు. నగరం నడిబొడ్డు నుంచి 46 కిలోమీటర్ల మెట్రో కోసం భూ సేకరణ చేయాల్సి వస్తుందని సంబంధిత ఉన్నతాధికారి 'ప్రజాశక్తి'కి తెలిపారు. మెట్రో రైల్ ప్రాజెక్టుకు ప్రత్యేకంగా సర్వేయర్లు, సాంకేతిక సిబ్బంది అవసరం.. అయితే, విశాఖ కలెక్టరేట్‌లో సర్వేయర్ల వింగ్ దీనికోసం పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించడంతో మెట్రో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కనీసం పది మంది సభ్యుల బృందం మెట్రో భూ సేకరణ కోసం కొద్దిరోజుల పాటు పనిచేయాల్సి ఉంటుంది.

మారిన ప్లాన్ ప్రకారం 3 కారిడార్లు, రూ.11,498 కోట్ల ఖర్చు

గత వైసిపి ప్రభుత్వం 76.90 కిలోమీటర్లు, నాలుగు కారిడార్లతో 46.23 కిలోమీటర్ల మేర సుమారు రూ.18 వేల కోట్ల ఖర్చుతో విశాఖ మెట్రో రైల్‌కు ప్రతిపాదనలు, డిపిఆర్ సిద్ధం చేసింది. తాజాగా టిడిపి కూటమి ప్రభుత్వం దీన్ని మార్చి మూడు కారిడార్లకే పరిమితం చేసింది. రూ.11,498 కోట్లు ఖర్చవుతుందని,ః అంచనా వేసింది. అ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిపిపిలో సమకూర్చాల్సి ఉంది. మెట్రో రైల్ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను చేపట్టేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదని మెట్రో రైల్ అధికారులు చెప్తున్నారు. 42 స్టేషన్లను ప్లాన్ చేయాల్సి ఉంటుందని,. మొదట విడతగా రూ.6 వేల కోట్లయినా విడుదల చేయకపోతే సర్వే పనులు, భూ సేకరణ పనులు ముందుకు సాగవని అంటున్నారు. మొదటి కారిడార్‌లో స్టీల్‌ప్లాంట్ నుంచి కొమ్మాది వరకూ 34.4 కిలోమీటర్లు, రెండో కారిడార్‌లో గురుద్వార-పాత పోస్టాఫీస్ 5.07 కిలోమీటర్లు, మూడో కారిడార్‌లో తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకూ 6.75 కిలోమీటర్ల మేర పనులు చేపట్టాలి.

రెండో దఫా విస్తరణలో భోగాపురం ఎయిర్ పోర్టు వరకూ చేపట్టే మెట్రో పనులకు రూ.12 వేల కోట్లు అవసరం. నిధులు సమకూరితే ఈ ప్రాజెక్టు పూర్తికి ఆరేళ్ల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

యుఎంటిఎలో ఎవరెవరు?

తాజాగా ఏర్పాటైన యుఎంటిఎలో విఎంఆర్‌డిఎ కమిషనర్ కన్వీనర్‌గా, ఎపి కాలుష్య నియంత్రణ మండలి, రవాణా శాఖ, విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల కలెక్టర్లు, ఎపి ఇపిడిసిఎల్ సిఎండి, విశాఖ జివిఎంసి కమిషనర్, వాల్తేరు రైల్వే డిఆర్ఎం. ఆంధ్రా యూనివర్సిటీ, కాకినాడ జెఎన్‌టియు తదితర సంస్థల నుంచి నిపుణులు సభ్యులుగా ఉంటారు.

భారత్‌లో 85 వేల మంది సంపన్నులు

- గతేడాది 6 శాతం పెరుగుదల
- 2028 నాటికి 94,000కు చేరొచ్చు
- కుబేరులు 191 మందికి చేరిక
- నైట్‌ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్



హైదరాబాద్ : అధిక ధరలతో దేశంలో సామాన్యుల ఆదాయాలు తరిగిపోతుంటే.. ధనిక వర్గం సంపాదనలో రికార్డ్‌లను సృష్టిస్తోంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్‌ఫ్రాంక్ ఇండియా విడుదల చేసిన 'ది వెల్త్ రిపోర్ట్ 2025 రిపోర్ట్ ప్రకారం.. గతేడాది 2024లో దేశంలో సంపన్నుల సంఖ్య 6 శాతం పెరిగి 85,698కి చేరింది. ఇందులో 10 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.86 కోట్లు) ఆదాయం కలిగిన వారిని పరిగణలోకి తీసుకుంది. 2028 నాటికి ఈ సంఖ్య 93,753కు చేరొచ్చని అంచనా. మరోవైపు ఒకప్పుడు ఒక్క అంకెకు పరిమితమైన కుబేరుల సంఖ్య సైతం 191కి చేరింది. ఈ జాబితాలో గడిచిన ఏడాదిలో 12 శాతం పెరుగుదలతో కొత్తగా 26 మంది చేరారు. 2019లో ఈ సంఖ్య 7గా ఉంది. ఒక బిలియన్ డాలర్ల (దాదాపు రూ.8600 కోట్లు) కంటే ఎక్కువ సంపద కలిగిన వారిని బిలియనీర్లుగా వ్యవహరిస్తారు. భారత్‌లోని బిలియనీర్ల సంపద మొత్తం విలువ 950 బిలియన్ డాలర్లతో (దాదాపు రూ.82 లక్షల కోట్లు) సమానమని నైట్‌ఫ్రాంక్ అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బిలియనీర్ల ర్యాంకుల్లో చూస్తే అమెరికా (5.7 ట్రిలియన్లు), మెయిన్‌ల్యాండ్ చైనా (1.34 ట్రిలియన్ డాలర్లు) తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది.

అమెరికాలో అత్యధికంగా 9,05,413 మంది, చైనాలో 471,634 మంది, జపాన్‌లో 1,22,118 మంది, జర్మనీలో 69,798 చొప్పున ధనవంతులు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ధనవంతుల జాబితాలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. అధిక జనాభా పెరుగుదల దేశం దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి, పెరుగుతున్న పెట్టుబడి అవకాశాలు ప్రధానంగా వృద్ధి చెందుతున్న లగ్జరీ మార్కెట్‌ను ప్రతిబింబిస్తోందని నైట్ ఫ్రాంక్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శిశిర్ బైజల్ పేర్కొన్నారు. గడిచిన దశాబ్ద కాలంలో ప్రపంచ సంపదలో భారత్ కీలకంగా పెరిగిందన్నారు.

లగ్జరీ కార్లపైనే మోజు..

దేశంలోని సంపన్నులు ఎక్కువగా లగ్జరీ కార్లపైనే వ్యయాలు చేస్తున్నారని నైట్‌ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్‌లో తేలింది. అందులోనూ 18-35 ఏళ్ల లోపు వారు 1,25,000 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.1 కోటి పైగా విలువ) చేసే కార్లను 46.5 శాతం మంది సంపన్నులు కలిగి ఉన్నారు. ఆ తర్వాత అత్యధికంగా నివాసాలపై ఖర్చు చేస్తున్నారు. ప్రయివేటు విమానాల కొనుగోళ్లపై 15.1 శాతం మంది ఆసక్తి కలిగి ఉన్నారు.



కెసి కెనాల్ ఆయకట్టుకు నీరు అందించాలని ధర్నా చేస్తున్న రైతులు

సాగునీటి కోసం రైతుల ధర్నా

- కెసి కెనాల్ కార్యాలయం వద్ద ఆందోళన
- రైతుల ఆందోళనతో విడుదల

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

కెసి కెనాల్ ఆయకట్టుకు తక్షణమే నీటిని విడుదల చేయాలని నంద్యాలలోని కెసి కెనాల్ కార్యాలయం దగ్గర బుధవారం రైతులు ధర్నా చేశారు. రైతుల ఆందోళన గురించి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ తెలుసుకుని అధికారులతో మాట్లాడారు. సుంకేశుల జలాశయం నుంచి 1700 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి 650 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన ఆందోళననుద్దేశించి సమితి జిల్లా ఉపాధ్యక్షులు వైఎన్.రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి మాట్లాడారు. కెసి కెనాల్ ఆయకట్టు కింద సుమారు 70 వేల ఎకరాల్లో రబీ పంటలు సాగు చేశారని, ఏప్రిల్ 30 వరకు ఈ పంటలకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. అర్ధాంతరంగా నీటిని నిలుపుదల చేయడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ ఏడాది సుమారు 120 రోజుల పాటు కృష్ణా, తుంగభద్ర నదులు ప్రవహించి 1562 టిఎంసిల నీరు శ్రీశైలంలోకి చేరినప్పటికీ కెసి కెనాల్‌కు ఎందుకు నీటిని విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. అనంతరం కెసి.కెనాల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు.

అధికారుల వేధింపులు తాళలేక..

అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - కె.కోటపాడు (అనకాపల్లి)

అధికారుల వేధింపులు, దూషణలు తాళలేక అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం పోతనవలసలో బుధవారం చోటుచేసుకుంది. బాధితురాలి భర్త దేవుడు నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. పోతనవలస గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ పిఒ మంగతాయారు, సూపర్‌వైజర్ రాములమ్మ ఈ నెల 1న తనిఖీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ నూకరత్నం విధులను సక్రమంగా నిర్వహించలేదని, రికార్డులు సరిగ్గా లేవని పేర్కొంటూ మందలించారు. ఉన్న రికార్డులను తమతో పాటు ప్రాజెక్టు కార్యాలయానికి తీసుకెళ్లారు. ఈ నెల 3న నూకరత్నం ప్రాజెక్ట్ కార్యాలయానికి వెళ్లి తన రికార్డులు ఇవ్వాలని కోరారు. ఆ సమయంలో కూడా పిఒ, సూపర్‌వైజర్ ఆమెపై వ్యక్తిగత దూషణలకు దిగారు. పనితీరు బాగోలేదని, జీతం నిలిపివేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై నూకరత్నం చీమలమందు తాగారు. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు కె.కోటపాడు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై సిఐటియు నాయకులు ఆర్.ముత్యాల నాయుడు, ఈర్లె నాయుడుబాబు, ఎర్ర దేవుడు స్పందిస్తూ నూకరత్నంపై వేధింపులకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ పరంగా ఏమైనా తప్పులు జరిగితే సంజాయిషీ అడగాలేగానీ వ్యక్తిగత దూషణలు చేయకూడదని అన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నూకరత్నంను అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమారి పరామర్శించారు.

ద్విచక్ర వాహన రుణాల్లో మందగింపు

న్యూఢిల్లీ : ఆర్థిక వ్యవస్థ ప్రగతి తీరుకు అద్దం పట్టే వాహన పరిశ్రమ అమ్మకాలు ఒత్తిడి ఎదుర్కొంటుంది. దీంతో ముఖ్యంగా ద్విచక్ర వాహన రంగ రుణాలు మందగిస్తున్నాయని విత్త సంస్థల వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసే ప్రాథమిక స్థాయి ద్విచక్ర వాహన పరిశ్రమ మరింత ఒత్తిడిని ఎదుర్కొంటుంది. మరోవైపు రుణాలపై కొనుగోలు చేసిన వారు చెల్లింపులు చేయలేక విఫలం అవుతున్నారు. ఆదాయాలు సన్నగిల్లడమే ఇందుకు ప్రధాన కారణం. దాదాపు 75 శాతం ద్విచక్ర వాహనాలు రుణాలపైనే విక్రయించబడుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ద్విచక్ర వాహన అమ్మకాలు 6 శాతం తగ్గి 13.5 లక్షల యూనిట్లకు పరిమితమయ్యాయి. తీసుకున్న రుణాలు చెల్లించలేకపోవడం, కొత్త అమ్మకాలు లేకపోవడం ఫైనాన్స్ రంగంలోని విత్త సంస్థలను బెంబేలెత్తిస్తున్నాయి. గతేడాది సెప్టెంబర్ చివరి నాటికి 1.50 లక్షల కోట్ల ద్విచక్ర వాహన రుణ బకాయిలు పేరుకుపోయాయి. ఇంతక్రితం ఏడాది నాటికి ఈ సంఖ్య 1.19 లక్షల కోట్లుగా ఉంది. పెరుగుతున్న లోన్ డిఫాల్ట్‌లను అరికట్టడానికి 2019 తర్వాత మొదటిసారిగా రుణం ఇవ్వడంపై ద్విచక్ర వాహన ఫైనాన్షియర్లు వెనక్కి తగ్గుతున్నారు. ఇచ్చినప్పటికీ రుణ కాలపరిమితిని తగ్గిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మొత్తం ద్విచక్ర వాహన పరిశ్రమ రుణాల చెల్లింపులు వైఫల్యాలు 150 బేసిస్ పాయింట్లు పెరిగాయని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అఖిలేష్ రాయ్ పేర్కొన్నారు. తమ బ్యాంక్‌లో డిఫాల్ట్‌లు తులనాత్మకంగా 10-15 బేసిస్ పాయింట్లు పెరిగాయన్నారు. ద్విచక్ర వాహన ఫైనాన్సింగ్ విభాగంలో పెరుగుతున్న ఒత్తిడిని గమనిస్తున్నామని మరో బ్యాంక్ అధికారి పేర్కొన్నారు.

రూ.700 కోట్ల పబ్లిక్ ఇష్యూకు ఎక్సెల్‌సాఫ్ట్

- సెబీకి డిఆర్‌హెచ్‌పి సమర్పణ

ముంబయి : టెక్నాలజీ లెర్నింగ్, అసెస్‌మెంట్ సొల్యూషన్స్ సంస్థ ఎక్సెల్‌సాఫ్ట్ టెక్నాలజీస్ కొత్తగా ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానుంది. ఇందుకోసం కావాల్సిన ప్రతిపాదిత ముసాయిదా పత్రాల (డిఆర్‌హెచ్‌పి)ను సెబీకి సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా రూ.700 కోట్ల నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.210 కోట్ల విలువ చేసే ఫ్రెష్ ఈక్విటీ షేర్లను, ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్ఎస్) ద్వారా మరో రూ.490 కోట్ల షేర్లను విక్రయించాలని ప్రతిపాదించింది. ఈ నిధులను కొత్త ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన భూమి కొనుగోలు, ప్రస్తుత మైసూర్ ప్లాంట్‌లోని ఎలక్ట్రికల్ సిస్టమ్‌ను ఆధునీకరించుకోనున్నట్లు తెలిపింది. తమ సంస్థ 17 దేశాల్లోని 71 క్లయింట్లకు సేవలను అందిస్తుందని పేర్కొంది.

ఆర్‌బిఐ కొత్త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అజిత్ రత్నాకర్



న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డాక్టర్ అజిత్ రత్నాకర్ జోషి నియమితులయ్యారు. అజిత్ నియామకం మార్చి 3 నుంచి అమల్లోకి వచ్చింది. ఇంతక్రితం ఆయన డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ అడ్వైజర్‌గా పని చేశారు. ఇక ఆర్‌బిఐలో ఫైనాన్సియల్ స్టెబిలిటీ డిపార్ట్‌మెంట్, స్టాటిస్టిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ నిర్వహణ బాధ్యతలను చూడనున్నారు. స్టాటిస్టిక్స్, ఇన్ఫర్మేషన్, టెక్నాలజీలో ఆయనకు 30 ఏళ్ల అనుభవం ఉంది.

డీస్నీలో 6 శాతం ఉద్యోగులకు ఎసరు..!



న్యూఢిల్లీ : ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ డీస్నీ తమ ఆరు శాతం ఉద్యోగులపై వేటు వేయనుంది. టివి ప్రేక్షకులు తగ్గిపోవడం, ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లకు ఆదరణ పెరుగుతుండడం సంప్రదాయ ఎంటర్‌టైన్‌మెంట్ నెటవర్క్‌లకు డిమాండ్ తగ్గుతుండటంతో ఈ నిర్ణయం తీసుకుంటుందని సమాచారం. మారుతున్న మీడియా అవకాశాలకు అనుగుణంగా డిస్నీ ఎబిసి న్యూస్ గ్రూప్, డిస్నీ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్‌ల్లో పని చేస్తున్న దాదాపు 200 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ఆ కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

సంపాదకీయం


ఇప్పటికైనా స్పందించాలి

పీకల్లోతు అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్న సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) మాజీ చైర్ పర్సన్ మాదబీ పూరి బుచ్ విషయంలో కేంద్రంలోని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం మానివేయాలి. అవినీతి నిరోధక శాఖ కేసులను విచారించే ముంబయిలోని ప్రత్యేక కోర్టు ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించిన తరువాత కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకోకపోవడం క్షంతవ్యం కాదు. పూరి బుచ్‌తో పాటు, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ఛైర్మన్ ప్రమోద్ అగర్వాల్, సిఇఓ సుందరరామన్ రామమూర్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఎసిబిని ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ప్రత్యేక న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేస్తే, హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునేంతవరకు కేంద్ర ప్రభుత్వంలో ఉలుకు పలుకు లేకపోవడం గమనార్హం. ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలన్న ప్రత్యేక కోర్టు ఆదేశాలను పూర్తిగా కొట్టివేయాలని హైకోర్టును పూరి బుచ్ అభ్యర్థించగా అందుకు నిరాకరించిన న్యాయస్థానం తొలుత ఒక రోజుకు, ఆ తరువాత నాలుగు వారాలకు స్టే ఇచ్చింది. 1994లో జరిగిన ఒక లావాదేవీలో సెబీ నిర్లక్ష్యం కారణంగా తన కుటుంబం భారీ ఆర్థిక నష్టానికి గురైందని, దానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నది ఈ కేసులో ఫిర్యాదుదారుని వాదన. అప్పట్లో తాను సెబిలోనే లేనని వాదించి పూరి బుచ్ హైకోర్టులో స్టే పొందారు. అయితే, సెబి నిర్లక్ష్యం ఉందా లేదా అన్నదే అసలు ప్రశ్న! ఆ నిర్లక్ష్యం మోసపూరిత కంపెనీకి ప్రజలను నష్టపరిచే అవకాశం ఇచ్చిందా లేదా అన్నది మరో ప్రశ్న! తప్పు ఎప్పుడు జరిగిందన్నది కాదు, తప్పు జరిగిందని తెల్సిన తరువాత బాధ్యత కలిగిన పదవిలో ఉండి ఏం చేశారన్నది ఇంకో ప్రశ్న! ఈ ప్రశ్నలకు హైకోర్టు విచారణలో సమాధానాలు వస్తాయో లేదో చూడాల్సి వుంది.

సెబి అధ్యక్షురాలిగా ఉన్నన్ని రోజులు మాదబీ పూరి బుచ్‌పై ఈగ కూడా వాలని పరిస్థితి ఉందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దీంతో బాధ్యతలు విరమించిన మరుసటి రోజే ప్రత్యేక న్యాయస్థానం ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. సాంకేతిక కారణాలతో ఈ కేసులో స్టే పొందినప్పటికీ, ఆమెపై వెల్లువెత్తిన ఆరోపణల నుండి తప్పించుకోవడం అంత సులభం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పదవిలో ఉన్నన్ని రోజులు ఆమెకు మోడీ ప్రభుత్వ అండ పుష్కలంగా లభించింది. దీంతో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తినా, కొన్నింటికి ప్రాథమిక సాక్ష్యాధారాలు వెలుగులోకి వచ్చినా ఆమెపై నామమాత్రపు చర్యలు కూడా తీసుకోలేదు. దీంతో సెబి ప్రతిష్ట కూడా మసకబారింది. నిజానికి, 1992లో వెలుగులోకి వచ్చిన హర్షద్ మెహతా కుంభకోణం తరువాత స్టాక్ లావాదేవీలపై మాదబీ పూరి బుచ్ సెబీ అధ్యక్షురాలిగా ఉన్న సమయంలోనే భారీ స్థాయిలో చర్చ జరిగింది. న్యూయార్క్‌కు చెందిన షార్ట్‌సెల్లర్ హిండెన్ బర్గ్ పరిశోధనలో వెలుగులోకి వచ్చిన అంశాలే దీనికి కారణం.

భారత ప్రభుత్వ తీర్మానం ద్వారా 1988లో ఏర్పాటైన సెబి అచిర కాలంలోనే ప్రతిష్టాత్మక సంస్థగా రూపుదిద్దుకుంది. 5.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తికి భారత స్టాక్ మార్కెట్‌ను చేర్చడంలో సెబీది కీలక పాత్ర. దీనికోసం ఆ సంస్థ ఎన్నో కఠిన నియమాలు రూపొందించి అమలు చేస్తోంది. హర్షద్ మెహతా కుంభకోణం తరువాత మరోసారి అటువంటి అవకతవకలు జరగకుండా రూపొందించిన నియమ నిబంధనలను ప్రధానమంత్రి మోడీకి అత్యంత సన్నిహితుడైన అదానికి లబ్ధి చేయడం కోసం తుంగలో తొక్కారన్నది పూరి బుచ్‌పై ఉన్న ప్రధాన ఆరోపణ. స్టాక్ మార్కెట్ అవకతవకలకు సంబంధించి అదానిపై నమోదైన 24 అభియోగాలను సెబీ అధ్యక్షురాలి హోదాలో విచారించి ఆమె క్లీన్ చిట్ ఇచ్చారు. స్టాక్ ధరల తారుమారు, కార్పొరేట్ దుష్ప్రవర్తన, అదాని పెట్టుబడులు ఉన్న ఆఫ్‌షోర్ సంస్థల్లో తన భర్తతో కలిసి వాటాలు తీసుకోవడం తదితర అంశాలను కూడా హిండెన్‌బర్గ్ వెలుగులోకి తెచ్చింది. నిజానికీ, ఈ ఆరోపణలు వచ్చిన వెంటనే తనంతట తానుగా ఆమె పదవి నుండి తప్పుకొని ఉండాల్సింది. లేదా, కేంద్ర ప్రభుత్వమైనా తప్పించి, అనంతర చర్యలు తీసుకోవాల్సి ఉండింది. ఆ రెండూ జరగలేదు. ఇప్పుడు, ఏదో రూపంలో ఆమె బోను ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలి.

మహనీయుల మాట



దేవుడు మానవ కల్పితం.
స్వర్గ నరకాలు లేనే లేవు.
మతం, గుళ్లు, గోపురాలు అక్కర్లేదు.
కావలసింది మానవత్వం.
- లూథర్ బర్‌బాంక్,
ప్రముఖ వృక్ష శాస్త్రజ్ఞుడు.

సందర్భం

నా ఎంపిక-నా హక్కు





డి. రమాదేవి

"నా ఎంపిక-నా హక్కు" అనే భావనను బలపర్చాలి. ఆత్మగౌరవంతో జీవించే హక్కును గుర్తించి అమలు చెయ్యాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మార్చి 8 సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నది. విద్య, వృత్తి, జీవనశైలి, ప్రేమ ఏ విషయంలోనైనా యువత తమకు నచ్చినది ఎంచుకునే స్వేచ్ఛ కలిగి ఉండాలి. సమాజం అభిప్రాయాలను చెప్పవచ్చు. మార్గనిర్దేశం చేయవచ్చు. కానీ బలవంతంగా నియంత్రించకూడదు. వ్యక్తిగత నిర్ణయాలను గౌరవించడం ప్రజాస్వామ్యాన్ని బలపర్చుతుంది. యువత సృజనాత్మకంగా కొత్త విషయాలను కనిపెట్టడానికి, వాటిని సమాజం ఉపయోగించుకోవడానికి దోహదపడుతుంది.

ఈ రోజుల్లో యువత స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తపరచడానికి, తమ జీవితాన్ని తమ అభిరుచులకు అనుగుణంగా నడిపించుకునేందుకు ముందుకు వస్తున్నారు. "నా ఎంపిక-నా హక్కు" అనే భావనను బలపర్చాలి. ఆత్మగౌరవంతో జీవించే హక్కును గుర్తించి అమలు చెయ్యాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మార్చి 8 సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నది. విద్య, వృత్తి, జీవనశైలి, ప్రేమ ఏ విషయంలోనైనా యువత తమకు నచ్చినది ఎంచుకునే స్వేచ్ఛ కలిగి ఉండాలి. సమాజం అభిప్రాయాలను చెప్పవచ్చు. మార్గనిర్దేశం చేయవచ్చు. కానీ బలవంతంగా నియంత్రించకూడదు. వ్యక్తిగత నిర్ణయాలను గౌరవించడం ప్రజాస్వామ్యాన్ని బలపర్చుతుంది. యువత సృజనాత్మకంగా కొత్త విషయాలను కనిపెట్టడానికి, వాటిని సమాజం ఉపయోగించుకోవడానికి దోహదపడుతుంది.

మహిళల విద్యకు ఈనాటికీ ఆటంకాలు ఎదురవుతున్నాయి. అందువల్ల పురుషులతో సమానంగా విద్యను పొందలేక పోతున్నారు. ఆర్థిక సమస్యలు, వరకట్నం, సామాజిక, సాంస్కృతిక ఆంక్షలు, పాఠశాలలు దూరంగా ఉండటం, సౌకర్యాల లేమి వంటి అంశాలు బాలికల విద్యను ప్రభావితం చేస్తున్నాయి.

మహిళల విద్యకు, విభిన్న వృత్తులు చేపట్టటానికి ఉన్న ఆటంకాలను అధిగమించేందుకు ప్రభుత్వాలు, సమాజం, కుటుంబాలు కలిసికట్టుగా పనిచేయాలి. స్త్రీలు తమ ఆసక్తులు, లక్ష్యాలను అనుసరించి ముందుకు సాగేందుకు ప్రోత్సాహం అందించాలి. ఇది వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా, సమాజ పురోగతికి కూడా కీలకం.

విభిన్న వృత్తులను ఎంచుకోవడంలో మహిళలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల సుప్రీంకోర్టు ఒక కేసులో తీర్పునిస్తూ మహిళలు పని చేసే వాతావరణం కల్పించడం అవసరమని పేర్కొన్నది. గర్భస్రావమైన స్త్రీ మానసిక, శారీరక స్థితిని గుర్తించకుండా ఇద్దరు మహిళా జడ్జీలను తొలగించిన మధ్యప్రదేశ్ హైకోర్టును 'సుప్రీం' తప్పుపట్టింది. సాంప్రదాయంగా, మహిళలకు నిర్దిష్టమైన వృత్తులు మాత్రమే అనుకూలంగా ఉంటాయని సమాజం నిర్ణయించేసింది. అయితే, మహిళలు ఇప్పుడు అన్ని రంగాల్లోకి అడుగు పెడుతున్నారు. కానీ, కొన్ని ప్రత్యేకమైన వృత్తులను ఎంచుకోవడంలో వారు ఇంకా అనేక ఆటంకాలను ఎదుర్కొంటున్నారు.

కొన్ని వృత్తులు పురుషులకు మాత్రమే సరైనవని భావించడం వల్ల, మహిళలకు అవకాశాలు దక్కడంలేదు. పోరాట క్రీడలు, విమాన పైలట్, ఇంజినీరింగ్, పోలీసు-సైనిక శాఖలు వంటి రంగాల్లో మహిళలను ప్రోత్సహించడంలో సమాజం ఇంకా వెనుకబడి ఉంది. కొన్ని వృత్తులు శారీరకంగా కష్టతరమని భావించి, కుటుంబ సభ్యులు మహిళలను ఆ దిశగా వెళ్ళనీయరు. కుటుంబ బాధ్యతల కారణంగాను, నైతిక విలువలపై కాపలా ఉండే స్వభావం వలన "మహిళల పని ఉదయం 9 నుండి సాయంత్రం 5 వరకే ఉండాలి" అనే అపోహలు ఇంకా ఉన్నాయి.

డ్రైవింగ్, మెకానిక్ వృత్తులు, టెక్నికల్ పనులు, రాజకీయ రంగం వంటివి పురుషులకు మాత్రమే అని భావించే సాంప్రదాయ ఆలోచనలు బలంగా కొనసాగుతున్నాయి. మహిళలు ఫ్యాషన్, బ్యూటీషియన్, టీచింగ్, నర్సింగ్ వంటి కొన్ని వృత్తులకు మాత్రమే పరిమితం కావాలని సమాజం నిర్దేశించే ప్రయత్నం చేస్తుంది. మహిళలు సమాన పనిని చేసినా, కొన్ని చోట్ల పురుషుల కంటే తక్కువ జీతం అందుకుంటున్నారు. ప్రసూతి సెలవులు, పిల్లల పెంపకం వంటి అంశాల వల్ల మహిళలు వృత్తిలో వెనుకబడే పరిస్థితి ఏర్పడుతుంది. వీటి పరిష్కారానికి కృషి చేయాలి.

పిల్లలకు చిన్నతనం నుంచే "మగ-ఆడ వృత్తులు" అనే తేడా ఉండదని నేర్పించాలి. ఆచరించాలి. భద్రతను మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలి. జీతాల్లో లింగ వివక్ష తొలగించాలి. మహిళలు ఎలాంటి వృత్తిని ఎంచుకున్నా కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలి. మహిళలు అన్ని రంగాల్లోకి ప్రవేశించేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

మహిళలపై హింస

ఉద్యోగ ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, అసభ్య వ్యవహారాలు అరికట్టే పరిస్థితి లేదు. ఇటీవల అమెరికాలో భద్రతా వ్యవస్థలో పని చేసే అధికారుల తీవ్రమైన సెక్స్ స్కాండల్ సంచలనం సృష్టించింది. మన దేశంలో, రాష్ట్రంలో కూడా స్త్రీలపై అత్యాచారాలు ఆందోళన కల్గిస్తున్నాయి. స్త్రీల శరీరాన్ని వ్యాపార వస్తువుగా మార్చడం, పురుషాధిక్యత, దాని వలన పెరిగిన పోర్న్ ఈ హింసకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. కఠినమైన చట్టాలు-సమర్థవంతమైన అమలు-అవగాహన-స్వీయరక్షణ-బాధితులకు మద్దతు అవసరం. ఇవి సమగ్రంగా అమలు చేసినప్పుడే మహిళలపై లైంగిక హింసను సమూలంగా అరికట్టగలం.

కులాంతర వివాహాలు

భారతీయ సమాజం వేగంగా మారుతోంది. కానీ కొన్ని మూఢనమ్మకాలు, కట్టుబాట్లు ఇప్పటికీ యువతను అణగదొక్కుతున్నాయి. కాలం చెల్లిన కుల, మత భావనలు పెంచి పోషించబడ్తున్నాయి. ముఖ్యంగా కులాంతర వివాహాల విషయంలో తల్లిదండ్రులు, బంధువులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, కొన్నిసార్లు హింసాకాండకు కూడా పాల్పడుతున్నారు. ఇది ఎంతవరకు న్యాయం?

తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన పడటం సహజమే. కానీ, కేవలం కులం భిన్నంగా ఉందని పెళ్లిని అంగీకరించకుండా, ప్రేమించిన జంటల జీవితాన్ని నాశనం చేయడం తగదు. ప్రేమ, పరస్పర అంగీకారం, నమ్మకం ఉంటేనే ఒక కుటుంబం బలంగా నిలుస్తుంది. కేవలం కులం ఆధారంగా పెళ్లి అనుకూలం లేదా అననుకూలం అనే తీర్పు నష్టం కల్గిస్తుంది.

పురోగతికి అడ్డంకి మూఢనమ్మకాలు

కులమనే వ్యవస్థ అప్పటి సామాజిక పరిస్థితులలో ఏర్పడింది. కానీ, ఈ రోజుల్లో విద్య, ఉద్యోగం, ఆధునిక జీవన విధానాల వల్ల కుల పరిమితులు పెద్దగా సంబంధం లేని అంశాలయ్యాయి. అయినా, ప్రేమను కులంతో కొలవడం వెనుకబాటుతనమే. కులాంతర వివాహాలను అంగీకరించలేక, కొందరు తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తేవడం, బెదిరించడం, కొన్నిసార్లు హత్యలకు కూడా పాల్పడడం తీవ్రంగా సహించరానిది. ప్రేమ వివాహం చేసుకున్నందుకు ప్రేమతో, బాధ్యతతో పెంచిన తల్లిదండ్రులే దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారే?

తల్లిదండ్రులు తమ ఆలోచనలను మార్చుకోవాలి. పిల్లలు ఎవరిని ప్రేమించాలి, ఎవరితో జీవితాన్ని పంచుకోవాలి అనే నిర్ణయం వారి స్వేచ్ఛకు వదిలెయ్యాలి. ప్రేమను కులంతో కలిపి చూడకుండా, పరస్పర గౌరవం, నమ్మకం వివాహానికి కేంద్ర బిందువుగా చూడాలి. కులాంతర వివాహాలు సమాజ పురోగతికి సూచిక. ప్రేమకు కులం అడ్డుగా నిలిస్తే, అది నష్టమే కాని లాభం కాదు. తల్లిదండ్రులు తమ పిల్లల సంతోషాన్ని, స్వేచ్ఛను గౌరవించాలి. చివరికి, ప్రేమ నెగ్గాలి - హింస కాదు!

మన రాష్ట్రంలో ఇటీవల కులాంతర వివాహాలు చేసుకున్న యువతీ యువకులు పరువు పేరిట హత్యలకు గురవుతున్నారు. ఈ ఘటనలు సమాజంలో పెరుగుతున్న కుల దురహంకారానికి నిదర్శనం. 2023 ఫిబ్రవరిలో నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని ఆలమూరు గ్రామంలో ప్రసన్న అనే యువతిని ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌తో వివాహం చేశారు. అయితే, పెళ్లికి ముందు ఆమె మరో యువకుడిని ప్రేమించింది. వివాహం తరువాత పుట్టింటికి వచ్చి, భర్త వద్దకు తిరిగి వెళ్లకుండా ఉండిపోయింది. కుమార్తె ప్రవర్తనతో పరువు పోయిందని భావించిన తండ్రి, ఆమెను గొంతు నులిమి చంపి, తల, మొండాన్ని వేరు చేసి, వేర్వేరు చోట్ల పడేశాడు.

2022 జూన్‌లో అనంతపురం జిల్లా కనగానపల్లి మండలంలో మరో పరువు హత్య జరిగింది. మురళి అనే యువకుడు, వీణ అనే యువతిని ప్రేమించి, వేర్వేరు కులాలకు చెందినప్పటికీ, పెద్దల అనుమతి లేకుండా వివాహం చేసుకున్నారు. ఈ వివాహాన్ని జీర్ణించుకోలేని వీణ తల్లి, ముగ్గురు యువకులను పురామాయించి మురళిని కిడ్నాప్ చేసి, అనంతరం గొంతు కోసి హత్య చేయించింది. ఆంధ్రప్రదేశ్‌లోనూ, దేశంలోనూ ఈ ధోరణులు పెరగడమే కాదు మనువాద ప్రచారాలు వీటిని పెంచుతున్నాయి. అయితే, సమాజంలో కులాంతర వివాహాలను అంగీకరించే కుటుంబాలు కూడా ఉన్నాయి. మన భారతీయ సంస్కృతి సాంప్రదాయంలో కులాంతర వివాహాలు, స్వయంవరాలు అలవాటైనవే! శకుంతల, రుక్మిణి లాంటి ఎన్నో పౌరాణిక వివాహాలు గొప్పగా కీర్తించబడ్డాయి. తమ పిల్లల ఆనందానికి, స్వేచ్ఛకు ప్రాధాన్యతనిస్తూ, కుల అంతరాలు లేని సమాజ పురోగతికి తోడ్పడం ద్వారానే సామాజిక మార్పు, సమానత సాధ్యమవుతుంది.

"చర్యలను వేగవంతం చెయ్యాలి" అని ఐక్యరాజ్యసమితి పిలుపు. అన్ని రంగాల్లో అసమానత సాధించే వైపుగా ఈ చర్యలుండాలి. పైన సూచించిన అనేక అంశాలలో సమానత సాధనకు బడ్జెట్‌లో సముచిత ప్రాధాన్యతనివ్వాలి. స్త్రీల కోసం ప్రకటించిన వాగ్దానాలను అమలు చెయ్యాలి. అంటే అందుకు తగిన కేటాయింపులు ఉండాలి. మహిళా దినోత్సవ వేడుకలు మాటలకు, కాగితాలకు పరిమితం కారాదు. ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఉచిత బస్సు, డ్వాక్రా మహిళలకు జీరో వడ్డీ తదితర వాగ్దానాల అమలుకు పూనుకుంటూనే విద్య, ఉపాధి, భద్రత కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

/ వ్యాసకర్త ఐద్వా రాష్ట్ర కార్యదర్శి /

విశ్లేషణ

ఎమ్మెల్సీ ఎన్నికలు-ప్రజాస్వామ్య విలువలు





ఎ. అజ శర్మ

వాస్తవంగా పెద్దల సభకు ఎన్నుకోవాల్సిన ఈ స్థానాలలో రాజకీయ పార్టీలు జోక్యం చేసుకొని, వీటిని మరో సాధారణ ఎన్నికల లాగా చేయడం సమంజసం కాదు. ఈ ఎన్నికలలో రాష్ట్ర అధికార పార్టీ, ముఖ్యమంత్రితో సహా నేరుగా రంగంలోకి దిగారు. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. హుందాగా జరగవలసిన ఎన్నికల్లో చైతన్యం ప్రదర్శించవలసిన ఓటర్లకు నిస్సిగ్గుగా డబ్బులు పంచారు. కానుకలు అందజేశారు. సిగ్గు, బిడియం లేకుండా కులం పేరు చెప్పి కూడా ఓట్లు దండుకున్నారు. ఈ రకంగా సాధారణ ఎన్నికల స్థాయిని మరిపించి, పెద్దల సభకు కళంకం తెచ్చేలా కూటమి పార్టీలు దిగజారాయి.

ఆంధ్ర రాష్ట్రంలో మూడు శాసనమండలి స్థానాలకు ఫిబ్రవరి 27న జరిగిన ఎన్నికలు రెండు ప్రత్యేకమైన ప్రాధాన్యతలను సంతరించుకున్నాయి. ఒకటి రాష్ట్రంలోని అధికార తెలుగుదేశం పార్టీ కూటమి కొంతమంది అభ్యర్థులను నిలపగా, వారికి ప్రత్యర్థులుగా రాజకీయాలకు అతీతంగా ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థులకు మధ్య పోటీ జరగడం. రెండోది ఈ పిడిఎఫ్ అభ్యర్థులపై గెలవడానికి ఇటీవల కాలంలో రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా టిడిపి అనేక అడ్డదారులు తొక్కడం.

టిడిపి వర్సెస్ పిడిఎఫ్ అన్నట్టుగా ఎన్నికలు జరిగాయి. ఇది ఒక రకంగా చూస్తే శుభ పరిణామమే. ఎందువల్లనంటే ఎటువంటి విలువలు పాటించని అభ్యర్థుల మధ్య పోటీ జరిగితే అందరూ ఒక్కటే, ఎవరు గెలిచినా ప్రజలకు న్యాయం జరగదు అనుకోవడం సహజం. అలాగే అటువంటి ఎన్నికలలో ప్రజా సమస్యలు చర్చకు కూడా రావు. కానీ ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీదారులుగా టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థులు వుండడంతో ప్రధాన అంశాలు చర్చకు వచ్చాయి. ఇది ఆహ్వానించవలసిన పరిణామం.

గుంటూరు, కృష్ణ స్థానానికి, గోదావరి జిల్లాల స్థానానికి తెలుగుదేశం, జనసేన అభ్యర్థులు గెలవగా, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి తెలుగుదేశం, జనసేన బలపరిచిన అభ్యర్థి ఓడిపోయారు. మూడు నియోజకవర్గాల్లోనూ ప్రధాన ప్రత్యర్థులుగా పిడిఎఫ్ అభ్యర్థులు నిలిచారు.

వాస్తవంగా పెద్దల సభకు ఎన్నుకోవాల్సిన ఈ స్థానాలలో రాజకీయ పార్టీలు జోక్యం చేసుకొని, వీటిని మరో సాధారణ ఎన్నికల లాగా చేయడం సమంజసం కాదు. ఈ ఎన్నికలలో రాష్ట్ర అధికార పార్టీ, ముఖ్యమంత్రితో సహా నేరుగా రంగంలోకి దిగారు. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. హుందాగా జరగవలసిన ఎన్నికల్లో చైతన్యం ప్రదర్శించవలసిన ఓటర్లకు నిస్సిగ్గుగా డబ్బులు పంచారు. కానుకలు అందజేశారు. సిగ్గు, బిడియం లేకుండా కులం పేరు చెప్పి కూడా ఓట్లు దండుకున్నారు. ఈ రకంగా సాధారణ ఎన్నికల స్థాయిని మరిపించి, పెద్దల సభకు కళంకం తెచ్చేలా కూటమి పార్టీలు దిగజారాయి.

ఎన్నికల్లో అందరూ గెలవరు కదా! అందువల్ల పోటీ చేసే అభ్యర్థులకు గెలుపు, ఓటములు సహజమే. అలాగే ఎన్ని అడ్డదారులైన తొక్కి గెలిస్తే, అలాంటి గెలుపు నైతికంగా సరైనదేనా అన్నది పరిశీలించవలసిన విషయమే. దీనికి భిన్నంగా ప్రజలను చైతన్య పరుస్తూ, ప్రజా సమస్యల మీద నిరంతరం కృషి చేస్తూ, ఎన్నికల్లో ప్రచారానికి ఏ అడ్డదారులు తొక్కకుండా, ఆ యా తరగతుల ప్రజల సమస్యలే ఎజెండాగా, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పోటీ చేసిన అభ్యర్థులు ఓడిపోతే అప్పుడు గెలుపు ఓటములను ఎలా చూడాలి అన్నది ప్రధానమైన అంశం.

ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఆలోచిస్తే, మన రాజ్యాంగంలో ఓటు పరమ పవిత్రమైన హక్కు. దీనిని బజార్లో సరుకుగా మార్చేసి నోటుతోనో, మందుతోనో, కులం పేరుతోనో ప్రభావితం చేసి ఓట్లు వేయించుకుంటే అంతకంటే నీచం మరొకటి ఉండదు. అందులోనూ విద్యావంతులు ఓటర్లుగా ఉన్న ఈ ఎన్నికలలో మరింత ఘోరం. ఓటర్లను వాస్తవాలను ఆలోచించేలా, వారిని ఏ రకమైన ప్రలోభాలకు గురి చేయకుండా వదిలేసి, ఒక స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగి గెలిస్తే అప్పుడు అసలైన ప్రజాస్వామ్య ఎన్నిక అని భావించవచ్చు. కానీ అధికారం, పదవులు రుచి మరిగిన రాజకీయ పార్టీలు అలా చేస్తాయనుకోవడం అవివేకమే.

అయితే అందరూ అలాగే ఉంటారని భావించలేం. ఎన్నికలలో ఓడిన ముగ్గురు పిడిఎఫ్ అభ్యర్థులు నీతి, నిజాయితీ, విలువలకు కట్టుబడి ఎన్నికల్లో పోటీ చేశారు. ప్రత్యర్థులు అడ్డదారులు తొక్కుతున్నారని తెలిసినా, వీరు మాత్రం అడ్డదారులు కాదు కదా కనీసం ఒక్క తప్పటడుగు కూడా వేయలేదు. ఇటువంటి విలువలకు కట్టుబడి పోటీ చేయడం నేటి కలుషిత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చాలా అరుదు. కానీ ఇది సాధ్యమేనని పిడిఎఫ్ అభ్యర్థులు నిరూపించారు. ఇది చాలా గొప్ప విషయం. ఈ వాస్తవాన్ని ప్రత్యర్థులు బయటకు చెప్పలేకపోయినా, వీరికి మనసంటూ ఉంటే, మనసులోనైనా అభినందించి తీరాలి.

కృష్ణ, గుంటూరు పట్టభద్రుల ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ అన్ని అఘాయిత్యాలకు పాల్పడింది. డబ్బులు, మందు, బిర్యానీ వంటివి పంచడమే కాకుండా, అవి కూడా తమను గెలిపించలేవనే అనుమానంతో అనేక బూతుల్లో పోలీసుల సహకారంతో పిడిఎఫ్ ఎన్నికల ఏజెంట్లను బయటకు తరిమేసింది. రాష్ట్రంలో ఇటీవల కాలంలో అసెంబ్లీ ఎన్నికలలో కూడా లేనట్లుగా ఎన్నికల సిబ్బందిని లొంగదీసుకుని, కొన్ని ప్రాంతాలలో పోలింగ్ బూత్‌లను స్వాధీనం చేసుకుని, ఓట్లు గుద్దుకుంది. ఓటమి తప్పదనే భయంతోనే ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడింది. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేసింది.

గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో అధికార కూటమి పూర్తిగా కులం కార్డును వాడుకుంది. దానితోపాటు డబ్బు, అధికార దుర్వినియోగానికి పాల్పడింది. అయినా ఓడిపోతామనే భయంతో ఎన్నికల రోజున మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నేరుగా ఎన్నికల బూత్‌ల లోకి ప్రవేశించారు. ఎన్నికల సిబ్బందిపై ఒత్తిడి తీసుకొచ్చి జిరాక్స్ ఐడి కార్డులు చూపించి దొంగ ఓట్లను యథేచ్ఛగా వేయించుకున్నారు.

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. వీరి కేంద్ర మంత్రి, శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు ఏకంగా వీడియో ద్వారానే ప్రచారానికి దిగారు. ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధిగా పోటీ చేస్తున్న ఒక స్వతంత్ర అభ్యర్థిని బెదిరించి, ప్రలోభ పెట్టి వీరి అభ్యర్థికి మద్దతుగా ఉపసంహరించుకునేలా చేశారు. ఎమ్మెల్యే అయిన మాజీ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కనీసమైన మర్యాద కూడా లేకుండా హైస్కూల్ హెడ్ మాస్టారి సీట్లో కూర్చుని ప్రచారం చేశారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు అనేకమంది ఓటర్లకు దగ్గరుండి ఓటర్లను ప్రభావితం చేసే చర్యలకు దిగజారారు. అయినా ఓటర్లు వీరిని తిరస్కరించి ఓడించారు.

కానీ, విచిత్రం ఏంటంటే కింద పడినా తామే గెలిచామని చెప్పుకోవడం తెలుగుదేశం నాయకులకే చెల్లింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మంత్రి, మాజీ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు గెలిచిన శ్రీనివాసులు నాయుడు కూడా మా మద్దతుతోనే గెలిచారని ప్రచారం చేసుకుంటున్నారు. ఇంకా విచిత్రంగా పిడిఎఫ్ అభ్యర్థి వైసిపి మద్దతుతో పోటీ చేశారని ఆయన, ప్రస్తుత టిడిపి అధ్యక్షుడు అసత్యాలను, అవాస్తవాలను పేర్కొన్నారు. ఇది ఏ రకమైన సంస్కారమో వారికే తెలియాలి.

నిజాయతీగల ఒక సాధారణ పౌరుడుగా చూస్తే ఇటువంటి గెలుపు కూడా ఒక గెలుపేనా అనే సందేహం కలగక మానదు. దీని కంటే నిజాయితీగా పోరాడి, ఓడిపోయిన వారే గొప్పవారు కదా అనేది కూడా అనిపించక మానదు. అందుకే ఈ ఎన్నికలలో 'గెలిచినవారు ఓడారు - ఓడిన వారు గెలిచారు' అని చెప్పడం సముచితంగా ఉంటుంది. ఎందుకంటే ఎన్నికలలో ఓడిన పిడిఎఫ్ అభ్యర్థుల ఎన్నికల ఖర్చే తక్కువ కాగా, ఆ ఖర్చును కూడా వీరి సంఘ సభ్యులే భరించడం.

ఎన్నికలలో పోటీ చేసిన వారు గెలవడానికి అన్ని శక్తులు ఒడ్డడం సహజమే. అయితే గెలవడానికి అడ్డదారులు తొక్కడం మాత్రం రాజ్యాంగ విరుద్ధమే. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా తెలుగుదేశం కూటమి నాయకులు వ్యవహరించారు. దీనికి భిన్నంగా పిడిఎఫ్ అభ్యర్థులు ముగ్గురూ ఓడిన వెంటనే వారు ఇచ్చిన సందేశంలో పోరాటాల్లోనూ, సమస్యలు పరిష్కారాల్లోనూ మీతోనే ఉంటామని, మీ మధ్యనే ఉంటామని, పోరాటాల్లో ముందు వరసనే ఉంటామని ఓటర్లకు తెలియజేయడం వారి హుందాతనానికి నిదర్శనం. అటువంటి ఉన్నత విలువలను కలిగిన వారిని ఆదరించడం సమాజ ఉన్నతికి అత్యవసరం.

/ వ్యాసకర్త ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక /

జనవాక్యం

దంత వైద్యుల రోజు

నోరు, దంతాలు, చిగుర్ల ఆరోగ్య పరిరక్షణలో అవిశ్రాంత సేవలను అందిస్తున్న డెంటిస్టుల అమూల్య సేవలను గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏటా మార్చి 6వ తేదీన జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని పాటించడం 2013 నుంచి ఆనవాయితీగా మారింది. దంత ఆరోగ్య పరిరక్షణ, నోటి పరిశుభ్రత, చిగుర్ల ఆరోగ్యం లాంటి అంశాలను సామాన్య ప్రజలకు అవగాహన కల్పించడం, తొలి దశలోనే రోగ నిర్ధారణ చేయడం, చికిత్సలు, ముందు జాగ్రత్తలు లాంటి అతి విలువైన సేవలను డెంటిస్టులు కల్పిస్తున్నారు. నోటి, దంత ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన, వ్యాధుల నివారణ, దంత అనారోగ్యాల చికిత్సలు, కాస్మొటిక్ డెంటిస్ట్రీ, సంపూర్ణ ఆరోగ్య సిద్ధి లాంటి లక్ష్యాలను సాధించడంలో దంత వైద్యులు అంకిత భావంతో అమూల్యమైన సేవలను అందిస్తున్నారు. నిత్యం రెండు సార్లు ఉదయం/ రాత్రి నిద్రకు ముందు దంతాలను సాఫ్ట్ బ్రష్‌తో శుభ్రం చేసుకోవడం, దంతాల్లో ఆహారం చిక్కుకోకుండా జాగ్రత్త పడడం లేదా చిక్కుకున్న వాటిని శుభ్రం చేసుకోవడం, నాలుకను శుభ్రం చేయడం, తిన్న తర్వాత నోటిని జాగ్రత్తగా శుభ్రం చేసుకోవడం, ప్రతి 3 లేదా 4 మాసాలకు ఒకసారి టూత్ బ్రష్‌ను మార్చడం, ఆడుతున్న సమయాల్లో మౌత్ గార్డ్‌లను వాడడం, గర్భవతులు తప్పనిసరిగా ప్రసవానికి ముందు దంత వైద్యుల సలహాలు తీసుకోవడం, ఏడాదికి రెండు పర్యాయాలు దంత వైద్యులను సంప్రదించడం, పోషకాహారం తీసుకోవడం, అతి శీతల పదార్థాలకు దూరంగా ఉండడం, పొగాకు లాంటి దురలవాట్లకు దూరంగా ఉండడం లాంటి జాగ్రత్తలు దంత ఆరోగ్యాలకు పునాదులుగా పని చేస్తాయి.

మన ఆరోగ్యకర చిరునవ్వుకు కారణమైన తెర వెనుక హీరోలుగా దంత వైద్యులు చేస్తున్న సేవలకు తగు విధంగా కృతజ్ఞతలు తెలియజేయడం మన కనీస ధర్మం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

నేడు విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవన్ విజయవాడలో ఏర్పాటు కానుంది. ట్రస్ట్ ప్రారంభించిన తరువాత హైదరాబాద్ కేంద్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో కూడా కార్యక్రమాలను విస్తరించేందుకు నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి గురువారం ప్రారంభించనున్నారు. ఈ భవనంలో తలసేమియా కేర్ సెంటర్, బ్లడ్ బ్యాంక్‌లు ఏర్పాటు కానునట్లు మెమోరియల్ ట్రస్ట్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

కుప్పంలో దారుణం

- ప్రేమ జంటపై దాడి



ప్రజాశక్తి- కుప్పం రూరల్ (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా కుప్పంలో బుధవారం దారుణం చోటుచేసుకుంది. ప్రేమ వివాహం చేసుకున్న జంటపై అమ్మాయి తండ్రి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటన స్థానికంగా కలవరం లేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడుపల్లి మండలం అగరం కొత్తపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, అదే గ్రామానికి చెందిన కౌసల్య ప్రేమించుకున్నారు. ఈ నెల 3న పెద్దల అంగీకారం లేకుండా తమిళనాడు రాష్ట్రంలోని తిరుపత్తూరు జిల్లా యాదగిరి హిల్స్‌పై ఉన్న ఆలయంలో వివాహం చేసుకున్నారు. అనంతరం భవిష్యత్తులో గొడవలేం లేకుండా.. తమ వాళ్లతో మాట్లాడాల్సిందిగా ప్రేమ జంట గ్రామ పెద్దలను ఆశ్రయించింది. వారి ప్రేమపెళ్లి విషయంపై పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఈ మేరకు గ్రామ పెద్దలు కౌసల్య, చంద్రశేఖర్‌తోపాటు కౌసల్య తండ్రి శివశంకర్‌ను కూడా పంచాయితీకి పిలిచారు. కుప్పంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో రాజీ చేసేందుకు ప్రయత్నించారు. కానీ, కూతురు ప్రేమ వివాహం చేసుకోవడం ఇష్టంలేని శివశంకర్ పెద్దల సమక్షంలోనే కత్తితో కౌసల్య, చంద్రశేఖర్‌లపై ఒక్కసారిగా దాడికి దిగారు. ఊహించని ఘటనతో అంతా షాక్‌కి గురయ్యారు. శివశంకర్‌ను ఆపే ప్రయత్నంలో చంద్రశేఖర్ మేనమామ రమేష్, పంచాయితీ పెద్దమనిషిగా వ్యవహరించిన సీతారామప్ప కూడా ఆయన దాడి చేశారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన కౌసల్య, చంద్రశేఖర్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశారు.

నిందితున్ని అదుపులోనికి తీసుకుంటాం: ఎస్‌పి

చిత్తూరు జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి బాధితులను విచారించి, వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో ఎస్‌పి మాట్లాడుతూ.. కౌసల్య ప్రేమ వివాహం చేసుకోవడం నచ్చని ఆమె తండ్రి కత్తితో దాడి చేశారని, ఈ దాడిలో మొత్తం నలుగురు గాయపడినట్లు తెలిపారు. క్షతగాత్రులు కుప్పం పట్టణంలోని బిఆర్‌డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. దాడికి పాల్పడ్డ నిందితుడు పరారీలో ఉన్నారని, అతడిని అదుపులోనికి తీసుకోవడానికి పోలీసులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విజయసాయి కుమార్తెపై చర్యలకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి, అమరావతి

విశాఖజిల్లా, భీమునిపట్నం పరిధిలో సీఆర్‌జెడ్ రూల్స్‌కు వ్యతిరేకంగా సముద్ర తీరానికి సమీపంలో కాంక్రీట్ గోడ నిర్మించిన మాజీ ఎంపి విజయసాయిరెడ్డి కుమార్తె పెనక నేహారెడ్డి కంపెనీపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేయాలని ఏపి కోస్టల్‌జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీసీజెడ్ఎంఏ) చైర్మన్‌ను హైకోర్టు ఆదేశించింది. జరిగిన నష్టాన్ని అంచనావేసి, బాధ్యుల నుంచి వసూలు చేయడానికి నిపుణుల కమిటీ వేయాలని కేంద్ర అటవీ-పర్యావరణ మంత్రిత్వశాఖను ఆదేశించింది. అలాగే కాంక్రీట్ గోడ కూల్చివేతకు అయ్యే ఖర్చు మొత్తాన్ని ఆ కంపెనీ నుంచి రాబట్టాలని జీవీఎంసీ కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. కాంక్రీట్ గోడను పూర్తిగా తొలగించినట్లు నివేదికలో పేర్కొనడాన్ని ఆక్షేపించింది. ఇసుక కింద 588 మీటర్ల పొడవు, అడుగుల లోతున్న గోడ పునాదులను కూడా తొలగించాల్సిందేనని తేల్చి చెప్పింది. భీమునిపట్నం సమీపంలో సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి నాలుగు రెస్టోబార్లు నిర్మాణం జరుగుతున్నాయని వచ్చిన వార్తలపై సర్వే చేయాలని ఏపీ కోస్టల్‌జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, జీవీఎంసీ కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్లతో కూడిన కమిటీకి ఉత్తర్వులు జారీ చేసింది. సర్వే చేసేప్పుడు రెస్టోబార్ యజమానులను భాగస్వాములను చేయాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశాలు జారీ చేసింది.

విశాఖ జిల్లా, భీమునిపట్నం పరిధిలో పెనక నేహారెడ్డి శాశ్వతంగా కాంక్రీట్ నిర్మాణం చేయడాన్ని సవాలు చేస్తూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పిల్ దాఖలు చేశారు. గ్రామపంచాయతీ సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు కూడా మరో పిల్ వేశారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదిస్తూ, కాంక్రీట్ గోడను పాక్షికంగానే కూల్చారని చెప్పారు. అధికారులు సర్వేకి వచ్చినప్పుడు గోడను ఇసుకతో కప్పెట్టారని చెప్పారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్. ప్రణతి వాదిస్తూ, కమిటీ సర్వే చేసిన తరువాత సీఆర్‌జెడ్ రూల్స్ అమల్లోకి రాకముందు నిర్మించిన ఒక పాత భవనం, కొన్ని టాయిలెట్లను మినహా మిగిలిన వాటిని కూల్చేశారని చెప్పారు. అయితే భూమి పైన ఉన్న గోడ వరకు అధికారులు తొలగించారని చెప్పడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

విశాఖలో 'నాస్కామ్' కెరీర్ ఫెయిర్

- తరలివచ్చిన యువత

ప్రజాశక్తి- మధురవాడ (విశాఖపట్నం)

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థలతో కలిసి నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) విశాఖలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా రెండు రోజులపాటు తలపెట్టిన కెరీర్ ఫెయిర్ బుధవారం ప్రారంభమైంది. పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చింది. కెరీర్ ఫెయిర్‌ను ప్రారంభించిన విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ నైపుణ్యాలు లేకపోతే చేతిలో డిగ్రీ పట్టా ఉన్నా గౌరవప్రదమైన ఉద్యోగాలు సాధించడం కష్టమన్నారు. దేశంలోని ఇంజరింగ్ కళాశాలల నుంచి ఏటా లక్షలాది మంది యువత బయటకు వస్తున్నప్పటికీ సరైన నైపుణ్యాలు లేకపోవడంతో నిరుద్యోగులుగా మిగులుతున్నారని పేర్కొన్నారు. కెరీర్ ఫెయిర్‌ల ద్వారా యువత తాము ఏవిధమైన నైపుణ్యాలను పెంచుకోవాలో గ్రహించాలని, తద్వారా తమను తాము మెరుగుపర్చుకొని విజయం సాధించాలని సూచించారు.

ఉపాధి కోసం యువత ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వలస వెళ్లకుండా స్థానికంగా ఉద్యోగాలు లభించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ తరహా కెరీర్ ఫెయిర్ నిర్వహణ రాష్ట్రంలో ఇదే ప్రథమమన్నారు. ఎయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిపి.రాజశేఖర్ మాట్లాడుతూ పరిశ్రమలకు, విద్యా సంస్థలకు మధ్య అంతరాన్ని నాస్కామ్ వంటి సంస్థలు తగ్గించాలన్నారు. నాస్కామ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఉప్‌మిత్ సింగ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నైపుణ్యాలను యువతలో పెంచడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో గీతం యూనియూవర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోలా డిసౌజా, ఉపాధ్యక్షులు ఎం.గంగాధరరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్ పాల్గొన్నారు.



రెండు రోజుల పాటు జరిగే ఈ కెరీర్ ఫెయిర్‌లో పాల్గొనడానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 33,682 మంది యువత తమ పేర్లను నమోదు చేయించుకుంది. బుధవారం ఉదయం నుంచే యువత పెద్ద ఎత్తున గీతం ప్రాంగణానికి తరలి వచ్చింది. దాదాపు 50 కంపెనీల ఆధ్వర్యంలో ఇంట ర్వ్యూల నిర్వహణకు గీతం లోని వివిధ విభాగా ల్లో ఏర్పాట్లు చేశారు.

నా భర్త అరెస్ట్ సిసిటివి ఫుటేజీ భద్రపర్చేలా ఆదేశాలు ఇవ్వండి

- హైకోర్టులో వల్లభనేని వంశీ భార్య పంకజశ్రీ పిటిషన్

ప్రజాశక్తి, అమరావతి

తన భర్త, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్ట్ అక్రమమని, ఈ విషయాన్ని బట్టబయలు చేసేందుకు సిసిటివి ఫుటేజీ ఎంతో కీలకమని, కాబట్టి ఈ ఫుటేజీని భద్రపరిచేలా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ పంకజశ్రీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వంశీ అరెస్టుకు సంబంధించిన సిసిటివి ఫుటేజీని భద్రపర చాలంటూ విజయవాడ పటమట పోలీసులకు వినతి పత్రం సమర్పించామని, ఈ నెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పటమట పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల సిసిటివి ఫుటేజీని భద్రపరచాలని కోరామని, కానీ వారి నుంచి స్పందన లేదన్నారు. ప్రభుత్వం తరపున లాయర్ కల్పించుకుని కౌంటర్ వేసేందుకు గడువు కావాలని కోరారు. దీంతో విచారణను జస్టిస్ నూనెపల్లి హరినాథ్ ఈ నెల 10కి వాయిదా వేశారు.

నాపై సిఐడి కేసు కొట్టేయండి

- హైకోర్టులో రాంగోపాల్ వర్మ పిటిషన్

ప్రజాశక్తి, అమరావతి

తనపై సిఐడి నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ దర్శకుడు రాంగోపాల్ వర్మ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కమ్మరాజ్యంలో కడప రెడ్లు ..సినిమా తీసిన వర్మ ప్రజల్లో కులవైషమ్యాలను రేకెత్తించారంటూ మంగళగిరికి చెందిన బండారు వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు సిఐడి కేసు నమోదు చేసింది. గత ఏడాది నమోదు చేసిన ఈ కేసును కొట్టేయాలని కోరుతూ వర్మ హైకోర్టును ఆశ్రయించారు. తనపై చేసిన అభియోగాలన్నీ రాజకీయ దురుద్దేశాలతో చేసినవేనని అన్నారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ సర్టిఫికెట్ ఇచ్చిన సినిమా రిలీజ్ చేశాక కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 2019లో సినిమా విడుదలైతే, 2024లో కేసు నమోదు చెల్లదన్నారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారణ చేయనుంది.

గాజాలో క్షీణించిన పరిస్థితులు

- సహాయాన్ని ఇజ్రాయిల్ అడ్డుకోవడంతో
- పెరుగుతున్న ధరలు

గాజా : గాజాలో నిత్యావసరాలైన ఆహార పదార్థాలు, ఇంధనం, ఔషధాలు, ఇతర సరఫరాలను రాకుండా ఇజ్రాయిల్ అడ్డుకోవడంతో అక్కడ పరిస్థితులు దారుణంగా మారాయి. ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు మానవతా సంక్షోభం నెలకొంది. ఫలితంగా నానాటికి తరిగిపోతున్న నిల్వలను అత్యంత అవసరంలో వున్నవారికి పంచిపెట్టడానికి మానవతా గ్రూపులు తీవ్రంగా పాట్లు పడుతున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందం మొదటి దశలో భాగంగా గత ఆరువారాలుగా తాము కొద్దో గొప్పో సాధించిన పురోగతి అంతా కూడా ఈ సహాయ ప్రతిష్టంభనతో మరింత ప్రమాదంలో పడిందని సహాయ కార్యకర్తలు పేర్కొంటున్నారు. 16మాసాలకు పైగా కొనసాగిన దాడులతో గాజాలోని జనాభా అంతా పూర్తిగా ట్రక్కుల ద్వారా వచ్చే ఆహారం, ఇతర సాయంపైనే ఆధారపడ్డారు. వీరిలో చాలామంది నిర్వాసితులే. వారందరికీ ఆశ్రయం కావాల్సి వుంది. ఆస్పత్రులు, నీటి సరఫరా, బేకరీలు, టెలికమ్యూనికేషన్ పనిచేయడాలంటే ఇంధనం కావాలి.

ట్రక్కుల ఆహార సరఫరాలను చేరవేయాలన్నా కూడా ఇంధనం కావాల్సిందే. అటువంటి ఇంధన సరఫరాలను నిలిపివేయడంతో పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. గాజాలో శిబిరాలు తగినన్ని లేవు, దీంతో శీతల పరిస్థితులను ఎదుర్కొనే ప్రజలకు దుర్భరంగా మారింది. తమ కాల్పుల విరమణ ప్రతిపాదనలను ఆమోదించేలా హమాస్‌పై ఒత్తిడి తీసుకువచ్చేందుకే తాము సహాయాన్ని నిలిపివేసినట్లు ఇజ్రాయిల్ ప్రకటించింది. అవసరమైతే గాజా మొత్తానికి విద్యుత్‌ను నిలిపివేసే అవకాశాన్నికూడా తోసిపుచ్చలేమని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు చెప్పారు. కాగా ఇదంతా కరువును సృష్టించే చర్యలని మానవ హక్కుల గ్రూపులు విమర్శిస్తున్నాయి.

మొదటి దశ కాల్పుల విరమణ సమయంలో వచ్చిన సాయం అందరి అవసరాలను తీర్చలేదని, కేవలం శిబిరాలు లేక, వెచ్చగా కప్పుకునే దుస్తులు, దుప్పట్లు లేక నవజాత శిశువులు చనిపోతున్నారని నార్వే శరణార్థ కౌన్సిల్ సలహాదారు షైనా లో చెప్పారు. వారికి చికిత్స అందించడానికి అవసరమైన పరికరాలు కూడా లేవన్నారు. వున్నవాటిని ఎంత మెరుగ్గా ఉపయోగించగలమో సమీక్షిస్తున్నామని యునిసెఫ్ ప్రతినిధి జోనాథన్ వ్యాఖ్యానించారు. గాజాలోకి ప్రవేశించడానికి అంతర్జాతీయ రెస్క్యూ కమిషన్ పంపిన 6.7టన్నుల మందులు, వైద్య సరఫరాలు గాజా వెలుపల వేచి వున్నాయి. అవి ఎప్పుడు అవసరమైనవారికి చేరతాయో ఒక సందిగ్ధ పరిస్థితి నెలకొందని అత్యవసర, మానవతా సహాయ విభాగ ప్రధానుడు బాబ్ కిచెన్ వ్యాఖ్యానించారు. ధరలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

చక్కెర ధర ఉదయం 5 షేకెల్స్ వుండగా, సాయంత్రానికి దాని ధర 10షేకెల్స్‌గా పెరిగిపోయింది. కిలో చికెన్ ధర 2.2 పౌండ్ల నుండి 5.76పౌండ్లకు పెరిగిపోయింది. కాల్పుల విరమణ ఒప్పందం కుదరకపోవడం, సహాయం నిలిపివేయడంతో మళ్లీ దాడులు మొదలవుతాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



ఈజిప్టు వైపు నుంచి వస్తున్న సహాయాన్ని ఆపివేయడంతో రఫా వద్ద నిలిచిపోయిన వాహనాలు

బ్లాక్ లైవ్స్ మ్యాటర్ మ్యూరల్ పెయింటింగ్ తొలగింపు

- వాషింగ్టన్ మేయర్ నిర్ణయం

వాషింగ్టన్ : లక్షలాదిమంది ప్రజలకు స్ఫూర్తినిచ్చిన, బాధాకరమైన కాలాన్ని అధిగమించేందుకు దోహదపడిన మ్యూరల్ పెయింటింగ్ 'బ్లాక్ లైవ్స్ మేటర్' అనే పదాల పెయింటింగ్‌ను తొలగించాలని వాషింగ్టన్ నగర మేయర్ నిర్ణయించారు. వైట్‌హౌస్‌కు సమీపంలో స్ట్రీట్ వన్‌లో ఈ పెయింటింగ్ వుంటుంది. అధ్యక్షుడు ట్రంప్, రిపబ్లికన్ నియంత్రణలో గల కాంగ్రెస్‌నుండి ఎదురవుతున్న బెదిరింపులను నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం ఎక్స్‌లో ఈ మేరకు మేయర్ బౌజర్ మార్పు గురించి తెలుపుతూ పోస్ట్ పెట్టారు. అర్థరహితమైన రీతిలో కాంగ్రెస్ జోక్యాన్ని ఇక భరించలేం. సమాఖ్య ఉద్యోగాల కోతల వల్లఎదురయ్యే విపరీత ప్రభావాలపైనే తాము ప్రధానంగా ఆందోళన చెందాలని భావిస్తున్నామని డెమోక్రాట్ అయిన బౌజర్ చెప్పారు. ప్రజా ధిక్కార చర్యకు గుర్తుగా అక్కడి రోడ్ క్రాసింగ్‌కు బ్లాక్ లైవ్స్ మేటర్‌ప్లాజా అని పేరు కూడా మార్చారు. ప్రజా నిరసనల పట్ల ఆమె ఈ వైఖరి ట్రంప్‌తో నేరుగా ఘర్షణకు దారి తీసింది. నగరంపై ఆమెకు నియంత్రణ కోల్పోతున్నారని, తన అధికారాలను ఉపయోగించి మెట్రోపాలిటన్ పోలీసు విభాగాన్ని తమ అధీనంలోకి తెచ్చుకుంటామని హెచ్చరించారు. ఇదంతా ట్రంప్ మొదటి హయాంలో జరిగింది. ఇప్పుడురెండో హయాంలో ట్రంప్‌తో ఘర్షణలను నివారించడానికి ఆమె పై నిర్ణయం తీసుకున్నారు.

రాహుల్ గాంధీకి కోర్టు జరిమానా

లక్నో : కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీకి ఉత్తర్‌ప్రదేశ్‌లోని న్యాయస్థానం రూ.200 జరిమానా విధించింది. ఒక కేసులో పదే పదే విచారణకు గైర్హాజరు అవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 14న తదుపరి విచారణకు హాజరు కాకుంటే మాత్రం తీవ్ర చర్యలుంటాయని రాహుల్ గాంధీని హెచ్చరించింది. .మహారాష్ట్రలో 2022లో మీడియా సమావేశంలో మాట్లాడూతూ రాహుల్ గాంధీ.. వీర్ సావర్కర్ బ్రిటిష్ సేవకుడని, వారి నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని తెలిపారు. రాహుల్ వ్యాఖ్యలు వీర్ సావర్కర్‌ను కించపరిచే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే వ్యక్తి యూపీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్‌కు సంబంధించి తాజాగా మరోసారి విచారణ జరిగింది. రాహుల్ గాంధీ తరపున న్యాయవాది ప్రన్షు అగర్వాల్ హాజరై.. ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ బిజీగా ఉన్నారని, వ్యక్తిగత హాజరుకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అయితే, పదే పదే విచారణకు గైర్హాజరవుతున్న నేపథ్యంలో ఆయనకు రూ.200 జరిమానా విధించిన అప్పర్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం.. తదుపరి విచారణకు రాహుల్ తప్పకుండా హాజరు కావాలని ఆదేశించింది.

ఎపిపిఎస్‌సి చైర్మన్, మెంబర్స్ భర్తీ నోట్ ఫైల్ ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి, అమరావతి

ఎపిపిఎస్‌సి చైర్మన్, మెంబర్స్ నియామక నోట్ ఫైళ్లను నివేదించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవి డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఎపిపిఎస్‌షి చైర్మన్, సభ్యుల నియామకం జరగనందున వాళ్ల నియామకాలను రద్దు చేయాలని కోరుతూ లాయర్ తాండవ యోగేష్ పిల్ దాఖలు చేశారు. కనీస అర్హతలు లేని వారిని ఎపిపిఎస్‌సి సభ్యులుగా నియమించారని ఆరోపించారు. వీటికి చెందిన నోట్ ఫైళ్లను ప్రభుత్వం బయట పెట్టడం లేదన్నారు.

రైతు ఉద్యమాల్లో 'సుబ్బిరెడ్డి' పాత్ర స్ఫూర్తిదాయకం

- స్మారక స్థూపం ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగిన రైతుల పోరాటాల్లో బడా సుబ్బిరెడ్డి పాత్ర స్ఫూర్తిదాయకమని సిపిఎం నాయకులు కొనియాడారు. శ్రీసత్యసాయి జిల్లా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బడా సుబ్బిరెడ్డి ఇటీవల కన్నుమూశారు. సుబ్బిరెడ్డి స్వగ్రామం కదిరి మండలం వరిగిరెడ్డిపల్లిలో నిర్మించిన ఆయన స్మారక స్థూపాన్ని బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు జి.ఓబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిదారుల సంఘం సభ్యునిగా ప్రజా ఉద్యమంలోకి సుబ్బిరెడ్డి వచ్చారన్నారు. రైతుసంఘం నాయకునిగా 40 సంవత్సరాల పాటు రైతులు, కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటాలు సాగించారని కొనియాడారు. రైతులు సాగించిన ప్రతి పోరాటంలోనూ సుబ్బిరెడ్డి అగ్రభాగాన నిలిచారని గుర్తు చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో గంజి కేంద్రాలు పెడితే అది పూర్తిస్థాయిలో విజయవంతం అయ్యేలా నిరంతరం శ్రమించారన్నారు. ఆయన పోరాటాలు వామపక్ష ఉద్యమానికి స్ఫూర్తిగా నిలుస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ నరసింహులు, అన్నదాత రామిరెడ్డి, రామకృష్ణ, శ్రీ సత్యసాయి జిల్లా సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు, సుబ్బిరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



బడా సుబ్బిరెడ్డి స్థూపం వద్ద జోహార్లు అర్పిస్తున్న సిపిఎం, రైతు సంఘం నాయకులు

టిడ్కో ఇళ్లను పరిశీలించిన సిపిఎం బృందం

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో హిందూపురం రోడ్డు గట్ల వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన టిడ్కో ఇళ్లను సిపిఎం బృందం పరిశీలించింది. ఈ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు.

భూమి పైకి ఎప్పుడు వస్తామో తెలియట్లేదు: సునీతా విలియమ్స్



వాషింగ్టన్ : మూడోసారి రోదసిలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ దాదాపు తొమ్మిది నెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయారు. ఆమెతో పాటు వెళ్లిన బచ్ విల్మోర్ కూడా అక్కడే ఉండిపోయారు. అయితే వీరిని భూమిపైకి తీసుకువచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని.. దాంతో వ్యోమగాములు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా సిఇఓ ఎలాన్ మస్క్ విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. వీటన్నింటిపైనా ఈ వ్యోమగాములు స్పందించారు. "మేము భూమిమీదకు తిరిగి వచ్చే విషయంలో నెలకొన్న అనిశ్చితి చాలా కష్టమైన అంశం" అని అంతరిక్ష కేంద్రం నుంచి సునీత మీడియాతో మాట్లాడారు. సుదీర్ఘంగా తాము అంతరిక్షంలో ఉండిపోవడంపై వ్యక్తమవుతున్న ఆందోళనలను తోసిపుచ్చినప్పటికీ.. భూమిపై ఉన్న ప్రజలపై ఈ ప్రభావం ఉంటుందని విలియమ్స్, విల్మోర్ అంగీకరించారు. 2030లో అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) జీవితకాలం పూర్తయిన తర్వాత నాసా, అంతర్జాతీయ భాగస్వామ్య దేశాలు దాన్ని కక్ష్య నుంచి వేరు చేయనున్నాయి. అయితే దానికి కంటే ముందే ఐఎస్ఎస్‌ను రిటైర్ చేయాలని ఇటీవల మస్క్ ప్రతిపాదించారు. "ఇప్పుడు అత్యున్నత దశలో ఉన్నాం. నిష్క్రమించడానికి సరైన సమయం కాదని నేను భావిస్తున్నాను" అని విలియమ్స్ అభిప్రాయం వ్యక్తంచేశారు.

తమను బైడెన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న విమర్శలపై విల్మోర్ స్పందించారు. "అవి రాజకీయ సంబంధమైన వ్యాఖ్యలు. అవి జీవితంలో ఒక భాగం. ఈ వ్యవహారంలో రాజకీయాలకు ఏమాత్రం జోక్యం లేదని నా అభిప్రాయం. అందరికీ డొనాల్డ్ ట్రంప్, మస్క్ పట్ల గౌరవం ఉంది. మేం మా దేశానికి, మా నాయకులకు మద్దతు ఇస్తాం. వారికి మా కృతజ్ఞతలు" అని మాట్లాడారు. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో వారు ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు వారం రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమిని చేరుకుంది. సునీతా విలియమ్స్, విల్మోర్ అప్పటినుంచి ఐఎస్ఎస్‌లోనే ఉంటున్నారు.

రూ.37 వేల కోట్ల ప్రతిపాదనలు

- మంత్రి బిసి జనార్ధన రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొత్త రోడ్లు, వంతెనల నిర్మాణం, మరమ్మతులకు సంబంధించి ఎమ్మెల్యేలు, మంత్రులు అందించిన ప్రతిపాదనలు విలువ రూ.37 వేల కోట్లు ఉన్నట్లు ఆర్ అండ్ బి శాఖ మంత్రి బి.సి జనార్ధనరెడ్డి తెలిపారు. శాఖల బడ్జెట్ డిమాండ్లపై చర్చకు సమాధానవిస్తూ... ఈ ఏడాది బడ్జెట్‌లో ఆర్ అండ్ బికి రూ.8,818.12 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ మొత్తంలో ఆర్టీసికి రూ.4,309.86 కోట్లు ఉన్నాయని, ఆర్ అండ్ బికి రూ.4,508.26 కోట్లు ఉన్నట్లు తెలిపారు. బడ్జెట్‌లో సాధ్యమైన మేరకు రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధి, మరమ్మతులకు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులను 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. అంతకుముందు ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, గిత్తా జయసూర్య, యార్లగడ్డ వెంకట్రావు, పుత్తా కృష్ణచైతన్య రెడ్డి వారి నియోజకవర్గాల పరిధిలో రోడ్ల పరిస్థితిని వివరించి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఉపసభాపతి కె.రఘురామకృష్ణరాజు ఆయన నియోజవర్గంలోని బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు.

టూరిజంకు ఒక్క శాతం కూడా కేటాయింపులు లేవు

ప్రస్తుత బడ్జెట్‌లో టూరిజంకు 269.31 కోట్లు కేటాయించడం బిజెపి శాసనసభా పక్షనేత విష్ణుకుమార్‌రాజు అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాధాన్యత కలిగిన ఈ శాఖకు కనీసం 0.8 శాతం మేర మాత్రమే నిధులు కేటాయించారని, కనీసం ఒక్కశాతమైన నిధులు లేకపోవడాన్ని ఆక్షేపించారు. అయితే ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విదేశీ పర్యటనలో ఉండటంతో ఆయన తరుపున పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందిస్తూ... ఇది గవర్నమెంట్ పాలసీ అని, దీనిని ఒక పరిశ్రమగా ప్రభుత్వం గుర్తించిందని, టూరిజం అభివృద్ధికి పిపిపి మోడ్‌లో చర్యలు తీసుకోవడం వల్ల బడ్జెట్‌తో పోల్చుకోవడం సరైందని కాదన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఫైనాన్స్ వ్యాపారి మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)



పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణ శివారు ప్రాంతంలో సత్తెనపల్లి పట్టణానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఇది హత్యా? ఆత్మహత్యా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతునికి ఆశ్రయం కల్పించిన రామారావు వివరాల ప్రకారం.. సత్తెనపల్లికి చెందిన మందుడపు అంజిబాబు (40) కార్లకు ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. కొంత కాలంగా వ్యాపారం సరిగాలేకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. అప్పుల ఒత్తిళ్లు తట్టుకోలేక ఇటీవల పిడుగురాళ్లకు వచ్చి స్థానిక రైల్వే క్వార్టర్స్‌లోని రైల్వే ఉద్యోగి రామారావు వద్ద ఉంటున్నాడు. అంజిబాబుతో పాటుగా పవన్‌కుమార్‌రెడ్డి కూడా ఉంటున్నాడు. అంజిబాబుకు రూ.2.5 లక్షలు అప్పు ఇచ్చిన సత్తెనపల్లికి చెందిన షేక్ మహబూబ్ వాటి కోసం కొందర్ని తీసుకుని పిడుగురాళ్లలోని అంజిబాబు వద్దకు సోమవారం వచ్చాడు. అంజిబాబును కారులో ఎక్కించుకుని పట్టణంలోని ఖలీల్ దాబా ఎదురుగా ఉన్న ఖాళీ ప్లాటులోకి తీసుకెళ్లారు. డబ్బులు చెల్లించాలని అంజిబాబును ఒత్తిడి చేయడంతోపాటు దాడి చేశారు. అనంతరం పట్టణ శివారు ప్రాంతంలోని నాగేశ్వరావుపురం తండాల వద్దకు తీసుకెళ్లి పురుగు మందు కలిపిన మద్యం తాగించారు. ఈ సందర్భంలో గొడవ జరగడంతో అటుగా వెళ్తున్న పెట్రోలింగ్ పోలీసులు గమనించి అక్కడికి వచ్చారు. అప్పటికే స్పృహ కోల్పోయి పడి ఉన్న అంజిబాబు గురించి అడగగా మద్యం ఎక్కువై పడిపోయాడని చెప్పారు. అనంతరం అంజిబాబును పట్టణంలోని విజయ నర్సింగ్ వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉందని, గుంటూరుకు తీసుకెళ్లాలని చెప్పారు. గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందే క్రమంలో అంజిబాబు మంగళవారం మృతి చెందాడు. అజిబాబుకు అప్పు ఇచ్చిన షేక్ మహబూబ్ కొంతమందితో కలిసి పిడుగురాళ్ల వచ్చి అంజిబాబును, అతనితో ఉంటున్న పవన్ కుమార్‌రెడ్డిని తీసుకెళ్లారని, అప్పును తిరిగి చెల్లించాలని అంజిబాబుతో గొడవకు దిగారని, ఈ సందర్భంలో ఇద్దరూ కొట్టుకున్నారని పిడుగురాళ్ల పట్టణ సిఐ వెంకట్రావ్ చెబుతున్నారు. డబ్బుల కోసం అంజిబాబు పలువురికి ఫోన్లు చేశాడని, ఎవరూ స్పందించకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడని, అనంతరం అందరూ కలిసి పట్టణ శివారు ప్రాంతంలోని నాగేశ్వరావుపురం తండాల వద్ద మద్యం సేవించారని తెలిపారు. డబ్బులివ్వడం కుదరకపోతే చచ్చిపోవాలని మెహబూబ్ రెచ్చగొట్టడంతో పురుగుమందు ఇస్తే ఇప్పుడే చనిపోతానని అంజిబాబు అన్నాడని, మహబూబ్ వెంటనే పరుగుమందు ఇవ్వడంతో దాన్ని మద్యంలో కలిపి తాగాడని, వెంటనే షేక్ మహబూబ్, అతనితో వచ్చినవారు భయపడి అక్కడ నుండి వెళ్లిపోయారని, అంజిబాబును స్థానికులే ఆస్పత్రికి తరలించారని తెలిపారు. పవన్ కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు షేక్ మహబూబ్, ఇతరులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

అమెరికాలో శంషాబాద్ విద్యార్థి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ షాద్‌నగర్‌కు చెందిన విద్యార్థి అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట గ్రామానికి చెందిన గంప ప్రవీణ్ (27) ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. అక్కడ ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ప్రవీణ్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

‘చలో చండీగఢ్’పై పోలీస్ నిర్బంధం

- ఎక్కడికక్కడ భద్రత కట్టుదిట్టం
- అదుపులోకి పలువురు రైతు నాయకులు

చండీగఢ్: సుదీర్ఘ కాలంగా ఉన్న డిమాండ్ల సాధన కోసం సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) బ్యానర్ కింద బుధవారం జరిగిన ‘చలో చండీగఢ్’ మార్చ్‌ను పంజాబ్ పోలీసులు అడ్డుకున్నారు. వివిధ వాహనాలతో బయలుదేరిన రైతులను చండీగఢ్ చేరుకోకుండా పోలీసులు నిరోధించారు. ఈ మార్చ్‌తో చండీగఢ్‌కు చేరుకున్న తర్వాత అక్కడ వారం పాటు ధర్నాకు రైతులు నిర్ణయించారు. అయితే, పోలీసులు అడ్డుకోవటంతో రైతుల కార్యాక్రమాలకు అవాంతరాలు ఎదురయ్యాయి. ఈ మార్చ్ నేపథ్యంలో పంజాబ్ అంతటా పోలీసులు బారికేడ్లు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. పలువురు రైతు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. చండీగఢ్‌లోని దాదాపు అన్ని ప్రవేశ ద్వారాల వద్ద కూడా పోలీసులు భద్రతను పెంచారు. చండీగఢ్ పోలీసులు చండీగఢ్–మొహాలి సరిహద్దు వద్ద రైతులు నగరంలోకి ప్రవేశించకుండా నిరోధించడానికి బారికేడ్లను ఏర్పాటు చేశారు. అన్ని ప్రవేశ మార్గాల వద్ద భద్రతను ముమ్మరం చేశారు. పోలీసు సిబ్బంది అన్ని వాహనాలను తనిఖీ చేసింది. అల్లర్ల నిరోధక వాహనాలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక దళాలు, ఇసుకతో నిండిన టిప్పర్లను అన్ని సరిహద్దు పాయింట్ల వద్ద మోహరించారు. ఈ తీవ్రమైన భద్రతా చర్యల కారణంగా, సరిహద్దు క్రాసింగ్‌ల వద్ద



వాహనాల పొడవైన క్యూలు ఏర్పడ్డాయి, దీనివల్ల ప్రయాణికులకు ఇబ్బంది కలిగింది.

బుధవారం ఉదయం ట్రాక్టర్–ట్రాలీలు, ఇతర వాహనాలలో చండీగఢ్‌కు బయలుదేరిన రైతులను పంజాబ్ పోలీసులు అనేక చోట్ల ఆపారు. దీంతో గ్రామీణ లింక్ రోడ్ల ద్వారా చండీగఢ్‌కు చేరుకోవడానికి తాము ప్రయత్నిస్తున్నామని రైతు నాయకులు తెలిపారు. రాష్ట్రంలో అతిపెద్ద రైతు సంఘమైన బికెయు ఏక్తా–ఉగ్రహన్ అధ్యక్షుడు జోగిందర్ సింగ్ ఉగ్రహన్‌ను సంగ్రూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనను ఘరాచోన్ గ్రామం సమీపంలో అరెస్టు చేసి చాజ్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఆయన సహచరుడు జగ్తర్ కలాఝర్ తెలిపారు. పంజాబ్‌లోని రెండో అతిపెద్ద రైతు సంఘమైన బికెయు డకౌండా... తమ అధ్యక్షుడు మంజిత్ సింగ్ ధనేర్‌ను పోలీసులు హింసించారని ఆరోపించింది. రాయ్‌కోట్‌లోని బైని ధరేరా గ్రామం సమీపంలో ధనేర్‌ను అరెస్టు చేయడానికి పోలీసులు ప్రయత్నించగా రైతుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. అనేక మంది రైతులు గుమిగూడి, ఆయనను తీసుకెళ్లడానికి అనుమతించలేదు. ఈ గందరగోళంలో, పోలీసులు, రైతులకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. దీంతో ధనేర్ అక్కడి నుంచి తప్పించుకున్నారు.

ఫిరోజ్‌పూర్‌లోని మఖు బ్లాక్ నుంచి వచ్చిన బికెయు మొదటి బ్యాచ్ ట్రాలీలను బుధవారం ఉదయం లూథియానాలోని హెడాన్ గ్రామం సమీపంలో నిలిపివేశారు. పాటియాలా–చండీగఢ్ రహదారిపై పోలీసులు ఇసుక టిప్పర్లను ఉంచడంతో పాటియాలా నుంచి వచ్చిన మరో రైతుల బృందం చండీగఢ్ వైపు వెళ్లకుండా ఆగిపోయింది. ఫజిల్కా నుంచి దాదాపు 20 వాహనాల కాన్వాయ్‌ను జగ్రాన్ సమీపంలో ఆపారు. మోగాలో క్రాంతికారి కిసాన్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జతీందర్ సింగ్ మాట్లాడుతూ.. తమ బృందాన్ని మోగా జిల్లాలోని అజిత్వాల్ వద్ద పోలీసులు ఆపారనీ, కొంతమందిని అదుపులోకి తీసుకున్నారని అన్నారు. సమ్రాలాలో రైతులను కూడా అదేవిధంగా ముందుకు సాగకుండా ఆపారు. చండీగఢ్‌లోకి ప్రవేశించకుండా నిరోధించినందుకు అక్కడి ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చెలరేగాయి.

మొహాలీలోని అంబ్ సాహిబ్ గురుద్వారా వద్ద గుమిగూడిన దాదాపు 50 మంది రైతులను కూడా అదుపులోకి తీసుకున్నారు. 30కి పైగా రైతు సంఘాల కూటమైన ఎస్‌కెఎం తమ వివిధ డిమాండ్లకు మద్దతుగా మార్చి 5 నుంచి చండీగఢ్‌లో ధర్నాకు పిలుపునిచ్చింది.

అయితే రైతులు తమ ధర్నాను నిర్వహించడానికి చండీగఢ్ పాలనా యంత్రాంగం అనుమతిని నిరాకరించింది. రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ చండీగఢ్ చేరుకోవడానికి అనుమతించబోమని రోపర్ రేంజ్ డీఐజీ హర్‌చరణ్ సింగ్ భుల్లార్ తెలిపారు.

తహశీల్దార్లకు .... చట్టవిరుద్ధ రిజిస్ట్రేషన్లను రద్దు చేసే అధికారం

- రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ప్రభుత్వ భూముల రక్షణకు రెవెన్యూ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ భూములతో పాటు చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేయకూడిన ఏ భూమినైనా రిజిస్టర్ చేస్తే ఆ డాక్యుమెంట్‌ను రద్దు చేసే అధికారం తహశీల్దార్లకు ఇస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఒకటి రెండు రోజుల్లో విడుదల అవుతాయన్నారు. ఇప్పటి వరకు ఈ అధికారాలు జిల్లా కలెక్టర్లకు మాత్రమే ఉండేవన్నారు. రద్దు చేయాల్సిన రిజిస్టర్ డాక్యుమెంట్లను తహశీల్దార్ సబ్ రిజిస్ట్రార్‌కు పంపాల్సి ఉంటుందని, సబ్ రిజిస్ట్రార్ ఆ డాక్యుమెంట్ రద్దుకు చేయాల్సిన ప్రక్రియ అంతా పూర్తి చేసి, కాపీలను స్కాన్ చేసిన అనంతరం ఆ డాక్యుమెంట్‌ను తహశీల్దార్ సూచించిన వారికి పంపుతారన్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ భూములను తప్పుడు పద్ధతుల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారని ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ కమిషనరు నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు.

భోగాపురం ఎయిర్‌పోర్టుకు ట్రాఫిక్ తగ్గించేందుకు ‘మెట్రో ’

- నాలుగేళ్లలో పూర్తి : మంత్రి నారాయణ
- త్వరలో తల్లికి వందనం గైడ్‌లైన్స్ : మంత్రి నారా లోకేష్
- త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికలు : మంత్రి సవిత
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాలు

ప్రజాశక్తి– అమరావతి బ్యూరో

విశాఖ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టుకు ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు మెట్రో రైలు ప్రాజెక్టు, కొత్త రోడ్ల ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో ‘భోగాపురం ఎయిర్ పోర్టుకు రహదారులు’ అనే అంశంపై జనసేన పార్టీ నెలిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, బిజెపి శాసనసభాపక్ష నాయకులు విష్ణుకుమార్‌రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమించారు. గాజువాక నుంచి భోగాపురం వరకు మద్దిలపాలెం, మధురవాడ మీదుగా 34.6 కిలోమీటర్లు మెట్రో నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు కచ్చితంగా ఆమోదం పొందేలా చూడడంతోపాటు, ఆమోదం రాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. విశాఖలో మెట్రో రైలు వస్తే ట్రాఫిక్ కొంతమేర తగ్గుతుందన్నారు. మెట్రో రైలు ప్రాజెక్టు పూర్తి కావడానికి నాలుగేళ్లు పడుతుందని వివరించారు. ఎన్‌హెచ్ 45 రోడ్డుపై ట్రాఫిక్ తగ్గించడానికి 15 అంతర్గత రోడ్లు ఏడాదిన్నరలోగా పూర్తయ్యేలా ఆదేశాలిచ్చామన్నారు. పాత హైవే ఎన్‌హెచ్ 47 నుంచి ఎన్‌హెచ్ 16కు ఆరు రోడ్ల ప్రతిపాదన ఉందని తెలిపారు. విశాఖలోని ఎమ్మెల్యేలందరితో వచ్చే వారం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.

తల్లికి వందనంపై వైసిపి సభ్యులు లిఖిత పూర్వకంగా అడిగిన ప్రశ్నకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సమాధానమిస్తూ, ఈ పథకాన్ని మే నెలలో తప్పనిసరిగా అమలు చేస్తామని, గైడ్‌లైన్స్ త్వరలో ఇస్తామని, బడ్జెట్లో ఈ పథకానికి రూ.9,407 కోట్లు కేటాయించామని తెలిపారు. ఇంట్లో ఎంతమంది చదువుకుంటున్న పిల్లలు ఉంటే అంతమందికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. కలికిరి ఇంజనీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ హోదాపై పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు లోకేష్ సమాధానమిస్తూ దీనిపై పరిశీలిస్తామన్నారు. ఎయిడెడ్ కళాశాలలకు ఒక ప్రత్యేక పాలసీ తెచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పోస్టులు అమ్మకానికి పెట్టకుండా చూడాలని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మంత్రిని కోరారు. ప్రభుత్వ రిక్రూట్‌మెంట్ తర్వాత కొత్త ఎయిడెడ్ పాలసీలో అటువంటివి జరగకుండా చూస్తామని లోకేష్ అన్నారు. రాష్ట్రంలో చేనేత రంగంపై జరిగిన చర్చకు మంత్రి సవిత సమాధానమిస్తూ, త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

పలు పద్దులకు ఆమోదం తెలిపిన సభ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ప్రస్తుత బడ్జెట్‌లో రోడ్లు–భవనాలు, టూరిజం, పౌరసరఫరాలు, జలవనరులు, పరిశ్రమల శాఖల గ్రాంట్ల కొరకు చేసిన అభ్యర్థనలను శాసన సభలో చర్చ అనంతరం సభ బుధవారం ఆమోదం తెలిపింది. ఆర్ అండ్ బి శాఖకు రూ.8,818,11 కోట్లు, టూరిజం శాఖకు రూ.269.92 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.3,806.84 కోట్లు, భారీ, మధ్య తరహా నీటి పారుదల విభాగానికి రూ.17,161.38 కోట్లు, చిన్న తరహా నీటి పారుదల విభాగనికి రూ.877.60 కోట్లు అభ్యర్థించగా శాసన సభలో ఆమోదం లభించింది. అంతకు ముందు జరిగిన చర్చలో ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, నడుకుదుటి ఈశ్వరరావు, వేగేశ్న నరేంద్ర వర్మ, బండారు శ్రావణి, నక్కా ఆనంద్ బాబు, ఆదిరెడ్డి శ్రీనివాస్, బొజ్జల సుధీర్‌రెడ్డి, సుందరాపు విజయ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

అమెరికాపై డబ్ల్యుటిఓలో కెనడా ఫిర్యాదు

టొరంటో : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విపరీతంగా టారిఫ్‌లను పెంచేయడంపై కెనడా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ)లో ఫిర్యాదు చేసింది. డబ్ల్యుటిఓ బుధవారం ఆ విషయాన్ని ధృవీకరించింది. అమెరికా తీసుకున్న నిర్ణయంతో ఫిర్యాదు చేయడం మినహా తమకు మరో అవకాశం లేకుండా పోయిందని డబ్ల్యుటిఓలో కెనడా రాయబారి నదియా థియోడర్ పేర్కొన్నారు. ఈ మేరకు లింక్డిన్‌లో పోస్టు పెట్టారు. అదనపు టారిఫ్‌ల విషయమై డబ్ల్యుటిఓలో అమెరికాపై కెనడా వివాద పరిష్కార చర్యలు చేపట్టినట్లు డబ్ల్యుటిఓ అధికారి ఒకరు మీడియాకు ధృవీకరించారు. చైనా కూడా ఇదే రీతిలో అమెరికాపై ఫిర్యాదు నమోదు చేసింది. అక్రమ వలసలను, డ్రగ్ రవాణాను నిరోధించడంలో విఫలమయ్యారంటూ కెనడా, మెక్సికోల దిగుమతులపై ట్రంప్ 25శాతం టారిఫ్‌లు విధించారు. ఆ తర్వాత వాటి అమలును తాత్కాలికంగా నిలిపివేశారు. ఆ రెండు అంశాల్లో ఎలాంటి పురోగతి లేదని పేర్కొంటూ తిరిగి మంగళవారం ఆ టారిఫ్‌లు అమలవుతాయని ట్రంప్ ప్రకటించారు. కెనడా, మెక్సికోల విషయంలో ట్రంప్ ఏదో ఒక చర్య తీసుకుంటారని భావిస్తున్నట్లు అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హొవార్డ్ లుట్నిక్ వ్యాఖ్యానించారు. కెనడా దిగుమతులపై టారిఫ్‌లు అమల్లోకి వచ్చిన వెంటనే కెనడా ప్రధాని ట్రూడే స్పందిస్తూ, వాషింగ్టన్ వాణిజ్య యుద్ధానికి దిగుతోందని విమర్శించారు. కెనడా ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చాలని ట్రంప్ భావిస్తున్నారని, అప్పుడు అమెరికాలో కలిపేసుకోవడానికి సులభం అవుతుందని భావిస్తున్నారని వ్యాఖ్యానించారు.

ఎక్స్‌పోర్ట్ సిండికేట్‌కు వ్యతిరేకంగా రొయ్య రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి – వీరవాసరం (పశ్చిమగోదావరి)



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రొయ్య రైతులు

రొయ్యల ఎక్స్‌పోర్ట్ వ్యాపారస్తుల సిండికేట్‌ను విచ్ఛిన్నం చేయాలని, ప్రభుత్వం జోక్యం చేసుకుని తమను ఆదుకోవాలని రొయ్య రైతులు డిమాండ్ చేశారు. జిల్లా రొయ్య రైతుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో ఎన్‌టిఆర్ సెంటర్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. తక్షణమే ఎక్స్‌పోర్ట్ వ్యాపారస్తులు సిండికేట్ మానుకోకపోతే వారి ఫ్యాక్టరీలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రొయ్య సాగు రైతులు మళ్ల రాంబాబు, వీరవల్లి చంద్రశేఖర్, కడలి నెహ్రూ మాట్లాడుతూ.. రొయ్యలు ఎగుమతి చేసేవారు, మేత అమ్మేవారు ఒక్కరే కావడంతో వారంతా సిండికేట్‌గా ఏర్పడి రొయ్యసాగు రైతులను ఆర్థికంగా దెబ్బతీసే చర్యలు చేపడుతున్నారని తెలిపారు. మేత రేటు పెంచేసి, రొయ్య ధర మాత్రం తగ్గించేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించిన నాటి నుంచి కొనుగోలు ధరను రోజురోజుకీ తగ్గిస్తున్నారని తెలిపారు. కిలో రూ.250గా ఉన్న వంద కౌంటును రూ.210 నుంచి రూ.220 కొనుగోలు చేస్తున్నారన్నారు. ఎక్స్‌పోర్ట్ ధర స్థిరంగా ఉన్నా ఉద్దేశపూర్వకంగానే రైతులకు చెల్లించాల్సిన ధరను మాత్రం సిండికేట్ వ్యాపారులు తగ్గిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుని రొయ్య రైతులను ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో క్రాప్ హాలిడే ప్రకటిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రైతులకు చెల్లించాలని, మేత ధరలు తగ్గించాలని, నాణ్యమైన సీడ్‌ను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యరకరాజు హరిబాబు, వేంద్ర వెంకటలీలాకృష్ణ, వీరవల్లి శ్రీనివాసరావు, మరిడి వెంకటేశ్వరరావు, గోపిరాజు, కడలి శ్రీరాములు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

నితీష్ కుమార్ ఒక పాత వాహనం

- తేజస్వీ యాదవ్ విమర్శలు

పాట్నా : బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై ఆర్‌జెడి నాయకులు తేజస్వీ యాదవ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. నితీష్ కుమార్ ఒక పాత వాహనమని, ఆయన అసమర్థ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని విమర్శించారు. అసమర్థ ప్రభుత్వం బీహార్ ప్రజలకు వద్దని కోరారు. ఒక కార్యాక్రమంలో తేజస్వీ మాట్లాడుతూ ‘పదవి విరమణ వయసు 60గా ఉంటుందని, 75 ఏళ్ల సిఎం కావాలా..?’ అని ప్రజలను ప్రశ్నించారు. “ముఖ్యమంత్రి అలసిపోయారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. పాత వాహనంతో ముందుకు వెళ్లలేం. సరికొత్త దృక్పథంతో అభివృద్ధి సాధించాలి. నితీష్ రిటైర్ అయ్యారు. ఆయనకు తన డిప్యూటీ సీఎంల పేర్లు కూడా గుర్తు లేవు. త్వరలో మా ప్రభుత్వం ఏర్పాటవుతుంది” అని పేర్కొన్నారు. కాగా.. అసెంబ్లీలో తన ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన తేజస్వీ యాదవ్‌పై నీతీశ్ కుమార్ మండిపడిన సంగతి తెలిసిందే. తన కారణంగానే లాలూ ప్రసాద్ యాదవ్ రాజకీయాల్లో ఎదిగారని వ్యాఖ్యానించారు. ఆయనకు అండగా ఎందుకు నిలుస్తున్నారని లాలూ సొంత మనుషులే అడిగారని.. అయినా మద్దతు ఇచ్చానంటూ నితీష్ పేర్కొన్నారు. తాజాగా నితీష్‌పై లాలూ కుమారుడు తేజస్వీ ఈ వ్యాఖ్యలు చేశారు.

జగన్ వాస్తవాలు మాట్లాడాలి

- చట్టాన్ని ఉల్లంఘించి ప్రతిపక్ష హోదా ఇవ్వాలా?
- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాస్తవాలు మాట్లాడాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు దౌర్జన్యాలు, అవినీతితో అడ్డగోలుగా వ్యవహరించిన జగన్, ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత నీతులు, విలువల గురించి మాట్లాడటం చాలా ఆశ్చర్యంగా ఉందన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 10 శాతం సభ్యులు ఉండాలని పార్లమెంట్, అసెంబ్లీ రూల్ బుక్‌లో చాలా స్పష్టంగా ఉందని చెప్పారు. ఐదుగురు టిడిపి ఎమ్మెల్యేలను లాగేస్తే చంద్రబాబు నాయుడుకు ప్రతిపక్షహోదా ఉండదని గతంలో జగన్ అన్నారని గుర్తుచేశారు. చట్టాన్ని ఉల్లంఘించి ప్రతిపక్ష హోదా ఇవ్వమంటారా? అని ప్రశ్నించారు. ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వకూడదని నిర్ణయించుకున్నారని, అది తెలుసుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల్ని కలవలేదని, ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీకి రారని అన్నారు. పులివెందుల ఎమ్మెల్యేగా తనకు ఉన్న హక్కులను జగన్ వినియోగించుకోవచ్చునని తెలిపారు. వైసిపి హయాంలో 40 లక్షల మందికి ఉద్యోగాలు ఎక్కడ కల్పించారో వివరాలు ఇవ్వాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులను కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. డిఎస్సి గురించి మాట్లాడే అర్హత వైసిపికి లేదన్నారు. వన్‌మ్యాన్ కమిటీ నివేదిక వచ్చిన వెంటనే ఈ నెలలోనే డిఎస్సి ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రజలకు అవసరమైన అంశాలను బడ్జెట్‌లో పొందుపరిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, ఎన్ఎండి ఫరూక్, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎస్ సవిత, ఎమ్మెల్సీలు చిరంజీవి రావు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గణబాబు తదితరులు పాల్గొన్నారు.



రెస్క్యూ బృందాలతో సమీక్షిస్తున్న అరవింద్ కుమార్, బాదవత్ సంతోష్

కానరాని కార్మికుల ఆచూకీ

- తోడిన కొద్దీ పైనుంచి పడుతున్న మట్టి
- రెండ్రోజుల్లో కొలిక్కి వచ్చే అవకాశం!

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో మట్టిని బయటకు తోడేస్తున్న కొద్దీ పైనుంచి పడుతోంది. రెస్క్యూ టీమ్‌లు 24 గంటలు పనిచేస్తున్నా కార్మికుల ఆచూకీ తెలుసుకోవడంలో అడుగు ముందుకు పడడం లేదు. కన్వేయర్ బెల్ట్ మరమ్మతు తర్వాత.. దాని ద్వారా గంటకు 800 టన్నుల మట్టిని బయటికి తరలిస్తున్నా అంతకుమించి మట్టి పైనుంచి పడుతోంది. మరోవైపు టన్నెల్ బోరింగ్ మిషన్ చివరలో కార్మికులు ఇరుక్కున్నారేమోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బోరింగ్ మిషన్ చివరి వరకు విడగొట్టి దానిని బయటకు పంపాలనే యోచనతో రెస్క్యూ టీమ్‌లు పనిచేస్తున్నాయి. ఈ సమయంలో రోబోతో పనులు చేయించాలన్న కారణంతో అధికారులు నిపుణులను పిలిపించారు. రోబోలతో సహాయక చర్యల సాధ్యాసాధ్యాలపై సమీక్ష నిర్వహించారు. రెండ్రోజులుగా సొరంగం దగ్గర మంత్రులు కనిపించడం లేదు. మరోవైపు కార్మికుల ఆచూకీ తెలియక తల్లిదండ్రులు, భార్యాపిల్లలు కన్నీరు మున్నీరవుతున్నారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో సహాయక చర్యలను సమీక్షించేందుకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్ ఉన్నతాధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సహాయక బృందాల పనులను విభాగాల వారీగా విశ్లేషించారు. బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ కల్నల్ పరీక్షిత్ మెహర టన్నెల్ బోరింగ్ మెషిన్ నమూనాతో అధికారులకు టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలను వివరించారు.

కుటుంబ సభ్యుల రోదన

సొరంగంలో ఇరుక్కున్న కార్మికుల కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. రోజులు గడిచిన కొద్దీ వారి ఆచూకీ తెలియక విలవిల్లాడుతున్నాయి. మాకు తిండి అవసరం లేదు.. మా బిడ్డలను చూపించాలని వేడుకుంటున్నారు. అధికారులు ఎంత వారించే ప్రయత్నం చేసిన వారు వినడం లేదు.

గురుకులాల ప్రవేశాలకు దరఖాస్తు గడువు 13 వరకూ పెంపు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

వచ్చే విద్యా సంవత్సరానికి (2025–26) డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి ఏడాది (ఆంగ్ల మాధ్యమం)లో ప్రవేశానికి ఆశక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు సమర్పించాలని ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐ సొసైటీ కార్యదర్శి పి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించేందుకు తుది గడువు ఈ నెల 13వ తేదీ వరకూ పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఎపి సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ గురుకులాల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులు, ఇతర వివరాల కోసం ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ వెబ్ సైట్ https://apbragcet.apcfss.in ను సందర్శించాలని కోరారు.

ఆగిన ‘చర్చిల పరిశీలన’

(మొదటి పేజీ తరువాయి)

దిగడమే అవుతుందని తెలిపారు. ఇదిప్రజల మధ్య అనైక్యత విద్వేషాలను సృష్టిస్తుందని హెచ్చరించారు. చర్చిలపై మాత్రమే సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులివ్వడం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసుందన్నారు.

కెవిపిఎస్ హర్షం

చర్చిల అనుమతులపై విచారణకు పిఆర్ శాఖ జారీ చేసి మెమోను ఉపసంహరించుకోవడం పట్ల కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి గురువారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చర్చిలకు కలెక్టర్లు ఇచ్చిన అనుమతులు ఉన్నా లేదా అని సమగ్ర విచారణ నిర్వహించి, అనుమతి లేని చర్చిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ తొలుత జారీ చేసిన ఉత్తర్వులు సరైనవి కావని ఆయన పేర్కొన్నారు. ఆ ఆదేశాలు క్రైస్తవుల పట్ల వివక్ష పూరితమైనవిగా కెవిపిఎస్ భావిస్తోందని చెప్పారు. ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని తమ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసిందని, ఆ మేరకు ఉపసంహరించుకోవడం సంతోషకరమని ఆయన తెలిపారు.

ఏప్రిల్ 2 నుండి భారత్, చైనాలపై ప్రతీకార సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎదుర్కొనాల్సి రావాల్సి వస్తుందని చెప్పారు. అయితే అవేమీ అంత తీవ్రమైనవని కావని, సద్దుబాటు చేసుకోవచ్చని అన్నారు. టారిఫ్‌లనేవి కేవలం అమెరికా ఉద్యోగాలను రక్షించేవే కాదని, అవి మన దేశ ఆత్మను పరిరక్షించేవని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికాలో తమ ఉత్పత్తులను తయారుచేయని వారు లెవీలను చెల్లించాల్సి వుంటుందని హెచ్చరించారు. కొన్ని కేసుల్లో అవి పెద్ద మొత్తంలోకూడా వుండొచ్చునన్నారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని అంతమొందించేందుకు ఒప్పందం కుదుర్చుకోవడంపై చర్చలు జరిపేందుకు సంసిద్ధంగా వున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ నుండి లేఖ అందిందని ట్రంప్ చెప్పారు.

కల్పన ఆత్మహత్యాయత్నం చేసుకోలేదు

- అధిక మొత్తంలో నిద్ర మాత్రలు మింగడం వల్లే..: పోలీసులు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ గాయకురాలు కల్పనది ఆత్మహత్యాయత్నం కాదని, నిద్రమాత్రలు అధిక మోతాదులో వేసుకోవడం వల్ల అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాల్లోకెళ్తే.. గాయని కల్పన తన భర్తతో కలిసి నిజాంపేట్ రోడ్డులో గల వర్టెక్స్‌లోని విల్లాలో ఐదేండ్ల నుంచి నివసిస్తున్నారు. అయితే, తన కుమార్తెను హైదరాబాద్‌లో చదువుకోవాలని కల్పన చెప్పగా.. ఆమె అందుకు నిరాకరిస్తుండటంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో కల్పన ఈ నెల 4న కేరళ నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. ఎంత ప్రయత్నించినా ఆమెకు నిద్ర రాకపోవడంతో జోల్ ఫ్రెష్ నిద్ర మాత్రలు వేసుకున్నారు. అయినా నిద్ర పట్టకపోవడంతో మరికొన్ని నిద్రమాత్రలు వేసుకున్నారు. దాంతో ఆమె అపస్మారక స్థితికి వెళ్లారు. భర్త ప్రసాద్ ఆమెకు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో విషయాన్ని కాలనీ వెల్ఫేర్ మెంబర్స్‌కు తెలిపారు. వారు పోలీసులకు సమాచారం అందించగా.. పోలీసులు కల్పన ఇంటి తలుపులు తట్టినా ఎంతకూ తీయలేదు. దాంతో వెనుకవైపు నుంచి లోపలికి వెళ్లగా బెడ్ రూమ్‌లో ఆమె అపస్మారక స్థితిలో ఉన్నారు. వెంటనే ఆమెను హోలిస్టిక్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

కుటుంబంలో ఎలాంటి గొడవలూ లేవు : కల్పన కూతురు

కల్పన ఆస్పత్రిలో చికిత్స పొందుతుందన్న విషయం తెలుసుకున్న ఆమె కూతురు దయా ప్రసాద్ ప్రభాకర్ వెంటనే కేరళ నుంచి హైదరాబాద్ వచ్చారు. హోలిస్టిక్ ఆస్పత్రిలో తల్లిని పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. తన తల్లి ఆత్మహత్యాయత్నం చేసుకోలేదని చెప్పారు. తను ఇన్సోమియా పేషెంట్ కావడంతో డాక్టర్ల సూచనల మేరకు కొన్ని టాబ్లెట్లు తీసుకుంటోందని తెలిపారు. అయితే, వాటి డోస్ పెరగడంతో తన తల్లి అపస్మారక స్థితిలోకి వెళ్లిందన్నారు. తమ కుటుంబంలో ఎలాంటి గొడవలూ లేవని, అంతా సంతోషంగానే ఉన్నట్టు వెల్లడించారు. ఈ విషయంలో తప్పుడు ప్రచారం చేయొద్దని కోరారు.

డీలిమిటేషన్ పై దాటవేత

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. ‘ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ బిల్లు పైనా చర్చ జరిగింది. భూములకు సంబంధించి కంప్యూటరీకరణలో కొన్ని సమస్యలు ఉన్నాయి. గతంలో అధికారులు, నాయకులు కలిసిపోయారు. అటవీ భూములు ఆక్రమించారు’ అని చెప్పారు. ‘గుజరాత్‌లో ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు విజయవంతంగా అమలైంది. ఈ బిల్లు ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలిలో ఆమోదం పొందాయి. దానిని త్వరగా ఆమోదించాలని కోరాం.’ అని చెప్పారు. రాష్ట్రంలో గంజాయి అనే మాట వినిపించకుండా చేసి, యువతను సన్మార్గంలో నడిపించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు మరో బిల్లు తీసుకొస్తామని చంద్రబాబు చెప్పారు.

బనకచర్లపై చర్చించాం...

‘ ఏపిలో 12.94 శాతం వృద్ధి రేటు సామర్థ్యం కాగా.. ఈ ఏడాది 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం. పోలవరం–బనకచర్ల అనుసంధానంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చించాం. దానికి కేంద్రం సహాయం అడిగాను. వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నానదుల అనుసంధానం జరగాలి. పోలవరం–బనకచర్ల అనుసంధానంతో రాయలసీమకు ప్రయోజనం చేకూరనుంది. ఈ ప్రాజెక్టు గేట్ వే ఆఫ్ రాయలసీమగా నిలుస్తోంది. గోదావరి నది నుంచి సముద్రంలోకి వృధాగా పోయే నీటినే వాడుకుంటాం’ అని బాబు చెప్పారు. పోలవరం ప్రాజెక్టుకు నిర్మాణంలో పురోగతి ఉందని రెండేళ్లలో ఫేజ్–1 పూర్తి చేస్తామని చెప్పారు. “అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు, వినుకొండ–అమరావతి రోడ్డు, విశాఖపట్నం–మూలపేట రోడ్డు, హైదరాబాద్–మచిలీపట్నం రోడ్డు వంటి వాటిపై కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించినట్లు తెలిపారు. ఇందులో కొత్త రోడ్లకు సంబంధించి డిపిఆర్ పూర్తి అయిన తరువాత టెండర్లు పిలుస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పర్యవరణ అనుమతులు రావాల్సి ఉందని అన్నారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులను కలిసిన వారిలో చంద్రబాబుతో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టిడిపి, బిజెపి ఎంపిలు పాల్గొన్నారు.

యథాతథ స్థితినే కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి)

అప్పటి ప్రధాని వాజ్‌పేయి హామీ ఇచ్చినట్లుగా 2026 నుండి వచ్చే 30 ఏళ్ళ వరకు ప్రస్తుతమున్న ఏర్పాట్లను ఇలాగే కొనసాగించాలి’ అని అఖిలపక్ష సమావేశం కేంద్రాన్ని కోరింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలు కూడా జనాభా నియంత్రణ చర్యలను అమలు చేయాల్సిన అవసరం వుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన పలు తీర్మానాలను ప్రతిపాదించారు. బిజెపి ప్రభుత్వం చేపట్టాలనుకుంటున్న లోక్‌సభా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను సమావేశం ఖండించింది. దీనివల్ల తమిళనాడు, ఇతర దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తీవ్రమైన ముప్పులో పడుతుందని సమావేశం హెచ్చరించింది. తమిళనాడు నుండి 39 మంది ఎంపీలు వుంటేనే బిజెపి ప్రభుత్వం తమ మాట పెడచెవిన పెడుతోందని, ఈ సంఖ్య ఇంకా తగ్గితే తమిళనాడుకు తీరని అన్యాయం జరుగుతుందని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ విషయంలో తమ వైఖరి చాలా దృఢంగా వుందన్నారు. 2026 జనాభా లెక్కల ప్రాతిపదికన పునర్విభజన జరిగితే తమిళనాడుకు 8 స్థానాలు తగ్గుతాయని అన్నారు. నియోజకవర్గాల సంఖ్యను 848కి పెంచినట్టైతే, పర్సెంట్ ప్రాతిపదికగా పునర్విభజనను అనుసరిస్తే తమిళనాడుకు అదనంగా 22 నియోజకవర్గాలు వస్తాయని ఆయన చెప్పారు. అలా కాకుండా ప్రస్తుత జనాభా ప్రాతిపదికన చేస్తే తమిళనాడుకు కేవలం 10 సీట్లు వస్తాయన్నారు. ఈ రెండు పద్ధతులు అధిక జనాభా వున్న రాష్ట్రాలకు సీట్లను పెంచుతాయి. కానీ తమిళనాడు స్వరం అణచివేయబడుతుందని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ కుట్రను తాము కచ్చితంగా ఓడిస్తామని స్పష్టం చేశారు. మొత్తంగా పార్లమెంట్ సభ్యుల సంఖ్యను పెంచినట్టైతే 1971 జనాభా లెక్కల ప్రాతిపదికన లోక్‌సభ, రాజ్యసభల్లో తమిళనాడు, ఇతర దక్షిణాది రాష్ట్రాల సీట్లను దామాషా పద్ధతిలో పెంచేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరుతూ అఖిల పక్షం మరో తీర్మానాన్ని ఆమోదించింది.



మీకోసం

కూరలో పులుపు తక్కువైనట్లు అనిపిస్తే మామిడి పొడి, పెరుగు మిశ్రమాన్ని కలిపితే టమాట రుచి వస్తుంది.

జీవన సౌరభం

భయపడడం ఎప్పుడు మానేస్తామో అప్పుడే జీవితం మొదలవుతుంది.

స్నేహం - నమ్మకం



శంకరయ్య ఒక రైతు. ఆ ఏడాది సకాలంలో వర్షాలు పడక పంటలు వేయటం అవలేదు. కుటుంబాన్ని ఎలా పోషించేదని శంకరయ్య చాలా బాధపడ్డాడు. కూతురు రాగిణికి వ్యవసాయం గురించి తరగతి గదిలో చెప్పిన పాఠాలు గుర్తుకొచ్చాయి. ఎప్పుడైనా వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు వరి పంట కాకుండా ఇతర కూరగాయ పంటలు, పూల పంటలు వేసి తక్కువ నీటిని వాడుకో వచ్చని మాస్టారు చెప్పిన పాఠాలు నాన్నకి చెప్పింది.

కూతురు చెప్పినట్లే శంకరయ్య తన రెండెకరాల భూమిలో బంతితోట, టమాట తోట పెట్టాడు. ఉన్న కొద్ది పాటి నీటిని దానికి జాగ్రత్తగా ఉపయోగించారు. పంట బాగా పండింది. బంతిపూలు, టమాటాలు తీసుకుని మార్కెట్‌కి వెళ్ళాడు. అవి మంచి ధరకు అమ్ముడయ్యాయి. సాయంత్రం అయ్యేసరికి శంకరయ్యకి పక్కనే ఉన్న వ్యాపారి రంగయ్యతో పరిచయమేర్పడింది. అతనిది పొరుగూరు కావడంతో శంకరయ్య తన ఇంటికి రమ్మని ఆహ్వానించాడు. తన పొలంలోని బంతిపూలు, టమాటాలను చూపించాడు. ఆ పంటలని చూసిన రంగయ్యకు దురాశ పుట్టింది.

మరుసటి రోజు శంకరయ్యతో కలిసి తను కూడా పూలు, కూరగాయలు కోశాడు. ఇద్దరూ కలిసి మార్కెట్టుకి వెళ్లారు. మధ్యాహ్నం అయ్యేసరికి శంకరయ్య ఇంటికి బంధువులు వచ్చారని తెలిసి బేరం రంగయ్యకి అప్పచెప్పి ఇంటికి వెళ్లాడు. సాయంత్రానికి మొత్తం సరుకు అమ్ముడైపోయి, డబ్బులు బాగా వచ్చాయి. ఆ సొమ్ముతో తన ఊరు వెళ్లిపోవాలని రంగయ్య అనుకున్నాడు. శంకరయ్య ఊరికి కాకుండా తన ఇంటికి తిరుగుముఖం పట్టాడు. కానీ దారిలో 'శంకరయ్య తనని ఎంతగా నమ్మాడో కదా! ఇలా అతడిని మోసం చేస్తే, రేపు తను ఎవరినీ నమ్మడు. స్నేహం మీద అతనికి నమ్మకం పోతుంది. అలా కాకూడదు. శంకరయ్య లాంటి స్నేహితుడిని పోగొట్టుకోకూడదు' అనుకున్నాడు. తనకి వచ్చిన చెడ్డ ఆలోచనకి మనసులోనే పశ్చాత్తాపపడి తిరిగి శంకరయ్య ఇంటి వైపు మళ్లాడు.



అందె రక్షణ,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
బక్రిచెప్యాల,
సిద్దిపేట జిల్లా,
97048 65816

నేను గీసిన బొమ్మ



దండు కావ్యశ్రీ,
8వ తరగతి,
జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,
నిజాంపేట, మెదక్.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆమె ఆదివాసీల గొంతు



పుట్టిన చోటు, పెరిగిన ప్రదేశం కొంతమందిపై చెరగని ముద్ర వేస్తుంది. అలా ముద్రపడిన సమూహంలో నుండి, తనపై పడిన గుర్తులను తుడిచేసుకుంటూ, సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించడం అంత ఆషామాషీ కాదు. అలాంటి ప్రాంతమే ఒరిస్సా మల్కాన్‌గిరి. ఎప్పుడూ మావోయిస్టు - పోలీసుల దాడులతో ఆ ప్రాంతం పేరు వార్తల్లో నిలుస్తుంది. అలాంటిచోట, ఆదివాసీ తెగలో పుట్టింది జయంతి బరుడా. పెరిగి పెద్దయ్యాక జర్నలిస్టు కావాలనుకుంది. ఆ దారిలో తను అందుకున్న ఉన్నత శిఖరాలు ఇప్పుడు ఆమెనే కాదు, ఆమె ఊరిని కూడా సగౌరవంగా నిలిపాయి.

ఆదివాసీ కోయ తెగకి చెందిన 35 ఏళ్ల జయంతి 11 మంది తోబుట్టువుల్లో ఒకరు. చిన్నతనంలో అడవిలో కట్టెలు, మహువా పూలు సేకరించడం, పశువుల పోషణ కోసం అమ్మతో వెళ్లడం జయంతికి బాగా గుర్తు. కొంచెం పెద్దయ్యాక చదువుకునేందుకు సర్కారు బడికి వెళ్లింది. ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్న ఆ స్కూల్లో పది మంది విద్యార్థులు పదో తరగతి వరకు చేరుకోవడం పెద్ద విశేషం. అంతకంటే మరో విశేషం అందరిలోకి అత్యధిక మార్కులతో జయంతి పదో తరగతి పాసవ్వడం.

జర్నలిజం నేర్చుకోవాలనుకున్నాను

పదో తరగతితో చదువుకు ముగింపు పలకాలని జయంత్రి ఇంట్లో వాళ్లు ఒత్తిడి చేశారు. కానీ జయంతి వాళ్లని ఒప్పించింది. 'మల్కాన్‌గిరి టౌన్‌లో కాలేజీకి వెళ్తూ, పక్కనే ఉన్న బస్తీ పిల్లలకు ట్యూషన్లు చెప్పేదాన్ని. అప్పుడే నాకు రెడ్ క్రాస్ సొసైటీ గురించి తెలిసింది. అక్కడ పేరు నమోదు చేసుకున్నాను. సోషల్ వర్క్‌లో భాగంగా ప్రభుత్వ అధికారులను కలిసేదాన్ని. కానీ అప్పుడు నాకు చాలా అవమానాలు ఎదురయ్యాయి. మహిళని, ఆపై నా తెగ, నా ప్రాంతం వారితో అలా మాట్లాడించింది. అయితే ఆ అధికారులు ఎంతో శ్రద్ధగా కొంతమంది జర్నలిస్టులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడం చూశాను. అప్పుడే నేను కూడా జర్నలిస్టు కావాలని నిర్ణయించుకున్నాను' అని జయంతి తన గత అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు.

విజయాల గురించి మాట్లాడాలని ...

'ఈ మనుషులు నాకు సమాధానాలు చెప్పాలంటే నేను జర్నలిజం చేయడం ఒక్కటే మార్గం. అలా చేస్తే నా మాటలకు విలువ ఉంటుంది. నాకు గౌరవం ఇస్తారు. నా ప్రశ్నలు వింటారు' అని నిర్ణయించుకున్న జయంతి కోరాపూట్ సెంట్రల్ యూనివర్శిటీలో మాస్ కమ్యూనికేషన్స్ అండ్ జర్నలిజంలో శిక్షణ తీసుకుని భువనేశ్వర్‌లోని ఓ ప్రైవేటు ఛానెల్లో పనిచేశారు. అయితే అక్కడ తను సేకరించిన వార్తలను గుర్తించేవారు కాదు. ఛానెల్లో గిరిజనుల గురించిన వార్తలు వచ్చిన ప్రతిసారీ అవి ఆ ప్రాంత నిరక్షరాస్యత, పేదరికం గురించే ఉండేవి. ఈ పద్ధతినే జయంతి మార్చాలనుకుంది. ఆదివాసీలు అంటే తక్కువ కాదని, వాళ్లు సాధించిన విజయాల గురించి మాట్లాడుకోవాలని గట్టిగా అనుకుంది.

హైద్రాబాద్‌లో వందలాది మందిని కలిశాను

కోయ తెగలో మొట్టమొదటి జర్నలిస్టుగా జయంతి సాగిస్తున్న ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచింది. తన ధైర్యం, తెగువ, కార్యసంకల్పం గురించి తెలిసిన స్నేహితులు, స్వచ్ఛంద సంస్థలు ఈసారి ఆమెకి తోడయ్యాయి. పికిల్ జార్ మీడియా సిఇఒ వాసంతి హరిప్రకాష్ ఆమెని నెట్‌వర్క్ ఉమెన్ ఇన్ మీడియా (ఎన్‌డబ్ల్యుఎంఐ)కి పరిచయం చేశారు. అప్పుడే జయంతి మొదటిసారి హైద్రాబాద్‌కి వచ్చారు. 'మా ఇంటి నుండి నడుచుకుంటూ ఆటో స్టాండుకు చేరుకున్నాను. అక్కడి నుండి పక్కనే ఉన్న మరో గ్రామానికి వెళ్లాను. ఆ తరువాత బస్సులో వైజాగ్ చేరుకున్నాను. అక్కడి నుండి విమానంలో హైద్రాబాద్‌కి వచ్చాను. అక్కడ 500 మంది మహిళలను కలుసుకున్నాను. వారంతా దేశవ్యాప్తంగా మారుమూల పల్లెల నుండి వచ్చిన జర్నలిస్టులు. వాళ్లని కలుసుకున్నాక నా ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది' అంటున్న జయంతి 2017లో ఎన్‌డబ్ల్యుఎంఐ నుండి ఫెలోషిప్‌ని పొందారు. సంస్థ ఇచ్చిన ల్యాప్‌టాప్‌లో తన ప్రాంతం గురించి, తన వారి గురించి స్టోరీలు చేయడం ప్రారంభించారు. వార్తలు సేకరించడం, ఎడిట్ చేయడం, అప్‌లోడ్ చేయడం వంటి వాటిలో తెగలోని కొంతమంది మహిళలకి నేర్పించారు. అందుకే 'మల్కాన్‌గిరి కోయలు అంటే నిరక్షరాస్యులు' అన్న భావజాలాన్ని తుడిపేస్తూ, వారికి ఆధునిక విజ్ఞానాన్ని వంటబట్టించిన జయంతిని వారంతా పెద్దక్క అని పిలుచుకుంటారు.



జంగిల్ రాణీ

2018 నాటికి 'బడా దీదీ యూనియన్' స్థాపించి రుతుక్రమ పరిశుభ్రత, పునురుత్పత్తి ఆరోగ్యంపై ఆదివాసీలకు అవగాహన కల్పించారు. పల్లెల్లో చిన్నారులు చదువుకునేలా రోడ్డు పక్కన బహిరంగ గ్రంథాలయం కూడా స్థాపించారు. తన వారి సాధికారత కోసం జయంతి నిరంతర ప్రయత్నాలు ఏళ్లకు ఏళ్లు అలా సాగుతూనే ఉన్నాయి. 2023లో 'మా కోసం, మా చేత మా కథ' అంటూ 'జంగిల్ రాణి' అనే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ స్థాపించి ఆదివాసీ జీవనవిధానాలను ప్రధాన స్రవంతి మీడియాలోకి తీసుకొచ్చారు. గిరిజనుల కథలను చెప్పేందుకు పలు సంస్థలతో కలిసి పనిచేయడం జయంతి దినచర్యల్లో భాగం. ప్రభుత్వం ఆమె సేవకి గుర్తింపుగా పిడబ్ల్యుడి క్వార్టర్‌ని ఇచ్చింది. ఉత్సాహవంతులైన ఆరుగురు గిరిజన యువతుల బాగోగులు చూడమని ఆమెకి అప్పగించింది. ఇప్పుడు జయంతి, వారికి అక్క.. అమ్మ.. ఆదివాసీ సాధికారత కోసం నిరంతరం శ్రమిస్తున్న జయంతి కృషికి గాను గతేడాది ఫోర్బ్స్ ఇండియాలో ఆమెకి స్థానం దక్కింది. దేశంలో గుర్తించిన 23 మంది స్వయం సిద్ధ మహిళల్లో జయంతి ఒకరిగా నిలిచారు.

కళ్ల సంరక్షణ ఇలా ...

ఎండాకాలంలో శరీరాన్ని సంరక్షించుకున్నట్లుగా కళ్ల పట్ల శ్రద్ధ చూపాలి. లేకుంటే డ్రై అయ్యి కంటి చూపు తగ్గే ప్రమాదం ఉంది. బయటికి వెళ్లేటప్పుడు సన్ గ్లాసెస్ తప్పనిసరిగా పెట్టుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.


- కంటి చుట్టూ సున్నితమైన పొరలు ఉంటాయి. వాటియితీ రక్షణగా ఉండేలా పెద్ద సన్‌గ్లాసెస్ వాడటంవల్ల హానికరమైన యూవీ కిరణాలు తగలకుండా ఉంటాయి. లేకుంటే కళ్లు పొడిబారడం, కళ్లు మంటలు, కళ్లల్లో నుంచి నీరు కారడం వంటివి జరుగుతాయి.
- వేసవిలో కంటి ఆరోగ్యం కోసం జావలు, కొబ్బరి నీళ్లు, మంచినీళ్లు, పుచ్చకాయ, ఖర్బూజ వంటివి ఎక్కువగా తీసుకోవాలి.
- కొన్నిసార్లు, హైడ్రేటెడ్‌గా ఉన్నా కళ్లు పొడిబారిపోతాయి. ఇలాంటి సమయంలో వైద్యున్ని సంప్రదించి కంటి చుక్కలు వాడితే మంచిది.
- కీరదోస లేదా బంగాళదుంపలను చక్రాల్లా కట్‌చేసి కళ్లపై తరుచూ అరగంటపాటు పెట్టుకోవాలి.
- గంటకోసారి చల్లటి నీటితో కళ్లను కడుక్కుంటూ ఉండాలి. కంటి చూపు మెరుగుపడేలా కళ్ల ఎక్సర్‌సైజ్ చేయాలి.





పైరసీపై ఉద్యమం చేయాల్సిందే!

'ఎవరి సినిమా ఎఫెక్ట్ అయితే వారే పైరసీపై మాట్లాడతారు. ఈ విషయాన్ని శుక్రవారం మాట్లాడితే.. సోమవారానికి మర్చిపోతున్నారు. దానికి అడ్డుకట్ట వేయాలంటే ఓ ఉద్యమం కావాలి. ఎఫ్‌డీసీ చైర్మన్‌గా నేను లీడ్ చేస్తాను. నిర్మాతలందరూ కలసి రావాలి. పైరసీ భూతం అంతం కావాలంటే పెద్దఎత్తున ఉద్యమం చేపట్టక తప్పదు. డబ్బులు పోయేది నిర్మాతలవే కాబట్టి అందరూ మేల్కోవాలి.' అని తెలంగాణా సినిమా పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్‌రాజు అన్నారు. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమా రీ రిలీజ్ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన పై విధంగా మాట్లాడారు. ఇటీవల విడుదలైన గేమ్‌ఛేంజర్, విదాముయార్చి, తండేల్ సినిమాలు పైరసీ బారిన పడిన విషయం తెలిసిందే.



'మార్కో'పై అభ్యంతరం

మలయాళీ నటుడు ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రలో నటించిన 'మార్కో' సినిమా శాటిలైట్ హక్కులను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ తిరస్కరించింది. ఉపగ్రహ హక్కులు పొందేందుకు బోర్డు చిత్రానికి నిర్దేశించిన 'ఎ' సర్టిఫికెట్ నుండి యు/ఎ కేటగిరీకి మార్చాలని నిర్మాతలు చేసిన అభ్యర్థనపై బోర్డు రీజనల్ అధికారి తాజాగా స్పందించారు. ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ల నుండి ఈ చిత్రాన్ని తొలగించడంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరుతూ బోర్డు చైర్‌పర్సన్‌ని కూడా సంప్రదించినట్లు తెలుస్తోంది. హనీఫ్ అదేని ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. డిసెంబర్ 20న మలయాళంలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.100 కోట్ల వసూళ్లను రాబట్టింది. ప్రస్తుతం ఓటీటీలో సోనీ లైవ్‌తో పాటు అమెజాన్ ప్రైమ్, ఆహాలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ చిత్రంలో కొన్ని దృశ్యాలు హింసాత్మకంగా, దారుణంగా ఉన్నయంటూ పిల్లలు చూసేటప్పుడు తల్లిదండ్రులు గమనించుకోవాలని సదరు అధికారి అభిప్రాయపడ్డారు.

ఆ పేరు కంఫర్ట్‌గా ఉండదు



దక్షిణాది సినీ పరిశ్రమలో అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటి నయనతార. ఆమెను అభిమానులు 'లేడీ సూపర్‌స్టార్' అని పిలుచుకుంటారు. తాజాగా ఆమె సోషల్ మీడియా వేదికగా ఈ బిరుదుపై ఒక నోట్‌ను విడుదల చేశారు. 'నా అభిమానులు ఎంతో ప్రేమతో నన్ను 'లేడీ సూపర్ స్టార్' అని పిలవడం ఆనందంగా ఉంది. కానీ నాకు నయనతార పేరే హృదయానికి దగ్గరైంది. ఆ పేరు నటిగానే కాకుండా వ్యక్తిగానూ నేనేంటో తెలియజేస్తుంది. నా జీవితం తెరిచిన పుస్తకం. నా విజయాల్లో, కష్ట సమయంలో మీరంతా అండగా ఉన్నారు. మీరెంతో ప్రేమతో ఇచ్చిన ఈ 'లేడీ సూపర్ స్టార్' బిరుదుకు నేను రుణపడి ఉంటా. కానీ, నయనతార అని పిలిస్తేనే నాకు ఆనందం. బిరుదులు వెలకట్టలేనివి. కానీ, వాటివల్ల కంఫర్ట్‌గా ఉండలేని పరిస్థితి ఉంటుంది. సినిమా మనందరినీ ఐక్యంగా ఉంచుతుంది. దాన్ని ఎప్పుడూ సెలబ్రేట్ చేసుకుందాం' అని నయనతార పేర్కొన్నారు.

అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి



నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే.. విజయశాంతి ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపిస్తారు. సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, అర్జున్ రాంపాల్ విలన్ రోల్ పోషిస్తున్నారు. ఈ సినిమాకు 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' అనే టైటిల్‌ని చిత్రబృందం కన్ఫర్మ్ చేసింది. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ చివరిదశకి చేరుకుంది. ముప్పా వెంకయ్య చౌదరి, సునీల్ బలుసు, అశోక్ వర్ధన్, కల్యాణ్ రామ్ కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ స్వరాలు అందిస్తున్నారు.

14 నుంచి 'లగ్జరీ లైఫ్' షూటింగ్

ఎన్ఎంఆర్ క్రియేషన్స్ బ్యానర్‌పై ఈనెల 14న 'లగ్జరీలైఫ్' సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని ప్రముఖ దర్శకుడు, నిర్మాత రెడ్రోతు మల్లేష్ నాయుడు తెలిపారు. ఈ సినిమాలో నటించేందుకు ఆసక్తి ఉన్న వారు తమను సంప్రదించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ : 86889 27238లో సంప్రదించాలని కోరారు.



శిశిరం తొలి షెడ్యూల్ పూర్తి

శ్రీకృష్ణ ఆర్ట్స్ బ్యానర్‌పై కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో రూపొందుతున్న బాలల చిత్రం 'శిశిరం' షూటింగ్ తొలి షెడ్యూల్ పూర్తయ్యింది. ఈ చిత్రంలోని కొన్ని కీలక సన్నివేశాలను తెనాలి, గోవాడ, సంగం జాగర్లమూడి గ్రామాల్లో చిత్రీకరించినట్టు దర్శకుడు రత్నాకర్ తెలిపారు. ఈనెలాఖరులో రెండో షెడ్యూల్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. తొలిపాట 'మూడు కనులు చాలవా ముక్కంటి' అనే పాటను విడుదల చేశామన్నారు. ఈ చిత్రానికి కోడైరెక్టర్‌గా రావూరి రమణ, అసోసియేట్ డైరెక్టర్‌గా విజయ్ వర్ధన్‌రాజ్, సినిమాటోగ్రఫీ డి.మధు, డిఒపిలుగా డి.నాగరాజు, స్టిల్స్ ఎస్ఎస్‌వి శేఖర్, ప్రొడక్షన్ డిజైనర్‌గా శ్రీకాంత్ వ్యవహరిస్తున్నారు.

ఫైనల్‌కు న్యూజిలాండ్

- భారీ ఛేదనలో సఫారీలు ఔట్
- రవీంద్ర, విలియమ్సన్ శతకాలు
- మిల్లర్ మెరుపు సెంచరీ
- 9న టైటిల్‌కై భారత్‌తో ఢీ



లాహోర్: ఐసిసి చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లోకి న్యూజిలాండ్ జట్టు దూసుకెళ్లింది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జరిగిన రెండో సెమీఫైనల్లో న్యూజిలాండ్ జట్టు 50 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కివీస్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 362పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. భారీ లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 9వికెట్ల నష్టానికి 312పరుగులు చేసింది. చివర్లో డేవిడ్ మిల్లర్(100నాటౌట్; 67బంతుల్లో 10ఫోర్లు, 4సిక్సర్లు) పోరాటం వృథా అయ్యింది. అంతకు ముందు న్యూజిలాండ్ జట్టులో కేన్ విలియమ్సన్, రచిన్ రవీంద్ర సెంచరీలతో రాణించగా.. బౌలింగ్‌లో కెప్టెన్ సాంట్నర్ మెరిసాడు. దీంతో ఆదివారం జరిగే ఫైనల్లో న్యూజిలాండ్ జట్టు టైటిల్‌కై టీమిండియాతో తలపడనుంది. లీగ్ దశలో న్యూజిలాండ్ జట్టు టీమిండియా చేతిలో పరాజయం పాలైన సంగతి తెలిసిందే.

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 48 పరుగుల వద్ద తొలి షాక్ తగిలింది. 21 పరుగులు చేసి విల్ యంగ్ ఔటయ్యాడు. ఆ తర్వాత రచిన్ రవీంద్ర(108), కేన్ విలియమ్సన్(102) రెండో వికెట్‌కు 164 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. రచిన్‌కి వన్డేల్లో ఇది ఐదో సెంచరీ. 101 బంతుల్లో 13 ఫోర్లు, ఒక సిక్సర్ సహాయంతో 108 పరుగులు చేశాడు. విలియమ్సన్‌కి ఇది వన్డేల్లో 15వ సెంచరీ. అతడు 94 బంతుల్లో 10 ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 102 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. ఆ వీరిద్దరు ఔటయ్యాక టామ్ లాథమ్ నాలుగు పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. అయితే, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ స్కోరుబోర్డును 300 దాటించారు. మిచెల్ తృటిలో అర్ధ సెంచరీకి దూరమ్యాడు. కేవలం 37 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్ సాయంతో 49 పరుగులు చేసి ఔటయ్యాడు. మైఖేల్ బ్రేస్‌వెల్(16) నిరాశపరిచినా.. ఫిలిప్స్ చివరి వరకు క్రీజ్‌లో నిలిచి 27 బంతుల్లో ఆరు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 49 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కెప్టెన్ మిచెల్ సాంట్నర్ రెండు పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో లుంగీ ఎన్గిడికి మూడు, కగిసో రబాడా రెండు, వియాన్ ముల్డర్‌కు ఒక వికెట్ దక్కాయి. చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో న్యూజిలాండ్ చేసిన 362పరుగులే అత్యధిక స్కోర్. ఈ టోర్నీలోనే ఇంగ్లండ్‌పై ఐదు వికెట్ల నష్టానికి 356 పరుగులు చేసిన ఆస్ట్రేలియా రికార్డును న్యూజిలాండ్ అధిగమించింది.

స్కోర్‌బోర్డు...

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: యంగ్ (సి)మార్‌క్రమ్ (బి)ఎన్గిడి 21, రచిన్ రవీంద్ర (సి)క్లాసెన్ (బి)రబడా 108, విలియమ్సన్ (సి)ఎన్గిడి (బి)ముల్డర్ 102, మిఛెల్ (సి)రబడా (బి)ఎన్గిడి 49, లాథమ్ (బి)రబడా 4, ఫిలిప్స్ (నాటౌట్) 49, బ్రాస్‌వెల్ (సి)రికెల్టన్ (బి)ఎన్గిడి 16, సాంట్నర్ (నాటౌట్) 2, అదనం 11. (50ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 362పరుగులు. **వికెట్ల పతనం:** 1/48, 2/212, 3/251, 4/257, 5/314, 6/360 **బౌలింగ్:** జాన్సెన్ 10-0-79-0, ఎన్గిడి 10-0-72-3, రబడా 10-1-70-2, ముల్డర్ 6-0-48-1, మహరాజ్ 10-0-65-0, మార్‌క్రమ్ 4-0-23-0

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: రికెల్టన్ (సి)బ్రాస్‌వెల్ (బి)హెన్రీ 17, బవుమా (సి)విలియమ్సన్ (బి)సాంట్నర్ 56, డుస్సెన్ (బి)సాంట్నర్ 69, మార్‌క్రమ్ (సి అండ్ బి)రచిన్ రవీంద్ర 31, క్లాసెన్ (సి)హెన్రీ (బి)సాంట్నర్ 3, డేవిడ్ మిల్లర్ (నాటౌట్) 100, ముల్డర్ (సి)రచిన్ రవీంద్ర (బి)బ్రాస్‌వెల్ 8, జాన్సెన్ (ఎల్‌బి)ఫిలిప్స్ 3, మహరాజ్ (సి)లాథమ్ (బి)ఫిలిప్స్ 1, రబడా (సి)ఫిలిప్స్ (బి)హెన్రీ 16, ఎన్గిడి (నాటౌట్) 1, అదనం 7. (50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 312పరుగులు. **వికెట్ల పతనం:** 1/20, 2/125, 3/161, 4/167, 5/189, 6/200, 7/212, 8/218, 9/256 **బౌలింగ్:** హెన్రీ 7-0-43-2, జేమీసన్ 7-1-57-0, రూర్కే 8-0-59-0, బ్రాస్‌వెల్ 10-0-53-1, సాంట్నర్ 10-0-43-3, రవీంద్ర 5-0-20-1, ఫిలిప్స్ 3-0-27-2.

వన్డేలనుంచి వైదొలుగుతున్నా..: స్టీవ్ స్మిత్



దుబాయ్: ఆస్ట్రేలియా వన్డే కెప్టెన్ స్టీవ్ స్మిత్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. వన్డే క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు బుధవారం ప్రకటించాడు. ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లో భారత్ చేతిలో ఓటమి అనంతరం స్మిత్ తన నిర్ణయాన్ని వెల్లడించాడు. టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్మిత్ తెలిపాడు. "వన్డేల్లో నా ప్రయాణాన్ని ముగించాలని నిర్ణయించుకున్నాను. నా ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలు ఉన్నాయి. రెండు ప్రపంచకప్‌లు గెలిచిన జట్టులో ఉన్నాను. ఎంతోమంది సహచరలతో కలిసి నా క్రికెట్ ప్రయాణాన్ని కొనసాగించాను. 2027 వన్డే ప్రపంచకప్‌కు యువ ఆటగాళ్లను సిద్ధం చేసేందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నాను. అందుకే వన్డే క్రికెట్‌కు వీడ్కోలు పలికేందుకు సిద్ధమయ్యాను. ముఖ్యంగా అత్యున్నతస్థాయిలో క్రికెట్ ఆస్ట్రేలియాకు ప్రాతినిధ్యం వహించడం ఎల్లప్పుడూ గర్వకారణమే. ఎల్లో జెర్సీ ధరిస్తే కలిగే ఆ అనుభూతిని వర్ణించలేను. నా ఈ ప్రయాణంలో మద్దతుగా నిలిచిన క్రికెట్ ఆస్ట్రేలియాకు, సహచరులు, అభిమానులకు ధన్యవాదాలు. ఇకపై టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటున్నాను. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్, వెస్టిండీస్, ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌ల కోసం ఎదురు చూస్తున్నాను" అంటూ స్మిత్ ఆ ప్రకటనలో పేర్కొన్నాడు. కాగా 2015, 2023 వన్డే ప్రపంచకప్ గెలిచిన ఆసీస్ జట్టులో స్మిత్ సభ్యునిగా ఉన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా మంగళవారం భారత్‌తో జరిగిన తొలి సెమీఫైనల్లో ఆస్ట్రేలియా జట్టు 4 వికెట్ల తేడాతో ఓటమి పాలైన సంగతి తెలిసిందే.

టేబుల్ టెన్నిస్‌కు శరత్ కమల్ గుడ్‌బై

- చెన్నైలో డబ్ల్యుటిటి చివరిదంటూ ప్రకటన



చెన్నై: భారత టేబుల్ టెన్నిస్ స్టార్ ఆటగాడు ఆచంట శరత్ కమల్ త్వరలో టిటి క్రీడకు గుడ్‌బై చెప్పనున్నాడు. ఈనెలలో చెన్నైలో జరిగే డబ్ల్యుటిటి టోర్నీ అనంతరం టేబుల్ టెన్నిస్ ఆటనుంచి వైదొలగనున్నట్లు బుధవారం ప్రకటించాడు. 1999లో చెన్నై వేదికగా జరిగిన ఆసియా జూనియర్ ఛాంపియన్స్‌లో వెలుగులోకి వచ్చిన 42ఏళ్ల శరత్ కమల్.. రెండు దశాబ్దాల అనంతరం మళ్లీ అదే ప్రదేశంలో తన ఆట నుంచి వైదొలగనున్నట్లు తెలిపాడు. కామన్వెల్త్ గేమ్స్‌లో 13పతకాలు సాధించిన శరత్ కమల్.. అందులో 7స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నాడు. 2018లాసియా క్రీడల్లో భారత టిటిజట్టు చారిత్రాత్మక కాంస్య పతకం చేజిక్కించుకోవడంలో శరత్ కమల్ కీలకపాత్ర పోషించాడు. మనిక బత్రాతో కలిసి మిక్స్‌డ్ విభాగంలో మరో కాంస్య పతకాన్ని సాధించాడు. గత ఏడాది జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించిన శరత్ కమల్ ఐదుసార్లు ఒలింపిక్స్‌కు ఎంపికైన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68